గురువారం
9-1-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 109
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అమెరికా సుప్రీంకోర్టుకు ట్రంప్

వాషింగ్టన్: అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తనకు శిక్ష విధిస్తానంటూ న్యూయార్క్ న్యాయమూర్తి జారీ చేసిన ఆదేశాలను అడ్డుకోవాలంటూ అభ్యర్థించారు. శృంగార తార స్టార్మీ డానియల్స్‌తో ట్రంప్ గతంలో ఏకాంతంగా గడిపారనే ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. 2016 అధ్యక్ష ఎన్నికల సమయంలో దీనిపై ఆమె నోరు విప్పకుండా ఉండేందుకు ట్రంప్ తన న్యాయవాది ద్వారా 1.30 లక్షల డాలర్ల హష్‌మనీ ఇచ్చారంటూ ఆరోపణలు వచ్చాయి. ప్రచార కార్యక్రమాల కోసం అందిన విరాళాల నుంచి ఆ మొత్తాన్ని ఖర్చు చేశారని ప్రధాన అభియోగం. అందుకోసం రికార్డులన్నింటినీ తారుమారు చేశారని ఆరోపణలు ఉన్నాయి.

‘ఆధునిక ఆంధ్రా’ ఆవిష్కరిస్తాం

రాష్ట్ర ప్రజల ఆశలకు అండగా ఉంటాం

విశాఖ సభలో ప్రధాని మోదీ ప్రకటన

ఉక్కు ఊసెత్తని ప్రధాని

రూ.2.8 లక్షల కోట్ల పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

విశాలాంధ్ర బ్యూరో–విశాఖపట్నం: ఆధునిక ఆంధ్రప్రదేశ్‌ను ఆవిష్కరిస్తామని, రాష్ట్ర ప్రజల ఆశలకు మద్దతుగా అన్ని విధాల ఆదుకుంటామని ప్రధాని నరేంద్రమోదీ చెప్పుకొచ్చారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మోదీ తొలిసారి విశాఖకు వచ్చారు. విశాఖపట్నంలోని ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో బుధవారం జరిగిన బహిరంగ సభలో మోదీ రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం సభలో ప్రధాని మాట్లాడుతూ రాష్ట్రానికి తన అభిమానం చూపించే అవకాశం ఇప్పుడు వచ్చిందన్నారు. తెలుగులో ప్రసంగం మొదలు పెట్టిన మోదీ ఆంధ్ర ప్రజల ప్రేమ, అభిమానానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఐదేళ్ల తర్వాత ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, చంద్రబాబు ప్రసంగంతో సిక్సర్ కొట్టారని పేర్కొన్నారు. 60 ఏళ్ల తర్వాత దేశంలో మూడోసారి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని మోదీ గుర్తు చేశారు. రాష్ట్రంలో చంద్రబాబు లక్ష్యాలకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని ప్రధాని చెప్పారు. ఏపీ ప్రజల ఆశలు, ఆశయాలకు మద్దతుగా నిలుస్తామన్నారు. ఏపీకి అన్ని రంగాల్లో మద్దతుగా నిలుస్తున్నామని, ఏపీతో భుజం భుజం కలిపి నడుస్తామని మోదీ పేర్కొన్నారు. ఇవాళ తలపెట్టిన ప్రాజెక్టులు రాష్ట్ర వికాసానికి తోడ్పడతాయని ప్రధాని వెల్లడించారు. దీంతోపాటు ఐటీ, టెక్నాలజీకి ఏపీ ప్రధాన కేంద్రం కానుందని మోదీ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులు ఏపీ అభివృద్ధిని సరికొత్త శిఖరాలకు చేరుస్తాయన్నారు. 2030లోగా ఐదు మిలియన్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తే తమ లక్ష్యమని ప్రధాని తెలిపారు. నవయుగ పట్టణీకరణకు ఏపీ సాక్ష్యంగా మారబోతోందని మోదీ చెప్పారు. విశాఖ ప్రత్యేక రైల్వే జోన్ డిమాండ్ చాలాకాలంగా ఉందని, చిరకాల కోరిక ఈరోజు నెరవేరిందన్నారు. రైల్వే జోన్ రాకతో వ్యవసాయంతోపాటు అనేక వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఏపీ అభివృద్ధి తమ విజన్ అని పేర్కొన్నారు. దేశంలో రెండు గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు వస్తుంటే... అందులో ఒకటి విశాఖకు కేటాయించామని మోదీ చెప్పారు. గ్రీన్ హైడ్రోజన్ హబ్ ద్వారా ఎంతోమందికి ఉపాధి లభిస్తుందని, నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్క్‌కు శంకుస్థాపన చేశామన్నారు. మూడు రాష్ట్రాల్లోనే ఇలాంటి బల్క్ డ్రగ్ పార్కులు వస్తున్నాయి. చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో క్రిస్ సిటీ భాగం అవుతుంది. ఇప్పటికే శ్రీసిటీ ద్వారా ఏపీలో తయారీరంగం ఊపందుకుంది. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు పునాదిరాయి వేశాం. రాష్ట్ర అభివృద్ధిలో రైల్వే జోన్ కీలకం కానుంది. రైల్వే జోన్ ద్వారా రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుంది. రైల్వే జోన్ వల్ల వ్యవసాయ, పర్యాటక రంగాలు ఊపందుకుంటాయని ప్రధాని మోదీ అన్నారు. ఏపీలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి విప్లవం రానుందన్నారు. మత్స్యకారులకు తోడ్పాటు అందిస్తున్నామని, వారికి కిసాన్ క్రెడిట్ కార్డులు అందించామని మోదీ తెలిపారు. ఆశ్చర్యమేమంటే సుదీర్ఘకాలంగా ఉద్యమం సాగుతున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ గురించి మోదీ ఒక్క మాట మాట్లాడలేదు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి కనీసం ప్రస్తావించలేదు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ ప్రపంచం మెచ్చే ఏకైక నాయకుడు మోదీ అన్నారు. ఏపీలో రూ.2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు మోదీతో కలిసి చంద్రబాబు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఏపీలో ఎన్డీఏ కూటమి 93 శాతం స్ట్రైక్‌రేట్‌తో ఘన విజయం సాధించిందన్నారు. భవిష్యత్తులోనూ ఈ కాంబినేషన్ కొనసాగుతుందన్నారు, దేశ రాజకీయాల్లో మోదీ ప్రధానిగా ఉంటారన్నారు. ఢిల్లీ ఎన్నికల్లోనూ ఎన్డీఏ గెలుస్తుందని, రాసి పెట్టుకోండి అంటూ చంద్రబాబు జోస్యం చెప్పారు. పేదల

- మిగతా 2 లో

‘మోదీ గో బ్యాక్’ నిరసన ఉద్రిక్తం

- విశాఖలో వామపక్ష కార్యకర్తలపై పోలీసుల దాష్టీకం
- రోడ్డుపై ఈడ్చుకెళ్లి అరెస్టు చేసిన వైనం
- కొంతమంది కార్యకర్తలకు గాయాలు
- స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరు ఆగదని సీపీఐ నేతల హెచ్చరిక

2 లో

తిరుపతిలో విషాదం

నలుగురు భక్తుల మృతి

విశాలాంధ్ర బ్యూరో–తిరుపతి: వైకుంఠ ద్వార సర్వదర్శనం టోకెన్ల జారీ నేపథ్యంలో తిరుపతిలో అపశ్రుతి చోటు చేసుకుంది. టోకెన్ల కోసం ఊహించని రీతిలో భక్తులు రావడంతో తీవ్ర తోపులాట జరిగింది. ఈ ఘటనలో నలుగురు భక్తులు మృతి చెందారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనలో మరికొంతమంది అస్వస్థతకు గురికావడంతో రుయా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రుయా ఆస్పత్రికి కలెక్టర్ వెంకటేశ్వర్, టీటీడీ ఈవో

- మిగతా 2 లో

సామాజిక కార్యకర్తలు విల్సన్, ధావలేకు బెయిల్

ముంబై: ఎల్గర్ పరిషత్ కేసులో పరిశోధకులు రోనా విల్సన్, సామాజిక కార్యకర్త సుధీర్ ధావలేకు బాంబే హైకోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసింది. సుదీర్ఘ కాలం జైలులో ఉండటం, విచారణ త్వరగా పూర్తయ్యే అవకాశం లేనందున వారికి బెయిల్ మంజూరు చేస్తున్నట్లు జస్టిస్ ఏఎస్ గడ్కరీ, జస్టిస్ కమల్ ఖాతాతో కూడిన ధర్మాసనం పేర్కొంది. విల్సన్, ధావలే లక్ష రూపాయల చొప్పున పూచీకత్తు సమర్పించాలని, విచారణ కోసం ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు ఎదుట హాజరుకావాలని

- మిగతా 2 లో

అసంబద్ధ వ్యాఖ్యలు: ప్రియాంక

న్యూఢిల్లీ: బీజేపీ మాజీ ఎంపీ రమేశ్ బిదూరి అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ బుధవారం స్పందించారు. ఎన్నికల సమయంలో ఇటువంటి వ్యాఖ్యలు హాస్యాస్పదమని, అసంబద్ధమని మండిపడ్డారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇటువంటి అనవసరమైన విషయాలకు బదులుగా ముఖ్యమైన అంశాలపై చర్చ జరపాలని హితవు పలికారు. ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ, ప్రియాంక గాంధీపై రమేశ్ బిదూరి అనుచిత వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఆయన వ్యాఖ్యలను ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండించాయి.

కోర్టు వర్సెస్ శాసనాధికారం

సీఈసీ, ఈసీల నియామక ప్రక్రియపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

విచారణ ఫిబ్రవరి 4కు వాయిదా

న్యూఢిల్లీ: భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్(ఈసీ)ల నియామక ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టేందుకు సుప్రీం కోర్టు అంగీకరించింది. వీటిపై ఫిబ్రవరి 4వ తేదీ విచారణ జరపనున్నట్లు ప్రకటించింది. “ఇది ఆర్టికల్ 141 కింద చట్టం రూపొందించే శాసనాధికారంపై కోర్టు అభిప్రాయంగా ఉంటుంది” అని బుధవారం తెలిపింది. న్యాయమూర్తులు సూర్యకాంత్, దీపాంకర్ దత్తా, ఉజ్జల్ భూయాల్‌తో కూడిన ధర్మాసనం ముందుకు కీలక అంశం ప్రస్తావనకు వచ్చింది. ప్రస్తుత సీఈసీ రాజీవ్ కుమార్ ఫిబ్రవరి 18న పదవీ విరమణ చేయబోతున్నారని, కోర్టు జోక్యం చేసుకోని పక్షంలో 2023 నాటి వివాదాస్పద చట్టం ప్రకారం కొత్త సీఈసీని నియమించవచ్చని ఎన్జీవో తరపున వాదిస్తున్న ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ధర్మాసనానికి తెలియజేశారు. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)తో సహా ఎన్నికల కమిషనర్లను నియమించడానికి ప్రధానమంత్రి, ప్రతిపక్షనేత, సీజేఐతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాల్సిందిగా మార్చి 2, 2023న అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిందని భూషణ్ తెలిపారు. అయితే కొత్తం చట్టం ప్రకారం ఎంపిక కమిటీ ప్రధానమంత్రి, ఒక కేంద్రమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్షనేత లేదా అతిపెద్ద పార్టీ నాయకుడు మాత్రమే ఎంపిక కమిటీలో ఉంటారు. ఎంపిక కమిటీనుంచి సీజేఐని వారు తొలగించారు’ అని భూషణ్ వివరించారు. విచారణను ఫిబ్రవరి4కు వాయిదా వేసిన ధర్మాసనం... ఈ అంశాన్ని అంచనా వేసి ఎవరి వాదనలకు ప్రాధాన్యముందో నిర్ణయిస్తామని తెలిపింది. రాజ్యాంగాన్ని సవరించకుండా మార్చి 2 నాటి అత్యున్నత న్యాయస్థానం తీర్పును ప్రభుత్వం దాటవేయలేదని పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ వాదించారు. ‘కేంద్రం సుప్రీం తీర్పును అధిగమించగలిగే ఏకైక మార్గం చట్టాన్ని రూపొందించకుండా రాజ్యాంగాన్ని సవరించడం” అని ఆయన వాదించారు. ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ... సీఈసీ, ఈసీల నియామకాలపై ప్రభుత్వ నియంత్రణ ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తుందన్నారు. “సుప్రీంకోర్టు ఏర్పాటు చేయాలని సూచించిన సెలక్షన్ కమిటీ నుండి ప్రభుత్వం సీజేఐని తొలగించరాదు” అని ఆయన అన్నారు. ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, సీజేఐతో కూడిన కమిటీ సిఫార్సు మేరకు రాష్ట్రపతి తప్పనిసరిగా సీఈసీ, ఈసీల నియామకాలు చేపట్టాలని మార్చి 2వ తేదీ నాటి తీర్పు స్పష్టంగా పేర్కొంది. ఈ కట్టుబాటు, పార్లమెంటు చట్టాన్ని రూపొందించే వరకు నిలబడుతుందని కోర్టు పేర్కొందన్నారు. పిటిషనర్ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తరపున ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. 2023 చట్టం ప్రకారం సీజేఐని మినహాయించడం ... కార్యనిర్వాహక వ్యవస్థ అధిక జోక్యం

- మిగతా 2 లో

కేటీఆర్ కనిపించేంత దూరంలో న్యాయవాది ఉండేలా అనుమతి

ఏసీబీ విచారణలో ఆడియో, వీడియో రికార్డుకు హైకోర్టు నిరాకరణ

విశాలాంధ్ర – హైదరాబాద్: ఫార్ములా ఈ– రేసు కేసులో ఏసీబీ విచారణకు మాజీ మంత్రి కేటీఆర్ వెంట న్యాయవాదిని తీసుకెళ్లేందుకు హైకోర్టు అనుమతించింది. విచారణ ఆడియో, వీడియో రికార్డు చేసేందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఏసీబీ విచారణకు వెళ్లే సమయంలో తన వెంట న్యాయవాదిని అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ కేటీఆర్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. విచారణకు వెళ్లే సమయంలో న్యాయవాదిని అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను కేటీఆర్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. న్యాయవాది రామచంద్రరావు కేటీఆర్ వెంట విచారణకు హాజరవుతారని కోర్టుకు తెలిపారు. కేటీఆర్ విచారణను ఆడియో, వీడియో రికార్డు చేయాలని న్యాయవాది కోరగా... అందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. న్యాయవాది లైబ్రరీలో కూర్చుంటే కేటీఆర్ విచారణ కనిపిస్తుందని ఈ సందర్భంగా ఏఏజీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. న్యాయవాదితో కలిసి గురువారం ఏసీబీ విచారణకు వెళ్లాలని న్యాయస్థానం కేటీఆర్‌కు సూచించింది. విచారణ తర్వాత ఏవైనా అనుమానాలుంటే మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని హైకోర్టు తెలిపింది. కేటీఆర్‌పై థర్డ్ డిగ్రీ ఉపయోగించే అవసరం లేనప్పుడు.. ఇన్వెస్టిగేషన్ రూమ్‌లో న్యాయవాది ఉండడం ఎందుకు అని కోర్టు ప్రశ్నించింది. ఏసీబీ విచారణకు కేటీఆర్‌తో పాటు వెళ్లేందుకు ముగ్గురు న్యాయవాదుల పేర్లను సూచించాలని... అందులో ఒకరికి అనుమతిస్తామని హైకోర్టు పేర్కొంది. దర్యాప్తు అధికారి, కేటీఆర్ ఓ గదిలో ఉంటే... వాళ్లిద్దరూ కనిపించేంత దూరంలో న్యాయవాది ఉండేలా అనుమతి ఇస్తామని హైకోర్టు తెలిపింది. ఈ మేరకు ఏసీబీ కార్యాలయంలో ఏర్పాట్లు ఉన్నాయో లేవో తెలుసుకొని చెప్పాలని అదనపు అడ్వొకేట్ జనరల్‌ను ఆదేశించింది. ఎంపీ అవినాశ్‌రెడ్డి సీబీఐ విచారణను ఎదుర్కొనే సమయంలో న్యాయవాదిని అనుమతిస్తూ ఇదే హైకోర్టు సైతం తీర్పు ఇచ్చిందని జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. న్యాయవాదిని అనుమతించొద్దని ఏసీబీ తరఫున వాదించిన అదనపు అడ్వకేట్ జనరల్ తేరా రజినీకాంత్ రెడ్డి

- మిగతా 2 లో

ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడిగా ఐవీ సుబ్బారావు మళ్లీ ఎన్నిక

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) అధ్యక్షుడిగా ఐవీ సుబ్బారావు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడితో పాటు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుల ఎన్నిక నిమిత్తం గత ఏడాది డిసెంబర్ 26వ తేదీన నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈనెల 2వ తేదీన నామినేషన్ల దాఖలుకు తుది గడువు. అధ్యక్షుడిగా పోటీ చేసే వారికి రాష్ట్రంలోని 16 జిల్లాల నుంచి కనీసం 20 మంది సభ్యులు ప్రతిపాదించాల్సి ఉంది. అధ్యక్ష పదవికి ఐవీ సుబ్బారావు డిసెంబర్ 28న నామినేషన్ దాఖలు చేయగా, ఆయనను బలపరుస్తూ 23 జిల్లాల నుంచి రికార్డుస్థాయిలో 51 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. 7వ తేదీతో నామినేషన్ల దాఖలుకు గడువు ముగిసింది. అధ్యక్ష పదవికి మరెవ్వరూ పోటీ చేయకపోవడంతో ఐవీ సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి డి.సోమసుందర్, సహాయ ఎన్నికల అధికారి షేక్ బాబు బుధవారం అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సుబ్బారావుకు ధృవీకరణ పత్రాన్ని అందజేశారు. రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన సుబ్బారావును ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర, జిల్లాల నేతలు అభినందించారు.

ఇదీ లోకం!

ఇస్రో కొత్త సారథి నారాయణన్

14న బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర –సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్‌గా వి.నారాయణన్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు చైర్మన్‌గా పనిచేసిన డాక్టర్ సోమనాథ్ ఈనెల 13వ తేదీన పదవీ విరమణ చేస్తుండటంతో ఆయన స్థానంలో నారాయణన్‌ను నియమించారు. 14వ తేదీన నారాయణన్ బాధ్యతలు చేపడతారు. తమిళనాడులోని కన్యాకుమారిలో సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన నారాయణన్ ఐఐటీ ఖరగ్‌పూర్‌లో క్రయోజనిక్ ఇంజినీరింగ్‌లో ఎంటెక్ పూర్తి చేశారు. 2001లో స్పేస్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ పట్టా పొందారు. నారాయణన్ రెండేళ్లు ఇస్రో చైర్మన్‌గా కొనసాగుతారు. నారాయణన్ ప్రస్తుతం ఇస్రోలో లిక్విడ్ ప్రపోషన్ సిస్టం సెంటర్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇస్రోలో నాలుగు దశాబ్దాలుగా వివిధ హోదాల్లో పనిచేశారు. రాకెట్, స్పేస్ క్రాఫ్ట్ చోదక

- మిగతా 2 లో



తెలుగు నేలపై కమ్యూనిజం జాడలు

తెలుగు వారు చరిత్రలో అనేకసార్లు విడిపోయారు. అనేక సందర్భాలలో కలిసి ఉన్నారు. కాకతీయుల కాలంలో 12వ శతాబ్దంలో దాదాపు తెలుగు మాట్లాడే ప్రాంతమంతా సమైక్యంగా ఉంది. ఆ తరవాత కుతుబ్ షాహీల కాలంలోనూ తెలుగు మాట్లాడేవారున్న ప్రాంతాలు కలిసే ఉన్నాయి. బ్రిటీష్‌వారి హయాంలో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అనుకుంటున్న తెలుగు మాట్లాడే ప్రాంతాలు ఉమ్మడి మద్రాసులో భాగం.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

ప్రజల సాంస్కృతిక మేల్కొలుపులో ఇప్టా మూలాలు

90 వసంతాల వేడుకలో కూనంనేని

విశాలాంధ్ర– హైదరాబాద్: దేశంలో ప్రజల సాంస్కృతిక మేల్కొలుపులో ఇప్టా మూలాలు ఉన్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు తెలిపారు. ఇండియన్ ప్యూపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) 90 వసంతాల వేడుకలు బుధవారం తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఘనంగా జరిగాయి. ఇప్టా, తెలంగాణ ప్రజానాట్య మండలి సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి అరసం జాతీయ నాయకుడు ఆర్.వి.రామ రావు అధ్యక్షత వహించారు. అభ్యుదయ సాంస్కృతికోద్యమ కృషీవలుడు, నటుడు, ప్రజానాట్య మండలి సీనియర్ నేత నల్లూరి వెంకటేశ్వరరావు, నటుడు, ప్రముఖ అభ్యుదయ రచయిత కందిమళ్ల ప్రతాప్ రెడ్డి, ప్రముఖ కవి, అభ్యుదయ రచయిత డాక్టర్ ఏటుకూరి ప్రసాద్‌లను ఘనంగా సన్మానించారు. కూనంనేని మాట్లాడుతూ... సామాజిక బాధ్యత, జాతీయ సమైక్యతపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో అభ్యుదయ కవులు, రచయితలు, కళాకారులలో జన్మించిన ఇప్టా, కైఫీ అజ్మీ, మజ్రూహ్ సుల్తాన్‌పురి, సాహిర్ లుధియాన్వీ, బల్‌రాజ్ సాహ్ని, మోహన్ సెగల్, ముల్క్‌రాజ్, షబానా అజ్మీ, ఫరూక్ షేక్, కాదర్ ఖాన్, నాగభూషణం,

- మిగతా 2 లో

షేక్ హసీనా వీసా గడువు పొడిగింపు?

న్యూఢిల్లీ: భారత్‌లో ఆశ్రయం పొందుతోన్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా పై స్వదేశంలో ఎన్నో ఆరోపణలు రావంతో ఆమెను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం ఇప్పటికే భారత్‌ను కోరింది. తాజాగా ఆమె పాస్‌పోర్టును రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పరిణామాల వేళ భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆమె వీసా గడువును పొడిగించినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ వివిధ ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. హసీనా మరికొంత కాలం భారత్‌లో ఉండేందుకు వీలుగా ఆమె వీసా గడువును భారత ప్రభుత్వం పొడిగించినట్లు సదరు వర్గాలు వెల్లడించాయి. స్థానిక ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ ద్వారా వచ్చిన అభ్యర్థనను కేంద్రం పరిశీలించిన అనంతరం పొడిగింపుపై నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇదే సమయంలో హసీనాకు శరణార్థిగా ఆశ్రయం కల్పించనున్నారంటూ వస్తున్న వార్తలను ఆ వర్గాలు తోసిపుచ్చాయి.

బందీలను విడిచిపెట్టండి

హమాస్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరిక

వాషింగ్టన్: ఇజ్రాయిల్-హమాస్ మధ్య యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న క్రమంలో హమాస్‌కు అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరిక చేశారు. తాను అధ్యక్ష బాధ్యతలు చేపట్టకముందే హమాస్ మిలిటెంట్ సంస్థ... తమ చెరలో ఉన్న బందీలను విడిచిపెట్టాలని స్పష్టం చేశారు. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. తాను అధ్యక్ష బాధ్యతలు చేపట్టేసరికి బందీలు తిరిగి రాకపోతే పశ్చిమాసియాలో ఆకస్మిక దాడులు జరుగుతాయని పేర్కొన్నారు. గతేడాది డిసెంబర్‌లో కూడా హమాస్‌ను ట్రంప్ ఇదే విధంగా తీవ్రంగా హెచ్చరించారు. తాను అమెరికా అధ్యక్షుడిగా 2025 జనవరి 20న బాధ్యతలు స్వీకరిస్తానని ట్రంప్ స్పష్టం చేశారు. ఈలోపు బందీలను విడుదల చేయాలని తేల్చి చెప్పారు. లేదంటూ నరకం చూస్తారని, గతంలో ఎన్నడూ చూడని పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. కాగా, గతేడాది అక్టోబర్ 7న ఇజ్రాయిల్‌పై హమాస్ మెరుపు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిలో వెయ్యిమందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. దాడి అనంతరం దాదాపు 200 మందికిపైగా ప్రజలను హమాస్ బంధించి గాజాలోకి తీసుకెళ్లింది. ఆ తర్వాత తాత్కాలికంగా జరిగిన కాల్పుల విరమణ ఒప్పందం సందర్భంగా కొందరిని విడుదల చేసింది. బందీల్లో కొందరు ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం 51 మంది సజీవంగా ఉన్నారు.

ఐరోపా జోలికొస్తే...సహించం

ట్రంప్‌కు ఫ్రాన్స్ హెచ్చరిక

పారిస్: ఐరోపా దేశాల సరిహద్దుల సార్వభౌమత్వాన్ని ఎవరు ఉల్లంఘించినా సహించేది లేదని ఫ్రాన్స్ హెచ్చరించింది. తాజాగా గ్రీన్ ల్యాండ్ విలీనంపై ట్రంప్ వ్యాఖ్యానించడం ఐరోపా సమాఖ్యలో కలకలం సృష్టించిన క్రమంలో ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జీయోన్ నోయల్ బార్రోట్ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'ప్రపంచంలో ఏ దేశమైనా సరే ఐరోపా సమాఖ్య సరిహద్దులపై దాడి చేస్తే... ఊరుకోబోం. మాది బలమైన ఖండం. డెన్మార్క్‌లో దాదాపు 600 ఏళ్ల నాటి నుంచి భాగమైన గ్రీన్‌ల్యాండ్‌ను, అలానే పనామా కాల్వను అమెరికా ఆక్రమించుకుంటుందంటే నేను నమ్మను. పరిస్థితులకు తగ్గట్లు మార్పులు చేసుకొనే వారు మాత్రమే తట్టుకోగలిగే యుగంలో ఉన్నామా అంటే... అవును అనే చెబుతాను. ఐరోపా సమాఖ్య అతిగా ఆందోళన చెందడంకానీ బెదరడం కానీ చేయకూడదు. మేల్కొని బలోపేతం కావాలి' అని ఆయన అన్నారు. ఫ్రాన్స్ ఇంటర్ రేడియో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గ్రీన్ ల్యాండ్‌పై సైనిక శక్తి ఉపయోగించబోనన్న హామీ ఇవ్వలేనంటూ డొనాల్డ్ ట్రంప్ తాజాగా చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి.

తిరుపతిలో విషాదం

(మొదటిపేజీ తరువాయి)

శ్యామలరావు చేరుకొని వైద్య సేవలను పర్యవేక్షిస్తున్నారు. తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, సత్యనారాయణపురం బైరాగిపట్టెడ రామానాయుడు స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాల్లో భక్తుల మధ్య తోపులాట జరిగింది. గురువారం ఉదయం 5 గంటల నుంచి తిరుపతిలోని తొమ్మిది కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 94 కౌంటర్ల ద్వారా వైకుంఠ ద్వార దర్శనం టోకెన్లు జారీ చేయాలని టీటీడీ నిర్ణయించింది. అయితే, టోకెన్ల కోసం బుధవారం సాయంత్రమే భక్తులు భారీగా తరలివచ్చారు. ఒకరు అస్వస్థతకు గురికావడంతో వారిని బయటకు తరలించేందుకు గేటు తెరవడంతో ఒక్కసారిగా అంతా దూసుకొచ్చారు. దీంతో ఈ దుర్ఘటన జరిగింది. తొక్కిసలాటలో గాయపడిన బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని భావిస్తున్నారు. తోపులాట జరిగిన ప్రాంతాలకు విజిలెన్స్, పోలీసు బలగాలు భారీగా చేరుకున్నాయి. మరోవైపు, ఘటనా స్థలం వద్ద పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు నగర కమిషనర్ తెలిపారు.

ఇస్రో కొత్త సారథి నారాయణన్

(మొదటిపేజీ తరువాయి)

వ్యవస్థలో ఆయనకు అపార అనుభవం ఉంది. ద్రవ, సెమీ క్రయోజిని, క్రయోజనిక్, చోదక వ్యవస్థ అభివృద్ధిలో ఆయన పాలుపంచుకున్నారు. ఇస్రోకు చెందిన జీఎస్ఎల్‌వీ మార్క్ 2, మార్క్ 3 వాహక నౌక రూపకల్పనలో కీలక భూమిక పోషించారు. ఆదిత్య-1, చంద్రయాన్-2, చంద్రయాన్-3లోని చోదక వ్యవస్థల అభివృద్ధికి ఆయన కృషి చేశారు. నూతన బాధ్యతలు చేపట్టనున్న నారాయణన్‌కు ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

భారత అంతరిక్ష కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అత్యంత విజయవంతమైన దశలో ఉందని ఇస్రో చైర్మన్‌గా నియమితులైన ప్రముఖ రాకెట్ శాస్త్రవేత్త వీ నారాయణన్ వెల్లడించారు. ఇస్రో చైర్మన్‌తో పాటు అంతరిక్ష శాఖ కార్యదర్శిగా తనను నియమించడంపై సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం నాడిక్కడ ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఎంతో మంది గొప్ప శాస్త్రవేత్త గతంలో అనేక మంది గొప్ప నేతలు ఇస్రోను నడిపించారని, ఈ సంస్థలో భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. తన నియామకం గురించి తొలుత ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఫోన్ వచ్చినట్లు వీ నారాయణన్ చెప్పారు. ప్రస్తుత ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ కూడా తనకు ఫోన్ కాల్ చేశారని, కొత్త నియామకం గురించి చెప్పినట్లు తెలిపారు. త్వరలో చేపట్టబోయే ఇస్రో ప్రాజెక్టుల గురించి మాట్లాడుతూ... ఇస్రో చాలా కీలకమైన మిషన్లను చేపడుతున్నదని, స్పేడెక్స్ మిషన్‌ను డిసెంబర్ 30వ తేదీన చేపట్టామని, జనవరి 9వ తేదీన స్పేడెక్స్ శాటిలైట్ల డాకింగ్ జరగనున్నట్లు ఆయన తెలిపారు. గగన్‌యాన్ కూడా ఇస్రో ముందున్న అతిపెద్ద ప్రోగ్రామ్ అని పేర్కొన్నారు. సిబ్బంది లేకుండా మాడ్యూల్‌ను ప్రయోగించే దాని కోసం ఇస్రోలో పనులు జరుగుతున్నాయన్నారు. జీఎస్ఎల్వీ ద్వారా ఎన్వీఎస్ 02 నావిగేషన్ శాటిలైట్‌ను పంపేందుకు శ్రీహరికోటలో పని జరుగుతోందన్నారు. ఇస్రో మాక్3 వెహికిల్ ద్వారా అమెరికాకు చెందిన కమర్షియల్ శాటిలైట్‌ను కూడా ప్రయోగించనున్నట్లు తెలిపారు. గగన్‌యాన్ రాకెట్ అసెంబ్లింగ్‌కు చెందిన పనులు కూడా శ్రీహరికోట్లో పురోగతిలో ఉన్నాయని, చంద్రయాన్3 ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండ్ అయిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. చంద్రయాన్ 4 ద్వారా ఆ ప్రదేశంలో చంద్రుడిపై ల్యాండ్ అయ్యి, అక్కడి నమూనాలు సేకరించిన తర్వాత మళ్లీ తిరిగి వచ్చే రీతిలో పనులు జరుగుతున్నాయన్నారు. భారత అంతరిక్ష కేంద్రం నెలకొల్పేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని కూడా నారాయణన్ వెల్లడించారు. ఇందుకు ప్రధాని మోదీ నుంచి అనుమతి వచ్చిందని తెలిపారు. అంతరిక్ష కేంద్రానికి 5 మాడ్యూళ్లు ఉంటాయని, 2028లో స్పేస్ స్టేషన్‌కు తొలి మాడ్యూల్‌ను ప్రారంభిస్తామని వివరించారు.

'మోదీ గో బ్యాక్' నిరసన ఉద్రిక్తం

విశాలాంధ్ర-విశాఖ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖ పర్యటన సందర్భంగా... విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వామపక్షాలు చేపట్టిన నిరసన ఉద్రిక్తంగా మారింది. వామపక్షాల నాయకులు, కార్యకర్తలపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. బలవంతపు అరెస్టులకు పాల్పడ్డారు. బుధవారం వామపక్ష పార్టీల అధ్వర్యంలో విశాఖ జిల్లా మద్దిలపాలెం జాతీయ రహదారి దగ్గర నిరసన చేపట్టారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను అమ్మే నిర్ణయాన్ని విరమించుకోవాలని, ప్లాంట్‌కు సొంత గనులను కేటాయిస్తూ ప్రధాని మోదీ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారులను పోలీసులు అడ్డగించడంతో తోపులాట జరిగింది. తీవ్ర ఉద్రిక్తత నడుమ నిరసనకారులను బలవంతంగా లాక్కెళ్లిన పోలీసులు వ్యాన్‌లలో పోలీస్ స్టేషన్లకు తరలించారు. ప్రధాని మోదీ విశాఖ పర్యటనను అడ్డుకుంటామని ముందే ప్రకటించిన సీపీఐ సహా వామపక్షాల కార్యకర్తలు నగరంలోని మద్దిలపాలెం జాతీయ రహదారి వద్ద ఆందోళనకు దిగారు. వేల మంది పోలీసుల వలయాన్ని ఛేదించుకుంటూ ఆంధ్ర విశ్వ కళా పరిషత్ ఇంజనీరింగ్ కళాశాల గేటు వైపు మూకుమ్మడిగా కదిలారు. రాష్ట్ర ప్రజలని మోసం చేస్తున్న 'మోదీ గో బ్యాక్ ' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ సభా ప్రాంగణం వైపు కదిలారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, రాష్ట్రానికి తలమానికమైన విశాఖ స్టీల్ ప్లాంట్ ను అమ్మేస్తామని ప్రకటించిన మోదీ... ఏ ముఖం పెట్టుకొని విశాఖ వస్తారని మండిపడ్డారు. విశాఖ ఉక్కు రాష్ట్ర ప్రజల హక్కు అని నినాదాలు చేశారు. ఉక్కు కర్మాగారాన్ని అమ్మేస్తే చూస్తూ ఊరుకొబోమని హెచ్చరించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మడం లేదని ప్రకటన చేసి...రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఉక్కు కర్మాగారానికి గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులతో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటం ఆగబోదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలకు వరుసగా అన్యాయం చేస్తున్న మోదీ అడుగులకు మడుగులొత్తుతున్న సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వైఖరిని తప్పుబట్టారు. ఈ సభలోనే ఏపీకి జరిగిన అన్యాయంపై మోదీని గట్టిగా నిలదీయాలని చంద్రబాబు, పవన్ లను డిమాండ్ చేశారు. మోదీకి దాసోహం అయ్యి విశాఖ స్టీల్ ప్లాంట్ కు కూటమి ప్రభుత్వం తీవ్ర ద్రోహం తలపెట్టిందని విమర్శించారు. ఆర్సీ లార్ మిట్టల్ కు దొడ్డిదారిన విశాఖ స్టీల్ ప్లాంట్ కు కట్టబెట్టాలని కుట్ర చేస్తున్నారని, వెంటనే ఈ దుర్మార్గాన్ని ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ క్రమంలో సీపీఐ, సీపీఎం కార్యకర్తలపై పోలీసులు దాష్టీకం ప్రదర్శించారు. కార్యకర్తలను రోడ్లపై ఈడుస్తూ తీసుకెళ్లి వ్యాన్లలో ఎక్కించి అరెస్టు చేశారు. దీంతో కొంతమంది గాయపడ్డారు. నగరంలోని ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ కి తరలించారు. అరెస్టయిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, షేక్ రెహమాన్, అత్తిలి విమల, మన్మథరావు, ఆర్ శ్రీనివాస్, పి.చంద్రశేఖర్, జిల్లా సమితి సభ్యులు ఎం.ఎ. బేగం, ఎ. దేముడమ్మ, కె వనజ, పి పద్మ, వై.రాంబాబు, ఎ.అన్నపూర్ణ, నాగభూషణం, కె.అచ్యుత, యు.నాగరాజు, పి.గోవింద్, పార్టీ కార్యకర్తలు గురుమూర్తి, అరుణ, కె రజనీ, రామలక్ష్మి, ఎన్.రజని, మిన్నారావు, పుష్పలత, ఎం.రాము, శ్రీరామ్, దుర్గారావు, ఎం. నారాయణ, సీపీఎం నాయకులు ఆర్ కే ఎస్‌వీ కుమార్, బి జగన్, బట్టా ఈశ్వరమ్మ, పీ మణి, వీ కృష్ణారావు, ఎం సుబ్బారావు, డి. అప్పలరాజు, ఏపీఎఫ్‌టీయూ నాయకులు దేవ తదితరులు ఉన్నారు. కాగా గత రాత్రి నుండే విశాఖ, అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా సిపిఎం, సిపిఐ నాయకులను గఅహనిర్బంధాలు చేసి పోలీస్ స్టేషన్లలో కస్టడీలో ఉంచారు.

సీపీఐ నాయకులకు జేవీఎస్ మూర్తి పరామర్శ

అరెస్టయిన సీపీఐ నాయకులు, కార్యకర్తలను ఎంవీపీ పోలీస్ స్టేషన్ లో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ కార్యకర్తల అక్రమ అరెస్టులను ఖండించారు. ప్రధాని మోదీ పదేళ్లుగా ఏపీ ప్రయోజనాల విషయంలో తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదని, రాష్ట్రంలో ఏకైక ప్రభుత్వ రంగ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయడానికి పూనుకొని దాన్ని నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు అంగీకరించేది లేదని గతంలో చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్... తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ పై మాట్లాడకపోవడం అన్యాయమని విమర్శించారు. సీపీఐ నాయకులు కార్యకర్తలను పరామర్శించిన వారిలో జిల్లా కార్యవర్గ సభ్యులు జీఎస్‌జే అచ్యుతరావు, సీఎన్ క్షేత్రపాల్ రెడ్డి ఉన్నారు.

విశాఖలో ప్రధాని మోదీ రోడ్‌షో

విశాలాంధ్ర-విశాఖపట్నం: విశాఖలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రోడ్‌షో నిర్వహించారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, ప్రారంభాల కోసం బుధవారం విశాఖపట్నం చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీ... ఐఎన్ఎస్ డేగా నుంచి సాయంత్రం సిరిపురం లోని స్థానిక వెంకటాద్రి వంటిల్లు జంక్షన్ కి చేరుకున్నారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఓపెన్ టాప్ వాహనంలో మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ రోడ్ షో నిర్వహించారు. ఈ క్రమంలో ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది. రోడ్డుకిరువైపుల నుంచి పూలు చల్లుతూ స్వాగతం పలికారు. వెంకటాద్రి వంటిల్లు నుంచి ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానం వరకు సుమారు కిలో మీటరు మేర రోడ్‌షో కొనసాగగా... వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలకు అభివాదం చేసుకుంటూ ప్రధాని ముందుకు సాగారు.

నిలిచిపోయిన బస్సులు... అవస్థలు పడ్డ ప్రజలు

ప్రధాని మోదీ విశాఖపట్నం పర్యటన సందర్భంగా పోలీసులు విధించిన ట్రాఫిక్ ఆంక్షలు నగరవాసులకు చుక్కలు చూపించాయి. ఓవైపు మద్దిలపాలెం మీదుగా ప్రయాణాలు సాగించేవారు, మరోవైపు పేదవాల్తేరు సిరిపురం మీదుగా వెళ్లే వారు ఇబ్బందులు పడ్డారు. పోలీసులు ముందే ట్రాఫిక్ మళ్లింపుల గురించి ప్రకటించినప్పటికీ ఉద్యోగులు, వృత్తిదారులు, రోజువారీ కూలి పనులు చేసుకునే వారు బయటికి రాక తప్పలేదు. పోలీసులు సూచించిన ప్రత్యామ్నాయ మార్గాలలో ప్రయాణం చేసినప్పటికీ, అక్కడి రహదారులపై ట్రాఫిక్ నిర్వహణ విషయంలో పోలీసులు తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇవ్వలేదు. దీంతో గంటల తరబడి వాహనాలు ట్రాఫిక్ లో చిక్కుకున్నాయి. అసలే పండగ సీజన్ కావడంతో దూర ప్రాంతాల నుంచి నగరంలోకి వచ్చినవారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదే సమయంలో ప్రధాని సభకు భారీ ఎత్తున ప్రజలను తరలించడానికి ఏర్పాటుచేసిన బస్సులు ట్రాఫిక్ లో చిక్కుకొని ఎక్కడికి అక్కడ నిలిచిపోయాయి. పదుల సంఖ్యలో బస్సులు సభాస్థలికి ప్రజలను చేరవేయకుండానే మార్గమధ్యంలోనే ఉండిపోయాయి. బహిరంగ సభ ముగిసేంతవరకు ప్రజలు బస్సుల్లోనే ఉండిపోయి... వెనుతిరిగారు. భారీ ఎత్తున జనాల తరలింపుకోసం పెద్ద ఎత్తున బస్సులు ఉపయోగించడంతో వాటిలో కొన్ని బస్సులు సభాస్థలికి చేరుకోకుండానే వెనుదిరిగాయి. అధికారిక ప్రకటన లేనప్పటికీ ట్రాఫిక్ ఆంక్షల రీత్యా దాదాపు నగరంలోని అన్ని స్కూళ్లు, కళాశాలలు విద్యార్థులకు సెలవు ప్రకటించాయి.

'ఆధునిక ఆంధ్రా' ఆవిష్కరిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

జీవితాల్లో వెలుగులు నింపేందుకు మోదీ కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలు, సుపరిపాలన, దేశాన్ని బలమైన ఆర్థికశక్తిగా మార్చేందుకు మేకిన్ ఇండియా తెచ్చారన్నారు. స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, గతిశక్తి తెచ్చారని, దేశానికి ఆర్థిక రాజధానిగా ముంబై ఎలా ఉందో... ఏపీకి విశాఖ అలాంటి ఆర్థిక నగరం అని చంద్రబాబు వివరించారు. మోదీని స్ఫూర్తిగా తీసుకొని నిత్యం ముందుకెళ్తామని, త్వరలో అమరావతికి రావాలని ప్రధానిని కోరుతున్నానన్నారు. నదుల అనుసంధానం తమ లక్ష్యమని, అందుకు కేంద్రం సాయం కావాలన్నారు. 2047 నాటికి ప్రపంచంలోనే మొదటి లేదా రెండో స్థానంలో దేశం ఉంటుందన్నారు. రాష్ట్ర విభజన తర్వాత అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, కేంద్రం సాయంతో నిలదొక్కుకున్నామన్నారు. సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేసే బాధ్యత తమదన్నారు. కేంద్రం అండతో రాష్ట్రంలో పెట్టుబడులు ఊపందుకున్నాయని, అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తమదన్నారు. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక ప్రాంతాలుగా మారుతున్నాయన్నారు. అరకు కాఫీని మోదీ బాగా ప్రచారం చేస్తున్నారని, ఏ సమస్య చెప్పినా ఆయన వెంటనే అర్థం చేసుకుంటారన్నారు. గతంలో ఏ ప్రధాని కూడా ఇంతలా చొరవ చూపలేదన్నారు. మన దేశానికి సరైన సమయంలో సరైన ప్రధాని ఉన్నారని చంద్రబాబు పొగడ్తలతో ముంచెత్తారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితరులు ప్రసంగించారు. సభలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, అనిత, టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్, సత్యకుమార్ యాదవ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీలు పురందరేశ్వరి, సీఎం రమేశ్, శ్రీ భరత్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

సోలార్ పవర్ ప్లాంట్ల ద్వారా 1000 మెగావాట్ల ఉత్పత్తి : భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్రంలో మహిళా సాధికారతే తమ లక్ష్యమని, దీనిపై ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. స్వయం సహాయక సంఘాల (ఎస్ఎస్ఎస్) ద్వారా సోలార్ పవర్ ప్లాంట్‌లు ఏర్పాటుచేసి 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఇప్పటికే ఇంధన శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖల మధ్య ఒప్పందం కుదిరిన నేపథ్యంలో జిల్లాల వారీగా ప్రగతిని బుధవారం ప్రజాభవన్ లో మంత్రులు సీతక్క, కొండ సురేఖలతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తేనే వారి ఎదుగుదలకు అవకాశం ఉంటుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఐదేళ్ల కాలంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో వడ్డీ లేని రుణాలు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. మహిళా సంఘాలు... సోలార్ పవర్ ప్లాంట్‌ల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న భూమిని గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఆర్థిక సహాయం కోసం బ్యాంకు అధికారులతో మాట్లాడాలన్నారు. ప్లాంట్‌ల ఏర్పాటుకు విద్యుత్ శాఖ రెడ్కో ద్వారా టెండర్లు ఆహ్వానించిందని, త్వరలోనే వాటిని ఖరారు చేస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు. ఒక మెగావాట్ ఉత్పత్తికి నాలుగు ఎకరాలు అవసరం ఉంటుందన్నారు. ప్రతి జిల్లాలో 150 ఎకరాలకు తగ్గకుండా రాష్ట్రవ్యాప్తంగా సుమారు నాలుగువేల ఎకరాలు సేకరించాల్సి ఉంటుందని తెలిపారు. దేవదాయ, ఇరిగేషన్ శాఖల పరిధిలోని భూములను గుర్తించాలన్నారు. కేంద్ర అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులు భూమి అభివృద్ధి చేసుకునే అవకాశం ఏర్పడిందని, అయితే స్తంభాలు పాతి విద్యుత్ లైన్‌ల ద్వారా విద్యుత్ సౌకర్యం పొందే క్రమంలో అటవీ శాఖ అధికారులతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఆయా భూముల్లో సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తే ఎవరికి ఇబ్బంది ఉండదని అన్నారు. సోలార్ విద్యుత్తు అందుబాటులోకి వస్తే రైతులు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పెద్ద ఎత్తున పంటలు సాగు చేసుకునే అవకాశం లభిస్తుందని వివరించారు. ప్రతి నియోజకవర్గంలో స్మాల్, మైక్రో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు నాలుగు నుంచి ఐదు ఎకరాలు భూమి అవసరం అవుతుందని, భూములు సేకరించాలని అన్నారు. రాష్ట్రంలో 6.67 లక్షల ఎకరాలను ఇప్పటివరకు ప్రభుత్వం గిరిజనులకు పంపిణీ చేయగా ఆ భూముల్లో లాభసాటి పంటల సాగు జరగడంలేదని తెలిపారు. ఇకనుంచి ఆ భూముల్లో ఉపాధి హామీ, గిరిజన శాఖ, స్వయం సహాయక సంఘాలన్నింటిని సమన్వయం చేసుకొని ఆర్థికంగా ప్రయోజనం చేకూరే పంటల సాగును ప్రోత్సహించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. హైదరాబాద్ వంటి మహానగరాల్లో భారీ భవంతుల పైన సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. 'పీఎం' పథకంలో భాగంగా రైతులు రెండు మెగావాట్ల వరకు సోలార్ పవర్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఏర్పడిందని, ఈ దిశగా రైతులను చైతన్యం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. టీజీ రెడ్కో పోర్టల్ ద్వారా రైతులు సోలార్ పవర్ ఉత్పత్తికి దరఖాస్తులు చేసుకోవాల్సి ఉందని, దీని ద్వారా తక్కువ ధరకు విద్యుత్తు అందుబాటులోకి రావడం మే కాకుండా కాలుష్య రహిత విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఏర్పడుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. అచ్చంపేట నుంచి ఆదిలాబాద్ వరకు గోదావరి పరివాహక భూములపై దృష్టిపెడితే గిరిజనులకు ప్రయోజనం జరుగుతుందని మంత్రి సీతక్క తెలిపారు. ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేశ్, సర్ఫ్ సీఈవో దివ్య దేవరాజన్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

శిశు సంరక్షణ చిన్నారులకు ప్రభుత్వ అండ: పొన్నం

విశాలాంధ్ర-హైదరాబాద్: శిశు సంరక్షణ కేంద్రాల్లోని పిల్లలకు భవిష్యత్తులో విద్య, ఉపాధికి ఇబ్బందులు కలగకుండా వారికి గుర్తింపు ఇవ్వాలనే ఉద్దేశంతో వివిధ రకాల ధృవీకరణ పత్రాలు అందించడంలో హైదరాబాద్ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శిశు సంరక్షణ సంస్థలలో ఆశ్రయం పొందుతున్న పిల్లలకు బుధవారం ధృవీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలోని 50 (6 ప్రభుత్వ,44 ప్రైవేట్) శిశు సంరక్షణ కేంద్రాల్లో 2,300 మందికిపైగా పిల్లలు ఉన్నారని, సంరక్షణ పొందుతున్న 1,330 మందికి గుర్తింపు, విద్య, కుల, నివాస, ఆధార్ తదితర ధృవీకరణ పత్రాలు అందజేసినట్టు చెప్పారు.

ప్రజల సాంస్కృతిక మేల్కొలుపులో ఇప్టా మూలాలు

(మొదటిపేజీ తరువాయి)

రాజనాల, అల్లు రామ లింగయ్య వంటి ఎందరో రచయితలను, నటీనటులను చిత్ర పరిశ్రమకు అందించిన ఘనత ఇప్టా దే అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాల నుంచి ఉద్భవించిన ప్రసిద్ధ పాటలు, నాటకాల గొప్ప సంప్రదాయాన్ని కూడా మనం గుర్తుంచుకోవాలన్నారు.

భారత రాజ్యాంగం రక్షణ, మతోన్మాదా నికి వ్యతిరేకంగా పాటలు, దృశ్య కళలు రూపొందించి ప్రజలను చైతన్య పరచాలన్నారు. ప్రగతిశీల సాంస్కృతిక ఉద్యమాలలో ఇప్టా, అరసం ముఖ్యమైన పాత్ర పోషించాయని అన్నారు. ప్రముఖ సినీ నటుడు మాదాల రవి, సినీ నిర్మాత మద్దినేని రమేష్, తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ఉప కులపతి డా.ఎస్.వి.సత్యనారాయణ, ఇప్టా రాష్ట్ర నాయకులు రాజేశ్వర్ రావు, జానకిరామ్, తెలంగాణ ప్రజానాట్య మండలి వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పలయ్య , అరసం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పల్లేరు వీరాస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి కేవీఎల్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు జి.చంద్రమోహన్ గౌడ్ పాల్గొన్నారు,

కోర్టు వర్సెస్ శాసనాధికారం

(మొదటిపేజీ తరువాయి)

కిందకు వస్తుందని, ఎన్నికల కమిషన్ స్వతంత్రతను దెబ్బతీసిందని వాదించారు. కొత్త చట్టం ప్రకారం సీఈసీ, ఈసీల నియామకాలు చేయకుండా కేంద్రాన్ని నిరోధించాలని మరో పిటిషనర్, కాంగ్రెస్ నాయకుడు జయ ఠాకూర్ కోర్టును కోరారు. ఇది స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలకు హానికరం అని వాదించారు. కొత్త చట్టం ప్రకారం 2024లో మాజీ ఐఏఎస్ అధికారులు జ్ఞానేష్ కుమార్, సుఖ్‌బీర్ సంధూను ఎన్నికల కమిషనర్లుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎంపిక కమిటీ సిఫార్సు చేసిన సంగతి విదితమే.

ఎన్జీఓ ఏడీఆర్... ప్రత్యేకంగా సీజేఐని ఎంపిక ప్రక్రియ నుండి మినహాయించిన ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల చట్టం, 2023లోని సెక్షన్ 7ను సవాలు చేసింది. ఫిబ్రవరి 4వ తేదీన ఈ అంశంపై విచారణ గురించి న్యాయమూర్తులకు ఫిబ్రవరి 3న గుర్తు చేయాలని ధర్మాసనం న్యాయవాదులైన ప్రశాంత్ భూషణ్, శంకరనారాయణన్‌లను కోరింది.

న్యాయవాది ఉండేలా అనుమతి

(మొదటిపేజీ తరువాయి)

అభ్యంతరం వ్యక్తం చేశారు. న్యాయవాదిని అనుమతిస్తే అభ్యంతరమెందుకని... విచారణ గదిలోకి న్యాయవాది వెళ్లడం లేదు కదా అని హైకోర్టు వ్యాఖ్యానించింది. కేటీఆర్, దర్యాప్తు అధికారి ఓ గదిలో ఉంటే... వాళ్లిద్దరూ కనిపించేలా మరో గదిలో న్యాయవాది కూర్చుంటారని హైకోర్టు తెలిపింది. ఏసీబీ కార్యాలయంలో తగిన ఏర్పాట్లు ఉన్నాయా లేవా అని ఏఏజీని ప్రశ్నించగా.. వివరాలు సేకరించి చెబుతానని ఏఏజీ సమాధానమిచ్చారు. విచారణకు సంబంధించి ఏసీబీ కార్యాలయంలో ఏర్పాట్లపై సమాచారం తెలుసుకున్న తర్వాత జస్టిస్ కె.లక్ష్మణ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

అమిత్ షా రాజీనామా చేయాల్సిందే

నిర్మల్ కుమార్ డిమాండ్

విశాలాంధ్ర- హైదరాబాద్: భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాజీనామా చేయాల్సిందేనని అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం (ఏఐడీఆర్ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి వి.ఎస్.నిర్మల్ కుమార్ డిమాండ్ చేశారు. అమిత్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ జయంతి రోజైన ఏప్రిల్ 14 నుంచి దేశ వ్యాప్త ఉద్యమం ప్రారంభిస్తామన్నారు. ఆయన రాజీనామా చేసేంత వరకు తమ పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్ లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిర్మల్ కుమార్ మాట్లాడుతూ ఈనెల ఐదు నుంచి ఏడోతేదీ వరకు హైదరాబాద్‌లో జరిగిన ఏఐడీఆర్ఎం రెండో జాతీయ మహాసభల్లో ఉద్యమ కార్యచరణను రూపొందించుకోవడం జరిగిందని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాలనరసింహ మాట్లాడుతూ హైదరాబాద్, దళిత ఉద్యమానికి వీడదీయరాని చరిత్ర ఉందన్నారు. స్వాతంత్రానికి పూర్వమే దళితుల సాధికారితకు ఆది హిందూ మహాసభ పేరుతో భాగ్యరెడ్డి వర్మ సామాజిక ఉద్యమాలను చేపట్టారని గుర్తు చేశారు. డీహెచ్ రాష్ట్ర అధ్యక్షులు ఏసురత్నం మాట్లాడుతూ రాష్ట్రాల వారీగా ఎక్కడికక్కడ ఉద్యమాలు చేపట్టి దళితులు రాజ్యాంగం హక్కులను పరిరక్షించుకునేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఏఐడీఆర్ఎం జాతీయ కార్యదర్శి మారపాక అనిల్ కుమార్, డీహెచ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.సహాదేవ్, కోశాధికారి ఆరుట్ల రాజ్ కుమార్ మాట్లాడారు.

తెలంగాణ నుంచి ఏడుగురు

తెలంగాణ రాష్ట్రం నుంచి ఏఐడీఆర్ఎం జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఏడుగురు ఎన్నికయ్యారు. డిహెచ్.పి.ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న మారపాక అనిల్ కుమార్ ఏఐడీఆర్ఎం జాతీయ కార్యదర్శిగా ఎన్నికకాగా, రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసురత్నం, ఉపాధ్యక్షులు కె.సహాదేవ్, కోశాధికారి ఆరుట్ల రాజ్ కుమార్ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా, బోయిని అశోక్, సలిగంటి శ్రీనివాస్, పొనగంటి లావణ్య ఎన్నికయ్యారు.

నూతన కార్యవర్గం

ఏఐడీఆర్ఎం జాతీయ అధ్యక్షులుగా ఎ.రాంమూర్తి (పాండిచేరి), ప్రధాన కార్యదర్శిగా వి.ఎస్. నిర్మల్ కుమార్ (దిల్లీ), ఉపాధ్యక్షులుగా కె.సుబ్బారావు (ఆంధ్రప్రదేశ్), జానకి పాశ్వాన్ (బీహార్) మనోజ్ ఎడమన్నా(కేరళ), కార్యదర్శులుగా మారపాక అనిల్ కుమార్ (తెలంగాణ), మహాదేవ్ కుడే (మహారాష్ట్ర), లెనిన్ (తమిళనాడు) కోశాధికారిగా దేవి కుమారి (పంజాబ్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సామాజిక కార్యకర్తలు విల్సన్, ధావలేకు బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించింది. ఈ కేసులో 300 మందికి పైగా సాక్షులు ఉన్నారని, విచారణను త్వరగా ముగించడం సాధ్యం కాదని ధర్మాసనం పేర్కొంది. ఇద్దరూ 2018 నుండి జైలులో మగ్గుతున్నారని, ప్రత్యేక కోర్టు అభియోగాలు నమోదు చేయలేదని ప్రతివాదుల తరపు న్యాయవాదులు మిహిర్ దేశాయ్, సుదీప్ పాస్బోలా కోర్టుకు తెలిపారు. 2017 డిసెంబర్ 31న పూణెలో జరిగిన ఎల్గార్ పరిషత్ సదస్సులో రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారంటూ విల్సన్, ధావలేను పూణె పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే.

9, 10 తేదీల్లో భద్రాచలంలో ఉత్సవాలు

ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు బందోబస్తు : ఎస్పీ రోహిత్ రాజు

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : త్వరలో జరగబోయే తెప్పోత్సవం, వైకుంఠ ఏకాదశి క్రతువుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు భాద్యతగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశించారు. భద్రాచలం ఏ ఎస్‌పి కార్యాలయంలో మంగళవారం సెక్టార్ల వారీగా విధులు కేటాయించిన అధికారులతో సమావేశం ఏర్పాటు చేసారు. ఈ నెల 9,10 న అత్యంత వైభవంగా తెప్పోత్సవం, వైకుంఠ ద్వారదర్శన ఉత్సవాలలో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ బాధ్యతగా వ్యవహరించాలని పోలీసు అధికారులకు సూచించారు. 1300 మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేయబోతున్నట్లు ఎస్పీ తెలిపారు.

చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు : సిఐ

విశాలాంధ్ర - గార్ల : ప్రభుత్వం నిషేధించిన గాలిపటాలకు ఉపయోగించే చైనా మాంజాను విక్రాయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గార్ల - బయ్యారం సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.రవికుమార్ హెచ్చరించారు. మండలాల్లో ఈ మాంజాను విస్తృతంగా అమకాలు చేస్తున్న నేపథ్యంలో ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ పలు సూచనలు, హెచ్చరికలు చేశారు. ఇలాంటి మాంజాల వల్ల మనుషులతోపాటు పక్షులకు కూడా ప్రమాదాలు పొంచి ఉన్నయన్నారు. చైనా మాంజా పతంగులను ఉపయోగించవద్దని స్పష్టం చేసారు. చైనా మాంజా వల్ల రాష్ట్రంలో అనేక చోట్ల అనర్ధాలు జరిగాయని వివరించారు. నైలాన్, సింథటిక్ దారాలు కూడా పక్షులకు, పర్యావరణానికి, మనుషులకు హాని చేస్తాయని చెప్పారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలను అనుసరించి రాష్ట్రంలో చైనా మాంజా వినియోగాన్ని పూర్తిగా నిషేధించడం జరిగిందన్నారు. దీన్ని ఎవరైనా వ్యాపారులు అమ్మినా, రవాణా చేసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. లేదా డయల్ 100 గాని ఫోన్ చేసి తెలపాలన్నారు.

ధరణి దరఖాస్తులు డ్రైవ్‌మోడ్‌లో పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా డ్రైవ్ మోడ్‌లో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం ఆమె నల్గొండ జిల్లా, కేతేపల్లి మండల తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ధరణి ఫైళ్లను, ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించారు.సక్సేషన్, మ్యుటేషన్లను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని, ఎక్కువ రోజులు పెండింగ్ లో లేకుండా చూసుకోవాలని అన్నారు. భూమి సమస్యలతో పాటు, ఇతర రెవిన్యూ అంశాలకు సంబంధించిన పిర్యాదులన్ని సకాలంలో పరిష్కరించి సమస్యలు లేని కార్యాలయంగా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రతి విషయంపై క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని, క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించే వాటిని క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించి పరిష్కరించాలన్నారు. ఎలాంటి సమస్య లేకున్నా పదేపదే సమర్పించే బోగస్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి కేంద్రకరించి మరో సారి దరఖాస్తు చేయకుండా చర్య తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బండపాలెం గ్రామానికి చెందిన భూమి సమస్యపై వచ్చిన పిర్యాదుదారులతో మాట్లాడారు. వివాదం ఉన్న భూమి విషయంలో ఇరువైపులా నిరభ్యంతర ధ్రువపత్రాన్ని తీసుకొని భూమి మోకా మీద ఉన్న వారికి నిబంధనల ప్రకారం పట్టా చేయాలని తహసిల్దారు మధుసూదన్ రెడ్డికి సూచించారు. ఎంపిటిఓతో మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యం కొరవకుండా చర్యలు తీసుకోవాలని, ఇందిరమ్మ ఇండ్ల సర్వే డేటా ఎంట్రీ తదితర అంశాలపై సూచనలు చేశారు. తరచు పాఠశాలలు, ఇతర సంస్థలు సందర్శించాలని ఆదేశించారు. తహసిల్దార్ మనసూదన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట జిల్లా సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస్ రావు అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుదవారం నేరేడుచర్ల గవర్నమెంట్ జూనియర్ కళాశాల విద్యార్థులకు, సైబర్ అవగాహన దివాస్ సందర్భంగా, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశలోనే విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ప్రస్తుతం జరుగుతున్న డిజిటల్ అరెస్టు పైన అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్‌పై ఏర్పాటు చేసిన ఈ సదస్సు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. సైబర్ అవగాహన దివాస్ సందర్భంగా జిల్లా పోలీస్ వారు అందరూ సైబర్ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారని చెప్పారు. సైబర్ ఫిర్యాదుకు టోల్ ఫ్రీ నెంబర్ 1930 లేదా cybercrime.gov.in ని సంప్రదించాలని, పోలీస్ సహాయం కోసం డయల్ 100 కు సమాచారం అందజేయాలన్నారు. అధిక లాభాలు వస్తాయని నమ్మి ఇన్వెస్ట్మెంట్ వంటివి పెట్టి మోసపోకూడదని సూచించారు. సోషల్ మీడియాకు సంబంధించి మోసపూరిత ఖాతాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హుజూర్ నగర్ సీఐ చరమంద రాజు ఎస్సై రవీంద్ర నాయక్ జూనియర్ కాలేజ్ ఇంచార్జ్ ప్రిన్సిపల్, ఉపద్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభావితమైన గ్రామాల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సిగరేణి: రామగుండం ఎరువుల కార్మాగార ప్రభావిత గ్రామాలైన ప్రభావితమైన గ్రామాలైన ఎల్కలపల్లి, లక్ష్మీపురం, వీర్లపల్లి తదితర గ్రామాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఫ్యాక్టరీ సిఈఓ అలోక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభావిత గ్రామాల్లో కమ్యూనిటీలు, సంక్షేమానికి సహకరించడంలో కంపెనీ ఎల్లప్పుడూ ముందుండాలన్నారు. ప్లాంట్ పరిసర ప్రాంతాల్లోని అనేక గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, సరైన పారిశుధ్యం లేకపోవడం, తగినంత తాగునీటి సౌకర్యాలు లేవని వాటిపై దృష్టి పెట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నగర్ మేయర్ అనిల్ కుమార్, మైనార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు ఆసిఫ్ పాషా, కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులు నాయకులు తదితరులు ఉన్నారు.

సమాజానికి ఉపాధ్యాయులే మార్గనిర్దేశకులు

ఎమ్మెల్యే కూనంనేని



విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : విద్యార్థులతో పాటు సమాజానికి కూడా ప్రాథమి కంగా ఉపాధ్యాయులే మార్గ నిర్దేశకులని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో స్టేట్ టీచర్స్ యూనియన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి కునంనేని మాట్లాడారు. నేటి బాలురే రేపటి నవభారత జాతి నిర్మాతలుగా భావించే తరుణంలో ఉపాధ్యాయులు చాలా బాధ్యతగా ఉండాలని కోరారు. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమన్నారు. సమసమాజా స్థాపనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన కోరారు. ఉపాధ్యాయులు తాము పొందిన బోధన అవకాశాన్ని, విజ్ఞానాన్ని ముందు తరాలకు వితోదికంగా అందించాలని ఎమ్మెల్యే కోరారు. ఇదే దశలో సమాజంలో ఉపాధ్యాయు లకు సముచిత గౌరవం ఇచ్చినప్పుడే ఆ సమాజం అన్ని రంగాల్లో వికసిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఎస్.టి.యు దేశానికి స్వాతంత్ర్యం రాకముందే ఏర్పడిన మొట్టమొదటి ఉపాధ్యాయ సంఘం అన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల సాధనలో అనేక దశాబ్దాలుగా ఎనలేని పోరాటాలు కొనసాగిస్తూ వస్తుందన్నారు. అనంతరం ఎన్నో ఏళ్లుగా కొత్తగూడెం ప్రజల చిరకాల స్వప్నమైన కొత్తగూడెం కార్పొరేషన్ను ఏర్పాటు చేసినందుకు కూనంనేనిని ఎస్టియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శాలువా కప్పి ప్రత్యేకంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో సి.పి.ఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబిర్ పాష, సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు బట్టు చందర్, ఎండి. లాల్ మహమ్మద్, గౌరవ సలహాదారు కె.సుధాకర్, అసోసియేట్ అధ్యక్షురాలు ఎం.జ్యోతిరాణి, ఏ.మోహన్, అదనపు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, ఆర్థిక కార్యదర్శి బి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు సర్వం సిద్ధం : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ముక్కోటి ఏకాదశి ఉత్సవాలలో భాగంగా 9, 10వ తేదీ లో జరగబోవు తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. బుధవారం జిల్లా ఆయన ఉత్తర ద్వార దర్శనం ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా సెక్టార్ అధికారులకు పలు సూచనలు చేశారు. 10వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు అన్ని సెక్టార్ల అధికారులు రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. అనంతరం భద్రాచలం ఆర్డీవో కార్యాలయంలో పత్రికా సమావేశంలో ఏర్పాటు చేసారు. ఈసారి ముక్కోటి ఏకాదశి మహోత్స వాలకు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. ఉత్తర ద్వార దర్శనం వద్ద భక్తులను నియంత్రిం చేందుకు సెక్టార్లుగా విభజించడం జరిగిందన్నారు. 10 వ తేది ఉదయం 5 గంటలకు స్వామివారి ఉత్తర ద్వార దర్శనం ఉంటుందన్నారు. భద్రాచలం వచ్చే భక్తులు రాముని దర్శించడంతోపాటు మంచి అనుభూతిని కలిగేలా ప్రత్యేకించి గిరిజన సంప్రదాయ ఏరు పండగను రూపొందించడం జరిగిందన్నారు. ఏరు అంటే కోయ, తెలుగు భాషలలో నది అని అర్థం వస్తుందన్నారు. గోదావరి, తాలిపేరు, కిన్నెరసాని ప్రాజెక్టుల పరివాహక ప్రాంతాల్లో సాంప్రదాయాలు కలిసిన ప్రత్యేకమైన సంస్కృతి మన జిల్లాలో ఉందని వివరించారు. గిరిజన సాంస్కృతి, స్థానిక సాంప్రదాయాలు, ఉత్పత్తులను అందరికీ తెలియపరచడమే ఏరు పండుగ ముఖ్య ఉద్దేశమన్నారు. దీనిలో భాగంగా గోదావరి ఘాటు వద్ద 9వ తారీకు నుండి 11వ తారీకు వరకు ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, గిరిజన కళాకారులు, నృత్య ప్రదర్శనలు అందరూ వీక్షించేలా ఘాట్ వద్ద స్టేజిను రూపొందించడం జరిగిందన్నారు. అదేవిధంగా కరకట్ట వద్ద 50 స్టాళ్లను ఏర్పాటు చేసి ఆర్గానిక్ నెయ్యి, అటవీ ఉత్పత్తులు, గిరిజన ఉత్పత్తులు విక్రయించడం జరుగుతుందన్నారు. గోదావరి ఘాట్ వద్ద బోటింగ్ పాయింట్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సామాన్యులు సైతం గోదావరిలో బోటింగ్ అనుభూతిని పొందేలా ఏర్పాటు చేశామన్నారు. గోదావరి నది ఒడ్డు పైన ఏర్పాటు చేసిన గుడారాలలో రాత్రి బస పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఐటీడీఏ గిరిజన మ్యూజియం ఏర్పాటుకు ఐటీడీయో పిఓ ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ప్రస్తుతం ఈ రివర్ ఫెస్టివల్‌లో పరిమిత సంఖ్యలో అనుమతిస్తున్నామన్నారు. వచ్చే మార్చ్ నెల వరకు ఈ రివర్ ఫెస్టివల్ ను కొనసాగిస్తామని కలెక్టర్ తెలిపారు.

చంద్రుగొండలో వెలగని సెంట్రల్ లైట్లు...

పునరుద్ధరించాలని న్యూడెమోక్రసీ నిరసన

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : జాతీయ రహదారిపై ఉన్న చంద్రుగొండ మండల కేంద్రంలో నెలల తరబడి సెంట్రల్ లైట్లు వెలగడం లేదు. దీనిపై ఎన్ని విమర్శలు వచ్చినా, అధికారులకు వినతి చేసినప్పటికీ పట్టించుకునే నాధుడు కరువయ్యాడు. ఈ క్రమంలో బుధవారం సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా చేసారు. ఈ సందర్భంగా న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్కె ఉమర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక స్థానిక సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. మండల కేంద్రంలో లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన సెంటర్ లైట్లు అధికారుల నిర్లక్ష్యం వల్ల నిరుపయోగంగా మారాయి అన్నారు. చంద్రుగొండ బస్టాండ్ నుంచి అయ్యన్నపాలం వరకు జాతీయ రహదారిపై రెండు కిలోమీటర్ల వరకు లైట్లు వెలగక నెలలు నడుస్తుందన్నారు. ఈ జాతీయ రహదారిపై ఇతర వాహనాలతో పాటు ప్రమాద కరమైన భారీ బొగ్గు టిప్పర్లు పెద్ద సంఖ్యలో తిరుగుతున్నాయని ఉమర్ విమర్శించారు. వెంటనే లైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నాయకులు వెంకట్రావు, పద్దం శ్రీను, వెంకన్న, పుల్లయ్య శ్రీనివాస్ రెడ్డి, శ్రీను, రామారావు, భీముడు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలు వృధా కావు : బాలాజీ నాయక్

విశాలాంధ్ర - గార్ల : ప్రజల హక్కుల సాధనకై నిర్వహించే పోరాటాలు, ఉద్యమాలు ఎన్నటికీ వృధాకావని టిపిటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గుగులోత్ బాలాజీ నాయక్ అన్నారు. గార్ల కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో గత 29 రోజులుగా సమ్మె చేసి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తాత్కాలికంగా విరమించిన ఉపాధ్యాయినులను తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టి పి టి ఎఫ్) మండల శాఖ ఆధ్వర్యంలో మంగళ వారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రలో జరిగిన ఏ ఉద్యమాలు, పోరాటాలు అంతిమంగా ఫలితాలు సాధించిపేట అన్నారు. ఎప్పటికైనా ప్రజా పోరాటాలు తరువాతి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయని స్పష్టం చేశారు. ఫలితాలు పొందకుండానే సమ్మెను విరమించామని నిరుత్సాహ పడకుండా మరో సందర్భంలో తిరిగి ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ ఉపాధ్యక్షులు వెంకటరెడ్డి, కార్యదర్శి గూగులోత్ సంతు, బి పార్వతి, జీవోల కమిటీ కన్వీనర్ ప్రవీణ్ కుమార్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ బి ఉషారాణి, కేజీబీవీ ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

సింగరేణిలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవాలు నేడు

విశాలాంధ్ర - కారేపల్లి : వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ గురువారం సింగరేణి మండలంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేయనున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తలారి చంద్రప్రకాష్ తెలిపారు. బుధవారం ఆయన కారేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రమైన కారేపల్లిలోని ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్త్రీ శక్తి మహిళా టీ స్టాల్, అలాగే కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన నూతన మెడికల్ షాప్ ప్రారంభించను న్నారని తెలిపారు. అనంతరం భాగ్యనగర్ పంచాయతీలోని సామ్యతండా, మాణిక్యారం గ్రామాలలో అయ్యప్ప స్వాముల ఇరుముడి పాల్గొంటారని సాయంత్రానికి తోడితలగూడెం లో నాటుకోడి పిల్లల ఫామ్‌ను ప్రారంభించను న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని సూచించారు.

మోడీది రైతు వ్యతిరేక ప్రభుత్వం

రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శన, ధర్నా

విశాలాంధ్ర - ఖమ్మం : వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టే దిశగా పాలన సాగిస్తున్న మోడీది రైతు వ్యతిరేక ప్రభుత్వమని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు ఆరోపించారు. దశాబ్ద కాలంగా వ్యవసాయ రంగానికి సంబంధించిన సబ్సిడీలను ఎత్తివేయడంతో పాటు వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించాలని ప్రయత్నిస్తుందన్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో పంటలకు మద్దతు ధర ప్రకటించాలని 44 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న జగజిత్ సింగ్ దల్లేవాల్ నిరాహార దీక్షను ప్రభుత్వం ఉపసంహరింపజేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాకు ముందు వెంకటాయ పాలెం నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద జరిగిన ఆందోళనను ఉద్దేశించి బాగం హేమంతరావు మాట్లాడుతూ మోడీ సర్కార్ వ్యవసాయ -రంగానికి సంబంధించి మూడు నల్ల చట్టాలను తీసుకు వచ్చిందని సుదీర్ఘ కాలం పాటు భారతదేశ రైతాంగం సాగించిన బహుముఖ పోరాటాలతో తాత్కాలికంగా మూడు నల్ల చట్టాల అమలును ఉపసంహరించుకుందన్నారు. అదే సమయంలో వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి కనీస మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని ప్రకటించేందుకు హామీ ఇచ్చిందని కాని మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దొడ్డిదారిన నల్ల చట్టాల అమలుకు పూనుకుంటుందని హేమంతరావు తెలిపారు. వ్యవసాయ రంగానికి మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని ప్రకటించడంలో విఫలమైందన్నారు. జాతీయ సంస్థలను, జాతి సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్న మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కూడా కార్పొరేట్లకు అప్పగించే పనిలో ఉందని ఆయన స్పష్టం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేస్తున్న మోడీ ప్రభుత్వం స్పందించడం లేదని ఆయన తెలిపారు. నల్ల చట్టాల రద్దు, మద్దతు ధరల గ్యారెంటీ చట్టం అమలు కోసం 44 రోజులుగా దీక్ష చేస్తున్న జగజిత్ సింగ్ దల్లేవాల్ నిరాహార దీక్షను ఉపసంహరింపజేయాలని, మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని వెంటనే ప్రకటించాలని లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం ప్రకటించేంత వరకు ఆందోళన కొనసాగుతుందని ఆయన తెలిపారు. అనంతరం డిమాండ్స్ కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ పరిపాలన అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, ఎస్కె జానిమియా, కార్పొరేటర్ బిజి క్లైమెంట్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు మిడికంటి -వెంకటరెడ్డి, రామ్మూర్తి, తాటి వెంకటేశ్వరరావు, జాగర్లమూడి రంజిత్ కుమార్, పగడాల మల్లేష్, పుచ్చకాయల సుధాకర్, కూచిపూడి రవి, -ఏనుగు గాంధీ, రైతు సంఘం నాయకులు యడ్లపల్లి శంకరయ్య, నల్లమోతు నర్సింహారావు, శ్రావణ్, మల్లికార్జున్, ఆనందరావు, సాంబశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీజీబీసీఎల్‌కు యునైటెడ్ బేవరేజెస్ సరఫరా నిలుపుదల

హైదరాబాద్ : తెలంగాణలో గణనీయంగా పేరుకుపోయిన నష్టాలతో పాటుగా కొనసాగుతున్న నిర్వహణ నష్టాల కారణంగా తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీబీసీఎల్)కు సరఫరాలను వెంటనే నిలిపివేయాలని తాము నిర్ణయించుకున్నామని యునైటెడ్ బేవరేజెస్ లిమిటెడ్ (యుబీఎల్) ప్రతినిధి తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా నిరంతర ప్రయత్నాలు చేస్తున్నప్పటకీ తమ ఉత్పత్తులకు అందించే బేస్ ధరలలో పెరుగుదల లేదని, దీని ఫలితంగా నష్టాలు పెరిగిపోయి, రాష్ట్రంలో మా కార్యకలాపాలు నిర్వహించలేని రీతికి చేరాయన్నారు. తమ వాటాదారులందరి ప్రయోజనాలను కాపాడటానికి పూర్తిగా కట్టుబడి ఉన్నామని, ప్రతి బీర్ నూ నష్టానికి విక్రయించాల్సి రావటంతో, తమ కార్యకలాపాలను కొనసాగించడం భరించలేనిదిగా మారిందన్నారు. అదనంగా, టీజీబీసీఎల్‌కి చేసిన సరఫరాలకు గానూ బకాయిలు విపరీతంగా పేరుకుపోవడం పరిస్థితిని మరింత క్లిష్టతరం చేశాయన్నారు. బ్రూవర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బిఎఐ) పరిశ్రమ వ్యాప్త సవాళ్లకు సంబంధించి పరిష్కారాల కోసం ప్రభుత్వానికి అనేక మార్లు అభ్యర్థనలు చేసిందని, ద్రవ్యోల్బణానికి తగినట్లుగా ధరల పెంపును కోరింది, కానీ దురదృష్టవశాత్తు, నేటికీ ఎటువంటి పరిష్కారం లభించలేదన్నారు. ఈ క్లిష్ట సమయంలో తమ ఉద్యోగులకు మద్దతు ఇవ్వడానికి తాము కట్టుబడి ఉన్నామని, వారి కృషిని ఎంతో అభినందిస్తున్నామన్నారు. రాష్ట్ర ఆదాయానికి ఏటా రూ. 4,500 కోట్ల కంటే ఎక్కువ తమ కంపెనీ అందిస్తుంది. ఆర్థిక ఒత్తిళ్లు పెరుగుతున్నప్పటికీ, వినియోగదారులు, కస్టమర్‌లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తి నిబద్ధతతో మా బీర్ నిరంతరాయ సరఫరాను తాము చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని, జీవనోపాధిని కాపాడేందుకు, ఆర్థిక స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి తమ ఉత్పత్తుల యొక్క నిరంతర లభ్యత కోసం కలిసి పనిచేయాలని తాము కోరుకుంటున్నట్టు చెప్పారు

నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

విశాలాంధ్ర - కొమరం భీం : ప్రజా మూత్రశాలల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కాగజ్ నగర్ మున్సిపాలిటీలోని రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద ఎన్. ఎస్. క్లీన్ అండ్ గ్రీన్ సేవా సంతన్ స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణ పనులను కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి పరిశీలించారు. ఈ మూత్రశాలలు పురుషులకు, మహిళలకు, ఎంతో సౌకర్యంగా ఉంటాయని, ఈనెల 26వ తేదీన ప్రారంభించేందుకు సిద్ధం చేసేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం నజురుల్ నగర్‌లో సోలార్ ప్లాంట్ స్థల పరిశీలన చేసి పలు సూచన సలహాలు చేశారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు : కలెక్టర్

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాల కోసం విద్యార్థినీ, విద్యార్థులు ఆన్లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో వివిధ గురుకులాల్లో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాల కోసం ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 23న కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించనుందని తెలిపారు. గురుకులాల్లో విద్యను అభ్యసించదల్చిన బాలబాలికలు https://tgcet.cgg.gov.in ద్వారా ఆన్లైన్‌లో ఫిబ్రవరి 1వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు కుల ధ్రువీకరణ పత్రం నెంబరు, ఆదాయ ధ్రువీకరణ పత్రం నెంబరు, ఆధార్ కార్డు నెంబరు, బర్త్ సర్టిఫికెట్, ఫోటో అవసరమని తెలిపారు. పై ధ్రువీకరణ పత్రాల సత్వర జారీ కోసం కలెక్టరేట్లో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామని, ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ కేంద్రం తెరిచి ఉంటుందని అన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలకు, ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుండి 9 వ తరగతి వరకు ఖాళీ సీట్లలో ప్రవేశాల కోసం, గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో 9వ తరగతిలో ప్రవేశాల కోసం, ఖమ్మంలోని గిరిజన సంక్షేమ గురుకులం, పరిగిలో ఎస్.ఓ.ఈలలో 8 వ తరగతిలో ప్రవేశాలకై, అలుగునూరులోని సి.ఓ.ఈలో 9వ తరగతిలో అడ్మిషన్ల కోసం, రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్ గిరి ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాల కోసం ఆసక్తి గల విద్యార్థులు ఆన్లైన్ ద్వారా గడువులోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థిని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో తెలిపారు.

కలకొండ పుష్పాలంకరణలో పాల్గొన్న మాజీ మంత్రి

విశాలాంధ్ర - వనపర్తి : నరేష్ రామ్ కుమార్ గార్ల ఆహ్వానం మేరకు కలకొండ సునీతరామ్ మోహన్‌ల కూతురు శ్రావణి పుష్పాలంకరణ వేడుక తరుణ్ణి ఫంక్షన్ హాల్ నందు జరిగింది. ఇట్టి వేడుకకు హాజరైన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శ్రావణినీ ఆశీర్వదించారు.మాజీమంత్రి వెంట వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, మంద రాము, ముద్దు సార్ ఉన్నారు.

పండుగ వాతావరణంలో సాగిన నిర్మల్ ఉత్సవాలు

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : నిర్మల్ ఉత్సవాలు పండగ వాతావరణంలో ఎంతో ఉత్సాహంగా సాగాయి. ఉత్సవాలకు వేలాదిగా ప్రజలు పాల్గొని స్టాళ్లను, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఉత్సవాలలో పాల్గొన్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి జిల్లా కలెక్టర్ అభిలాష్ అభినవ్ స్వాగతం పలికారు. జిల్లాలో నిర్మల్ ఉత్సవాల పేరిట కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని మాజీ మంత్రి కొనియాడారు. ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. విజయవంతంగా ఉత్సవాలను నిర్వహించినందుకు కలెక్టర్ కు అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నిర్మల్ జిల్లాకు ఎంతో గొప్ప చరిత్ర ఉందని ఇటువంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు చరిత్రను తెలియచెప్పిన వారమవుతామని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు, ప్రజాప్రతినిధుల, జిల్లా ప్రజల సమన్వయ కృషితోనే నిర్మల్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందని తెలిపారు. ప్రజల ఉత్సాహం కోరిక మేరకు ఈ ఉత్సవాలను మరొక రోజు పొడిగిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. నిర్మల్ జిల్లా చరిత్రను, సాంస్కృతిక వారసత్వాన్ని నేటి తరానికి తెలియజెప్పడానికి నిర్మల్ ఉత్సవాలను నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్ లు, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఇతర అధికారులు, కళాకారులు, విద్యార్థులు, ప్రజలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

ఉద్వాసనల విధ్వంసం

మారుతీ సుజుకీ ఇండియా లిమిటెడ్‌లో తాత్కాలిక ఉద్యోగుల ఉద్యమం దేశవ్యాప్తంగా కార్మిక వర్గాల దృష్టిని ఆకర్షిస్తోంది. 30 వేల మంది తాత్కాలిక ఉద్యోగులను అనివార్య పరిస్థితుల్లోనే తొలగిస్తున్నట్లు మారుతీ సుజుకీ చెపుతున్నప్పటికీ, అక్కడ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఉపాధికి సంబంధించి ఆ కంపెనీ ఆచరణ పద్ధతులు విచిత్రంగా ఉన్నాయి. ఇవన్నీ లోకానికి తెలియని నిగూఢ రహస్యాలు. ఉద్యోగులను నియమించడానికి నిర్వహించిన పరీక్షలు, కష్టాలు.. వారి తొలగింపులో ఉండటం లేదు. రాత్రికిరాత్రి తీసుకున్న నిర్ణయాలు ఉదయం ఆరోగంటకే అమలయ్యేలా లేఆఫ్‌లు నడుస్తున్నాయి. ఇది కేవలం భారతీయ కార్పొరేట్ కంపెనీల్లో మాత్రమే జరుగుతుందనుకుంటే పొరపాటు. ఈ సంస్కృతి అమెరికా నుంచి ఆస్ట్రేలియా దాకా ఎన్నో పెట్టుబడిదారీ వ్యవస్థల్లో అజేయంగా సాగుతోంది. కార్మిక సంఘాల ఘోష ఎవరికీ పట్టడం లేదు. కంటికి కన్పించని ఘోరమైన అన్యాయాలుగా ఉద్యోగుల లేఆఫ్‌లు, తొలగింపులు నడుస్తున్నా, మీడియాకు సైతం చిక్కడం లేదు.

వాషింగ్టన్ పోస్ట్ 4% మంది ఉద్యోగులను తొలగించడానికి రంగం సిద్ధం చేసింది. పైప్‌లైన్ ప్రాధాన్యతలు పెరిగాయంటూ సైబొమ్‌ఎక్స్ కంపెనీ ఏకంగా 40% ఉద్యోగులను తొలగిస్తూ నోటీసులు జారీ చేసింది. మరింతమంది ఉద్యోగుల తొలగింపు ఉంటుందని మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. ఇవన్నీ తాజా వార్తలే. 15 గంటల వ్యవధిలో ఈ మూడు కంపెనీలూ చేసిన ప్రకటనలివి. ఉద్యోగులపై వేటు కోడిమెడ కోసినంత సులువుగా మారిపోయింది. అంతర్జాతీయ కంపెనీలను 'స్ఫూర్తి'గా తీసుకొని భారతీయ సంస్థలు ఉద్వాసనల విధ్వంసం సృష్టిస్తున్నాయి. 2025 ఆర్థిక సంవత్సరం అద్భుతంగా ఉంటుందని అంచనాలు వేసిన భారతీయ ఐటీ సేవల రంగం 2024లో మాత్రం లక్ష మంది ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా తొలగించింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)లో ఉద్యోగమంటే ఐటీ నిపుణులు పడిచస్తారు. అలాంటిది 19 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలో టీసీఎస్ చేసిన నియామకాల కంటే అధికంగా గత ఏడాది ఉద్యోగాల కోత విధించింది. మార్జిన్లను మెరుగుపర్చుకోవాలన్న కొత్త విధానం పేరుతో విప్రో కంపెనీ వందలాది మంది ఉద్యోగులను తొలగించడానికి సిద్ధపడింది. క్యాప్కోను 1.45 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేసిన విప్రో మార్జిన్‌లను మెరుగుపర్చుకోవడానికి మిడ్ లెవల్ రోల్స్‌ను తగ్గిస్తోంది. 'లెఫ్ట్-షిఫ్ట్' అనే విప్రో వ్యూహంలో భాగంగా ఈ కోతలు జరుగుతున్నాయి.

ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్, యాక్సెంచర్ సంస్థల్లో ఇప్పటికే వందలాది మందిని ఇంటికి పంపించివేశారు. కొత్తఏడాది ఇంకొంతమందిపై వేటు వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అమెరికాకు చెందిన టెక్ కంపెనీల్లో 2023లో 1,90,000 మంది ఉద్యోగులను తొలగించగా, 2024లో దాదాపు 2 లక్షల మందిని సాగనంపారు. ఇందులో భారతీయులు 30%మంది ఉన్నారంటే ఆశ్చర్యమనిపించుకోదు. ఈజీనాక్, మిక్స్‌ట్రాజ్ సంస్థలు 100% లేఆఫ్ ప్రకటించాయి. అవి మూతపడినట్లుగా నిర్ధారించవచ్చని పత్రికలు చెపుతున్నాయి. ఇక స్టాష్ సంస్థ 44%, ఆఫర్అప్ 22%, ఫౌండ్రీ 27%, కాలెండ్‌ర్‌లీ 13% ఉద్యోగుల లేఆఫ్‌ను ప్రకటించాయి. ఫార్వర్డ్, హెడ్‌స్పేస్ కంపెనీలు సైతం 100% లేఆఫ్‌కు ఏర్పాట్లు చేశాయి. ఎలాన్ మస్క్ తన ఎక్స్ కంపెనీ నుంచి సైతం వేలాది మందిని తొలగించిన విషయం విదితమే. ఇలా చెప్పుకుంటూ పోతే లేఆఫ్‌లు ప్రకటిస్తున్న కంపెనీల పేర్లు చాంతాడంత ఉన్నాయి. ఈ కోతలు ఇప్పుడే ఆగేవి కాదని తెలుస్తోంది. భారతీయ ఐటీ సేవల రంగంలో ఎంట్రీ లెవల్ పోస్టుల నియామకాలు పెరుగుతాయని మార్కెట్ అంచనా వేస్తోంది. కాకపోతే, ఏ స్థాయిలో ఉద్యోగుల కోత ఉంటుందో చెప్పలేకపోతున్నాయి. 2025లో మనదేశంలో కనీసం లక్షన్నర మంది ఐటీ ఉద్యోగులు రోడ్డునపడే అవకాశాలు కన్పిస్తున్నాయి.

ఉద్యోగుల లేఆఫ్‌కు, కోతలకు కంపెనీలు చూపుతున్న కారణాలు అనేకం ఉన్నాయి. వ్యయం తగ్గించుకోవడం, తగినంత పని లేకపోవడం, కంపెనీ ప్రదేశాన్ని వేరేచోటుకు మార్చడం, పని అవసరాలు, ఉద్యోగ స్థానాల్లో మార్పులు సంభవించడం వంటి కారణాలున్నాయి. బడ్జెట్ పరిమితుల వల్ల ప్రతిభావంతులైన ఉద్యోగులే ఎక్కువ సందర్భాల్లో నష్టపోతున్నారని ఒక సర్వే వెల్లడించింది. శాశ్వత, తాత్కాలిక ఉద్యోగుల విభజన ఒక పెద్ద శాపంగా మారింది. మారుతీ సుజుకీలో అదే జరిగింది. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రకటించిన ఆటోమోటివ్ మిషన్ ప్లాన్ (ఏఎంపీ) ఉద్యోగుల కోతలో కీలకపాత్ర పోషిస్తున్నది. సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్, ఆటోమోటివ్ కంపోనెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్‌తోపాటు ఇతర ఆటో పరిశ్రమ సంఘాలతో కలిసి కేంద్ర భారీ పరిశ్రమల శాఖ విజన్-2047లో భాగంగా ఈ ఏఎంపీని రూపొందించింది. దీని వల్ల భారత్ ఒక అధునాతన పారిశ్రామిక శక్తిగా అవతరిస్తుందనేది మోదీ వాక్కు. తొలి దశలో ఏఎంపీ 2016-26లో ప్రభుత్వ, ఆటోమోటివ్ ఇండస్ట్రీ సమష్టి దార్శనిక విధాన ఫలితాలు చూస్తే, ఉపాధి అవకాశాలు పెంపుదల కన్నా ఉపాధి తొలగింపుల సంఖ్యే ఎక్కువగా ఉంది. ఇదంతా మోదీ ప్రవచిత నైపుణ్య భారత్ కార్యక్రమంలో భాగంగా జరుగుతోంది. ఈ విధానంవల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా వచ్చే దశాబ్దంలో 65 మిలియన్ ఉద్యోగావకాశాలు దక్కుతాయని ఎన్‌డీఏ సర్కారు చెప్పుకొచ్చింది. అంతక్రితం దశాబ్దంలో 25 మిలియన్ ఉద్యోగాలు సృష్టించినట్లు జబ్బలు చరుచుకుంది. ఇవన్నీ గాలిమాటలు, పచ్చి అబద్ధాలు. కనీసం లక్ష మందికి ఉపాధి కల్పించి ఉంటే గొప్ప విషయమయ్యేది. ఆటోమోటివ్ ఇండస్ట్రీకి ఇచ్చిన రాయితీలు మాత్రం అన్నీఇన్నీకావు.

జపాన్‌కు చెందిన సుజుకీ మోటార్ కార్పొరేషన్ అనుబంధ సంస్థ అయిన మారుతీ సుజుకీ ఇండియా లిమిటెడ్ 2024 జనవరిలో ప్యాసింజర్ వెహికల్స్ విభాగంలో 43.94% మార్కెట్ వాటాను సాధించింది. 1,72,813 వాహనాలను విక్రయించి రికార్డు సృష్టించింది. 2030 నాటికి 30% ఎలక్ట్రిక్ వెహికల్స్‌ను పెంచుతామని ప్రభుత్వం ప్రకటించిన తర్వాత మారుతీ సుజుకీ పథకాలు కూడా మారాయి. కొత్త విధానం ప్రకారం, ఉపాధి అవకాశాలు పెంచకపోగా, ఈ కంపెనీలో 30 వేల మందిని తొలగించాలని నిర్ణయించింది. ఒప్పంద, శిక్షణ, అప్రెంటీస్, తాత్కాలిక తదితర పేర్లతో ఉన్న 3 వేల మందికిపైగా తాత్కాలిక ఉద్యోగులు జనవరి 5న సమావేశమై, తమను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. 2012 మనేసార్ ప్లాంట్ ఆందోళనకు మించిన ఆందోళనగా ఇది మారబోతున్నది. మనేసార్ ప్లాంట్ ఆందోళన హింసకు దారితీయగా, 100 మంది మేనేజర్లను చితక్కొట్టారు. ఒకరు చనిపోయిన ఉదంతం కళ్లముందు కన్పిస్తూనే ఉంది. ఈ దారుణాలకు మారుతీ మరోసారి వేదికగా మారినా మారవచ్చు. ఈ తరహా ఉద్వాసనల విధ్వంసం ఆందోళనకరమైన అంశం. విధానాల తీరు మార్చుకోలేని మోదీ ప్రభుత్వ దుష్టనీతి ఫలితమిది. దీనికి అంతం పలకాల్సిన సమయం ఆసన్నమయింది.

కుదేలైన జీడీపీ వృద్ధి

గత నాలుగేళ్ల కాలంతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిరేటు గణనీయంగా పడిపోనున్నది. ఈ సంవత్సరం జీడీపీ 6.4శాతం మాత్రమే 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉండవచ్చునని కేంద్ర ప్రభుత్వం అంచనావేసింది. ఇంత బహిరంగంగా, స్పష్టంగా ప్రభుత్వం ప్రకటించడం విశేషమే. ఉత్పత్తి, సేవల రంగాల పనితీరు అధ్వాన్నంగా ఉండటమే జీడీపీ పడిపోవడానికి ప్రధాన కారణం.

కొవిడ్-19 మహమ్మారి విజృంభించిన ఏడాదిలో (2020-21) జీడీపీ 5.8శాతం మాత్రమేఉండగా 2021-2022లో 9.7 శాతానికి పెరగగా, 2022-23లో 2024 మార్చికి ముగిసిన ఆర్థిక సంవత్సరానికి 8.2శాతానికి తగ్గింది. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరానికి దారుణంగా పడిపోతుందని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) అంచనావేసింది. మన దేశం అన్ని రంగాలలో పరుగులు పెడుతోందని ప్రధాని నరేంద్ర మోదీ గొప్పగా ప్రచారం చేస్తుంటారు. అయితే ఈ గణాంకాలు వాస్తవమా అనేది సందేహం. పేదరికం, ఉద్యోగ రంగం, వేతనాలు తదితర అనేక అంశాల విషయంలో ప్రభుత్వం చెప్పేదానికి ప్రైవేటు విశ్లేషకులు చెప్పేదానికి ఎంతో తేడా ఉంటుంది. ఈసారి రిజర్వు బ్యాంకు అంచనాకంటే ఎక్కువ జీడీపీ (6.4శాతం) ప్రభుత్వం అంచనా వేసింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ తయారుచేయడానికి ఈ గణాంకాలను వినియోగించుకోవచ్చు. ఫిబ్రవరి 1న ఆర్థికమంత్రి లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఉత్పత్తి రంగం ఈ ఏడాది 5.3శాతానికి తగ్గనుంది. గత ఆర్థిక సంవత్సరం 9.9శాతం ఉత్పత్తి రంగం సాధించింది. సేవల రంగంలో అంటే- హోటళ్లు, రవాణా, కమ్యూనికేషన్లు

వాణిజ్యం 5.8శాతానికి పెరగవచ్చు. గత సంవత్సరం 6.4శాతం ఉంది. మరోవైపు వ్యవసాయ రంగం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-2025)లో వృద్ధి 3.8శాతానికి పెరగవచ్చు. ఇదే 2023-24లో 1.4శాతం మాత్రమే వ్యవసాయ ఉత్పత్తి ఉంది. దాదాపు ప్రతి ఏటా వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతున్నా ప్రభుత్వం రైతులకుఇచ్చిన మాటను మోదీ ప్రభుత్వం నిలుపుకోవడంలేదు. అప్పుల్లో కూరుకుపోతూ, ఆత్మహత్యలు చేసుకునే రైతులు తగ్గడంలేదు.

కుదించుకుపోతున్న ఆదాయం

భారతదేశంలో జీడీపీ వృద్ధి మాంద్యంలో పడిపోయిందనేది అర్థంచేసుకునే అంశమే. ఉద్యోగమార్కెట్ గణనీయంగా పడిపోయింది. ఆదాయం వృద్ధి కుంచించుకుపోయింది. అత్యధిక వినిమయదారులు అవసరమైనంతగా ఖర్చు చేయలేకపోతున్నారు. వేతనాలు లభించే ఉద్యోగులు లేదా ప్రతిరోజూ అవసరమైన వస్తువులను కొనవలసినవారు కొంతమేరకు ఖర్చు చేయగలుగుతున్నారు. వాస్తవంగా వీరి నిజ ఆదాయం పెరగడంలేదు. వేగంగా అమ్ముడుపోయే వినియోగ వస్తువుల రంగం టర్నోవర్ పెరగడానికి, ఆదాయం రావడానికి పెద్ద పోరాటం చేయవలసివస్తోంది. హిందుస్థాన్ లీవర్స్(హెచ్‌యుఎల్) మొత్తం ఆదాయం క్రమంగా పెరుగుతోంది. 2024 మూడవ త్రైమాసికంలో విక్రయ వృద్ధి రెండు శాతం మాత్రమే ఉన్నది. పరిమాణం వృద్ధి మూడుశాతం ఉన్నది. ద్రవ్యోల్బణం కొనసాగడంవల్ల ఆయా కంపెనీలు అవసరమైన వస్తువులకు అధిక రేట్లు పెట్టి అమ్మగలిగారు. వస్తువుల ప్యాకింగ్ సైజులు తగ్గించి ధర కూడా తగ్గిస్తున్నాయి. వ్యక్తిగత ఆదాయం పెరగాలంటే అత్యధికంగా ఉద్యోగాల వృద్ధి ఉండాలి. డిమాండ్, వ్యయం పెరిగితే ఆదాయంకూడా పెరుగుతుంది. భారతదేశంలో 2024లో తలసరి ఆదాయం కేవలం 2.73శాతం మాత్రమే ఉన్నది. మరోవైపు ఏడాది తర్వాత ద్రవ్యోల్బణంరేటు జాతీయ స్థాయి వినిమయ ధర సూచీ కేవలం 6.21 శాతం మాత్రమే ఉంది. గ్రామీణప్రాంతాలలో ద్రవ్యోల్బణం రేటు మరింత ఎక్కువగాఅంటే 6.68శాతం ఉంది. పట్టణప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 5.62శాతం ఉంది. 2024 సెప్టెంబరులో ద్రవ్యోల్బణంరేటు ఒక్కసారిగా 9శాతానికి పెరిగింది. 2024-25 రెండవ త్రైమాసికంలో ప్రచురించిన ఆర్థిక వృద్ధి ఏడవ త్రైమాసికంలో 5.4శాతానికే నెమ్మదిగా పెరిగింది. అంతక్రితం 2023-24 త్రైమాసికంలో ఆర్థిక వృద్ధి 8.1శాతం ఉండగా, ఆ తరువాత అది గణనీయంగా పడిపోయింది. స్టేట్ బ్యాంకు సూచనప్రకారం, ప్రైవేటురంగంలో పెట్టుబడులు పెరిగినట్లయితే మౌలికసదుపాయాల రంగం ఆర్థిక వృద్ధిని పెంచుతుందని తెలిపింది. అప్పు ఎక్కువగాఉండే అదానీ లాంటికంపెనీలు తప్పితే, కొన్ని ప్రైవేటురంగ పరిశ్రమలు ఎక్కువకాలం జరిగే మౌలికసదుపాయాల పెట్టుబడులపై ఆసక్తి చూపుతున్నాయి. మరికొన్ని కంపెనీలు రియల్ ఎస్టేట్ రంగం సురక్షితంగా, పెట్టిన పెట్టుబడులు వేగంగా తిరిగివస్తాయని అంచనావేసి పెట్టుబడులు పెడుతున్నాయి. సిమెంటు, స్టీలు, కంకరరాళ్లు, ఎలివేటర్‌లు, రోడ్లు తదితరనివాసాలు ఎక్కువగాఉంటాయి. అందువల్ల ఈ రంగంలో ఆదాయం గణనీయంగా కనిపిస్తుంది.

ఎడిట్ పేజి డెస్క్

కర్నాటక కూడా మొదలెట్టిందా?

వి. శంకరయ్య

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి అవశేష ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడిన తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల పంపిణీలో పీటముడి పడింది. విభజన చట్టంలో నదీ జలాల పంపిణీకి చెంది స్పష్టమైన నిబంధన లున్నా ముఖ్యమంత్రి కెసిఆర్ తెలంగాణ భావోద్వేగం సజీవంగా కొనసాగించేందుకు నదీజలాల వివాదాన్ని పెంచి పోషించి సజీవంగా వుంచారు. అది ఈ నాటికీ రావణ కాష్టంలాగా రగులుతూనే వుంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పెద్ద మార్పేమీ లేదు. ఇదిలా ఉండగా ఇటీవల సంవత్సరాల్లో మరో రాష్ట్రం కర్నాటక కూడా పేచీలకు దిగుతోంది.

ఫలితంగా తుంగభద్ర జలాలపై ఆధార పడుతున్న రాయలసీమకు తీరని అన్యాయం జరుగుతోంది. తుంగభద్ర జలాశయంలో పూడికతో నిల్వ సామర్థ్యం తగ్గి పోయిందని నీటి వాటాలో కోత పడుతోంది. దీనికి తోడు మార్గం మధ్యలో కర్నాటక రైతులు జల చౌర్యంతో అందులోనూ కోత పడుతోంది. దీనికి తోడు కర్నాటకలో బీజేపీ ప్రభుత్వం వున్న రోజుల్లో అగమేఘాల మీద అప్పర్ భద్ర ప్రాజెక్టు డిపిఆర్‌ను కేంద్ర జల సంఘం ఆమోదించింది. కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రాజెక్ట్ హోదా ఇచ్చింది. గమనార్హమైన అంశమేమంటే చట్ట బద్ధత గల పోలవరం జాతీయ ప్రాజెక్టుకు ఇన్నేళ్లు గడిచినా ఏ ఒక్క సంవత్సరం కూడా కేంద్ర బడ్జెట్ లో నిధులు కేటాయించని బీజేపీ ప్రభుత్వం కర్నాటకలో తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తొలి ఏడాదే అప్పర్ భద్రకు బడ్జెట్ లో 5300 కోట్లు కేటాయించింది.

తుంగభద్ర ప్రాజెక్టు పూడికతో వుందనే నెపంతో రాష్ట్ర ప్రభుత్వం అప్పర్ భద్ర 29 టియంసిలు నిల్వ సామర్థ్యంతో ప్రతిపాదించినది. ఈ దాష్టీకం ఇంతటితో ముగియ లేదు. తాజాగా అదే నెపంతో తుంగభద్ర ప్రాజెక్టు పూడిక పేరు చెప్పి నాగావళి వద్ద 31 టియంసిల సామర్థ్యంతో మరో

రిజర్వాయర్ నిర్మాణానికి కర్నాటక సకల యత్నాలు చేస్తోంది. అంటే తుంగభద్ర లో కర్నాటక ఇచ్చే గణాంకాల మేరకు 32 టియంసిలు సామర్థ్యం తగ్గిపోతే దాని సాకు చూపెట్టి 29 టియంసిలతో అప్పర్ భద్ర 31 టియంసిల సామర్థ్యంలో నాగావళి వద్ద మరో రిజర్వాయర్ మొత్తం 60 టియంసిలతో రెండు రిజర్వాయర్లు చేకూర్చుకోబో తోంది. తుంగభద్ర జలాశయం పూడిక తీయాలంటే 12500 కోట్ల రూపాయలు వ్యయం చేయవలసి వుంటుందని ఏది ఏమైనా నాగావళి వద్ద రిజర్వాయర్ నిర్మాణం తప్పదని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ద రామయ్య ప్రకటన చేశారు. తుంగభద్ర బోర్డు కూడా ఆమోదించ వచ్చనే వార్తలు రాయలసీమ వాసుల్లో ఆందోళన కలిగించుతోంది. తుంగభద్ర జలాశయం ఎగువన రెండు జలాశయాలు నిర్మిస్తే ఒక్క రాయలసీమకే కాకుండా శ్రీశైలం జలాశయానికి వచ్చే నీటిలోనూ భారీగా కోత పడుతుంది. ఈ ప్రతి పాదనను తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆంధ్రప్రదేశ్ వేపు నుంచి గట్టి స్పందన లేదు.

ఇదిలా ఉండగా కర్నాటక ముఖ్యమంత్రి సిద్ద రామయ్య డిసెంబర్ మూడవ వారంలో కొందరు రైతు సంఘాల నేతల సమావేశంలో మాట్లాడుతూ ఆల్మట్టి జలాశయం ఎత్తు 519 మీటర్ల నుండి 524.256 మీటర్ల ఎత్తు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమౌతోందని ప్రకటించారు. తద్వారా మరో 130 టియంసిల నీళ్లు జలాశయంలో నిల్వ చేయవచ్చని చెప్పినట్లు వార్తలు వచ్చాయి. అది కూడా బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ కేటాయించిన 170 టియంసిలు నుంచి 130 టియంసిల నీళ్లు తీసుకోదలచినట్లు ముఖ్యమంత్రి సిద్ద రామయ్య ప్రకటన తెలుపుతోంది. 2004 లో నియమించిన బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ 2013 లో తుది తీర్పు ఇచ్చింది. ఇది తమకు ఆమోదయోగ్యం కాదని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేసింది. అది ఇంకా పరిష్కారం కాలేదు. ఫలితంగా కేంద్ర ప్రభుత్వం కూడా బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తుది తీర్పును గెజిట్ నోటిఫికేషన్ చేయలేదు. అందువలననే ఇప్పటికి బచావత్ అవార్డు అమలులో వుంది. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తుది తీర్పు కూడా కర్నాటకకు అనుకూలంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు నష్టదాయకంగా వుంది. పైగా బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ కూడా కృష్ణ లో చుక్క నీరు మిగల్చకుండా బేసిన్‌లోని రాష్ట్రాల మధ్య పంపిణీ చేసింది.163 టియంసిలు నికర జలాలు వున్నాయని మిగులు జలాలు 285 టియంసిలు వున్నాయని లెక్క తేల్చి మొత్తం 448 టియంసిలు బేసిన్ లోని అన్ని రాష్ట్రాల మధ్య పంపిణీ చేసింది. ఇందులో 170 టియంసిలు కర్నాటకకు కేటాయించినది. ఈ మొత్తం నీటిని కర్నాటక వివిధ పథకాలకు నేరుగా వాడుకొనే అవకాశం కల్పిస్తూ పైగా ఆల్మట్టి జలాశయం ఎత్తు పెంచుకొనే అవకాశం కల్పించింది.

అదే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చేసరికి 190 టియంసిలు లెక్క చూపినా ఇందులో 150 టియంసిలు కేవలం క్యారీ ఓవర్ కింద కేటాయించినది. మిగిలిన 40 టియంసిల్లో ఆరు టిఎంసిలు ఆవిరి నష్టం కింద పోగా మిగిలింది కేవలం 34 టియంసిలు జూరాల తెలుగు గంగ ఆర్డీయస్ లభించాయి. మరి ఏ ధైర్యంతో ముఖ్యమంత్రి సిద్ద రామయ్య ఆల్మట్టి ఎత్తు పెంచేందుకు సిద్ధమౌతున్నారో వేచి చూడాలి. ఒక వేళ అదే జరిగితే కృష్ణకు వరద వచ్చే రోజులు ఆలస్యం కావడమే కాకుండా భారీగా కోతపడే అవకాశంఉంది. ఈ ప్రభావం రాష్ట్రం మొత్తం మీద వుండవచ్చు. జగన్మోహన్‌రెడ్డి హయాంలో అంతర్ రాష్ట్ర జల వివాదాల అంశంలో చాలామార్లు తప్పటడుగులు వేస్తే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అంతగా శ్రద్ధ పెట్టడంలేదు. ప్రభుత్వ పరంగా నాగావళి జలాశయం ప్రతి పాదనపై ఇంత వరకు స్పందన లేదు. తుదకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి కూడా ఈ ప్రతిపాదన ఆంధ్ర ప్రదేశ్ వ్యతిరేకిస్తోందని ప్రకటన చేసినట్లు లేదు. ఇలాంటి అంశాల్లో తెలంగాణ ఎంతో మెరుగ్గా వుంటోంది. గోదావరి బనకచర్ల అనుసంధానం ఇంకా ప్రాథమిక దశలోనే వుండగా తెలంగాణ ముఖ్యమంత్రి స్పందించారు. అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కనీసం మన రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి కర్నాటక యత్నాలుపై అధికారులను అలర్ట్ చేసి వుండవలసినది.

తుంగభద్ర జలాలపై ఆధార పడుతున్న రాయలసీమకు తీరని అన్యాయం జరుగుతోంది. తుంగభద్ర జలాశయంలో పూడికతో నిల్వ సామర్థ్యం తగ్గి పోయిందని నీటి వాటాలో కోత పడుతోంది. దీనికి తోడు మార్గం మధ్యలో కర్నాటక రైతులు జల చౌర్యంతో అందులోనూ కోత పడుతోంది. దీనికి తోడు కర్నాటకలో బీజేపీ ప్రభుత్వం వున్న రోజుల్లో అగమేఘాల మీద అప్పర్ భద్ర ప్రాజెక్టు డిపిఆర్‌ను కేంద్ర జల సంఘం ఆమోదించింది. కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రాజెక్ట్ హోదా ఇచ్చింది.

విశ్రాంత పాత్రికేయులు

తెలుగు నేలపై కమ్యూనిజం జాడలు

ఆర్వీ రామారావ్

తెలుగు వారు చరిత్రలో అనేకసార్లు విడిపోయారు. అనేక సందర్భాలలో కలిసి ఉన్నారు. కాకతీయుల కాలంలో 12వ శతాబ్దంలో దాదాపు తెలుగు మాట్లాడే ప్రాంతమంతా సమైక్యంగా ఉంది. ఆ తరవాత కుతుబ్ షాహీల కాలంలోనూ తెలుగు మాట్లాడేవారున్న ప్రాంతాలు కలిసే ఉన్నాయి. బ్రిటిష్‌వారి హయాంలో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అనుకుంటున్న తెలుగు మాట్లాడే ప్రాంతాలు ఉమ్మడి మద్రాసులో భాగం. 1948 దాకా తెలుగు మాట్లాడే వారు 80 శాతం పైగా ఉన్న తెలంగాణ ప్రాంతం నిజాం ఏలుబడిలో ఉండేది. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉన్న తెలుగువారు తమ అస్తిత్వం కోసం, తమ భాషా సంస్కృతుల పరిరక్షణ కోసం గత శతాబ్దం ఆరంభం నుంచే పోరాడవలసి వచ్చింది. దేశమంతటా జాతీయోద్యమం కొనసాగుతున్న కాలంలోనూ ప్రస్తుతం కోస్తా ఆంధ్ర అంటున్న ప్రాంతంలో తెలుగు వారు జాతీయ పోరాటంలో భాగమయ్యారు.

1920 నాటికే కోస్తా ఆంధ్ర ప్రాంతంలో జాతీయ పోరాట ఛాయలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఒకవేపు తమ భాష, సంస్కృతులను కాపాడుకోవడానికి ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోవడానికి పోరాడుతూనే మరోవేపు తెలుగు వారు స్వాతంత్ర్య పోరాటంలో భాగమయ్యారు. ఈ పోరాటానికి దన్నుగా తెలుగు సాహిత్యం కూడా అపారంగానే వెలువడింది.

ఉదాహరణకు విశాఖపట్నానికి చెందిన వద్దాది సీతారామాంజనేయ కవి 'దండాలు దండాలు భారత మాత' గేయం చాలాకాలం ఉర్రూతలూగించింది. జాతీయోద్యమంలో కాంగ్రెస్‌ది ఎంత ప్రధానమైన పాత్ర అయినప్పటికీ దానికి చాలాకాలం సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరి లేదు. కమ్యూనిస్టుల ఒత్తిడివల్లే కాంగ్రెస్ సామ్రాజ్యవాద వ్యతిరేక ధోరణి అనుసరించవలసి వచ్చింది. ఒక్కసారి కాంగ్రెస్ సామ్రాజ్యవాద వ్యతిరేక విధానాన్ని అనుసరించడం మొదలు పెట్టిన తరవాత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొంటున్న వివిధ పాయలవారు కాంగ్రెస్‌లో భాగమై పోయారు. కమ్యూనిస్టు పార్టీ మీద 1929లో ఒకసారి, 1934లో రెండోసారి బ్రిటిష్ ప్రభుత్వం నిషేధం విధించింది. అయినా కమ్యూనిస్టుల కార్యకలాపాలు ఆగలేదు. శ్రామిక వర్గాన్ని, రైతులను, రైతు కూలీలను సమీకరించడంలో కమ్యూనిస్టులు గణనీయమైన పాత్ర పోషించారు. కోస్తా ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టుల ఉద్యమం బలంగా కొనసాగింది. ఆంధ్ర ప్రాంతంలో 1934కు పూర్వమే సోషలిస్టు భావాలు విస్తరించాయి. 1934 నాటికి ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ నెలకొన్నది. పోలేపెద్ది నరసింహమూర్తి ఆంధ్ర ప్రాంత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా ఉండేవారు. ఆ తరవాత 1936లో సీపీఐ కేంద్ర కమిటీ పుచ్చలపల్లి సుందరయ్యను ఆంధ్ర ప్రాంత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా నియమించింది.

వ్యవస్థాపరంగా ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ



మద్దుకూరి చంద్రశేఖరరావు

చెలికాని రామారావు

కంభంపాటి సత్యనారాయణ

పుచ్చలపల్లి సుందరయ్య

ఏర్పడడానికి ముందే మద్రాసులో చదువుకుంటున్న కంభంపాటి సత్యనారాయణ 1932 నాటికే కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు. అమీర్ హైదర్‌ఖాన్ ద్వారా ఆయన కమ్యూనిస్టు సిద్ధాంతాల వైపు ఆకర్షితులయ్యారు. ఆ తరవాత మీరట్ ఖైదీలు కోర్టులో చేసిన ప్రకటనలకు ఉత్తేజితులై ప్రతాప రామసుబ్బయ్య కమ్యూనిస్టు అయ్యారు. ఆయన శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొన్నారు. తూర్పు గోదావరికి చెందిన డా. చెలికాని రామారావు తన కుటుంబాన్ని విడిచి 1921లోనే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. జైలులో ఉన్నప్పుడే ఆయనను సోషలిస్టు భావాలు ఆకట్టుకున్నాయి. రాజమండ్రి జైలులో ఉండగా సేలం బ్రిటిష్ కలెక్టర్‌ను చంపి అదే జైలులో ఉంటున్న నీలకంఠ బ్రహ్మచారి సహవాసం వల్ల మార్క్సిజం వేపు ఆకర్షితులైన డా. చెలికాని రామారావు కమ్యూనిస్టుగా మారారు. కాకినాడలో సత్యాగ్రహోద్యమానికి నాయకత్వం వహించారు. 1934 కన్నా ముందే దక్షిణ భారతదేశంలో సోషలిస్టు భావజాలం వేపు ఆకర్షితులైన వారు చాలా మందే ఉన్నారు. పందిరి మల్లికార్జున రావు, దామిశెట్టి పార్థ సారథి, దర్భా కృష్ణమూర్తి, గారపాటి సత్యనారాయణ, మద్దుకూరి చంద్రశేఖరరావు, తనికెళ్ల వెంకటాచలపతి, జొన్నలగడ్డ రామలింగయ్య, పోలేపెద్ది నరసింహమూర్తి లాంటి వారందరూ ఈ కోవలోనివారే. వీరందరినీ సమీకరించి ఆంధ్ర ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు చేయడానికి కంభంపాటి సత్యనారాయణ, పుచ్చలపల్లి సుందరయ్య ఎంతగానో కృషి చేశారు. పుచ్చలపల్లి సుందరయ్య కృషితో 1934 సెప్టెంబర్‌లో బెజవాడలో ఆంధ్ర రాష్ట్ర కమ్యూనిస్టు ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పడింది. అందులో ఏడుగురు సభ్యులు ఉండేవారు. వారు: పోలేపెద్ది నరసింహమూర్తి, కొసరాజు శేషయ్య, మద్దుకూరి చంద్రశేఖరరావు, చలసాని వాసుదేవరావు, తనికెళ్ల వెంకట చలపతి, అల్లూరి సత్యనారాయణ, పుచ్చలపల్లి సుందరయ్య ఉండేవారు. 1934 సెప్టెంబర్ 14న బెజవాడ దుర్గా విలాస్‌లో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ సమావేశం జరిగింది. అప్పటికే గాంధీ మీద వ్యతిరేకత రాజుకుంటోంది. కొండా వెంకటప్పయ్య గాంధీని సమర్థిస్తూ తీర్మానం ప్రతిపాదిస్తే జొన్నలగడ్డ రామలింగయ్య వ్యతిరేకించారు. కొండా వెంకటప్పయ్య ప్రతిపాదించిన తీర్మానానికి ఆరుగురి మద్దతే లభించినందువల్ల అది వీగిపోయింది. దేశంలో సోషలిస్టు శక్తులు విజృంభించడం చూసి గాంధీ కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. 'వారు ప్రకటించిన కార్యక్రమంతో నేను ఏకీభవింప జాలను. కానీ వారి అభిప్రాయాలను ప్రచారం చేసుకునేందుకు గల స్వాతంత్ర్యమును ఆపుటకు నేనడ్డుపడను. కాంగ్రెస్‌లో వారు అధిక సంఖ్యాకులైన యెడల నేను కాంగ్రెస్‌లో నుండజాలను' అని గాంధీ ఒక ప్రకటనలో పేర్కొన్నట్టు 1934 సెప్టెంబర్ 22నాటి కృష్ణా పత్రికలో ప్రకటించారు. ఇది ఆంధ్ర ప్రాంతంలో సోషలిస్టు, కమ్యూనిస్టు భావజాల వ్యాప్తికి నిదర్శనం. 1934 డిసెంబర్ 31న విశాఖపట్నంలో జరిగిన ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ మహాసభకు సోషలిస్టు భావాలున్న వారు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అఖిల భారత కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కార్యక్రమాన్ని ఆమోదించాలని కోరుతూ క్రొవ్విడి లింగరాజు తీర్మానం ప్రతిపాదించారు. ఆ తీర్మానాన్ని మొసలికంటి తిరుమలరావు బలపరిస్తే కొండా వెంకటప్పయ్య పంతులు వ్యతిరేకించారు. తీర్మానానికి అనుకూలంగా 58 మంది, వ్యతిరేకంగా 46 మంది ఓటు వేశారు. ఈ సమావేశానికి హాజరైన వారిలో తనికెళ్ల వెంకట చలపతి, సుందరయ్య, మరి కొందరు కమ్యూనిస్టులు హాజరయ్యారు. 1935 జనవరి 11న బెజవాడ దుర్గా విలాస్‌లో కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు అధ్యక్షతన కాంగ్రెస్ సమావేశం జరిగింది. 'న్యాయ సమ్మతమైన, శాంతియుతమైన పద్ధతుల ద్వారా సంపూర్ణ స్వరాజ్యాన్ని సాధించడం తమ ధ్యేయం' అనే తీర్మానంలో 'సత్య అహింసల ద్వారా' అని చేర్చాలని అయ్యదేవర కాళేశ్వరరావు సవరణ ప్రతిపాదిస్తే... బులుసు సాంబమూర్తి దాన్ని బలపరిచారు. అల్లూరి సత్యనారాయణ దీన్ని వ్యతిరేకించారు. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ గుడ్డిగా గాంధీ మహాత్ముణ్ని అనుసరించకూడదని, అలా అనుసరించడం బలహీనత అని అల్లూరి సత్యనారాయణ వాదించారు. చివరకు కాళేశ్వరరావు తీర్మానం వీగిపోయింది. ఆ రోజుల్లో కమ్యూనిస్టులు కాంగ్రెస్‌లో ఉంటూ సోషలిస్టులతో కలిసి మితవాదులతో పోరాడారనడానికి ఈ సంఘటనలు మచ్చు తునకలు.

రూ.25 లక్షల ఆరోగ్య బీమా

ఢిల్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ హామీ

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్ ఢిల్లీ వాసులకు హామీల వర్షం కురిపిస్తోంది. తాజాగా 'జీవన్ రక్ష యోజన' అనే పథకాన్ని కాంగ్రెస్ బుధవారం ప్రకటించింది. ఈ పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్యబీమా కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కాంగ్రెస్ సీనియర్ నేత, రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లాత్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. రాజస్థాన్‌లో తాము అధికారంలో ఉన్నప్పుడు ఇదే పథకాన్ని అమలు చేశామని గుర్తుచేశారు. ఎలాంటి షరతులు, పరిమితులు లేకుండా దీన్ని అమలుచేసినట్లు తెలిపారు. ఢిల్లీకి ఈ పథకం ఓ గేమ్‌ఛేంజర్ అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే 'ప్యారీ దీదీ యోజన' పథకం కింద ప్రతి మహిళకు ప్రతి నెలా రూ.2,500 ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇదిలాఉండగా దేశ రాజధాని ఢిల్లీలో జరిగే ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. మొత్తం 70 శాసనసభ స్థానాలకు ఫిబ్రవరి 5న ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడనున్నాయి.

బాడీ షేమింగ్ లైంగిక వేధింపే

కేరళ హైకోర్టు

కోచి: మహిళపై లైంగిక వేధింపులకు సంబంధించిన కేసులో కేరళ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అమ్మాయిల శరీరాకృతి(బాడీ షేమింగ్) గురించి తప్పుడు వ్యాఖ్యలు చేయడం అంటే వారి గౌరవానికి ఉద్దేశపూర్వకంగా భంగం కలిగించడమేనని స్పష్టంచేసింది. దాన్ని లైంగిక వేధింపుల నేరంగానే పరిగణించాలని తెలిపింది. తనపై నమోదైన కేసు కొట్టేయాలంటూ కేరళ రాష్ట్ర విద్యుత్ బోర్డు మాజీ ఉద్యోగి వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ ఉద్యోగి విధుల్లో ఉన్న సమయంలో తనపై వేధింపులకు పాల్పడ్డారంటూ అదే సంస్థలో పనిచేసిన ఓ మహిళా స్టాఫర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2013 నుంచి ఆయన తనను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని, ఆ తర్వాత అభ్యంతరకర మెసేజ్‌లు, వాయిస్‌కాల్స్ చేసేవారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. తన శరీరాకృతిని ఉద్దేశిస్తూ అనుచిత వ్యాఖ్యలతో తనను వేధింపులకు గురిచేశారని తెలిపారు. దీంతో పోలీసులు ఆయనపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. అయితే, ఈ కేసు కొట్టివేయాలంటూ ఆ మాజీ ఉద్యోగి కేరళ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆమెకు అందమైన శరీరం ఉందన్న ఉద్దేశంలోనే తాను మాట్లాడానని, దీన్ని లైంగిక వేధింపుల నేరంగా చూడొద్దని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. కానీ, అతడి విజ్ఞప్తిని కోర్టు తోసిపుచ్చింది. మహిళల శరీరాకృతిపై వ్యాఖ్యలు చేయడం కూడా వేధింపుల కిందకే వస్తుందని పేర్కొంటూ ఆయన పిటిషన్‌ను తిరస్కరించింది.

సినీ నటి కేసులో ప్రముఖ వ్యాపారి అరెస్ట్

వయనాడ్: సినిమా నటి హనీ రోజ్‌ని లైంగికంగా వేధించిన కేసులో కేరళకు చెందిన ప్రముఖ నగల వ్యాపారి బాబీ చెమ్మనూర్ అరెస్టయ్యారు. నటి ఫిర్యాదు అనంతరం కేరళ సర్కారు ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం... బుధవారం మధ్యాహ్నం బాబీ చెమ్మనూర్‌ను కస్టడీలోకి తీసుకుంది. హనీరోజ్ ఫిర్యాదు మేరకు కేరళ పోలీసులు ఆయనపై నాన్ బెయిలబుల్ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. వయనాడ్‌లో ఆయనను అరెస్ట్ చేశారు. వ్యాపారి చెమ్మనూర్ అరెస్టుపై నటి హనీరోజ్ స్పందించారు. ఇది తనకు ఎంతో ప్రశాంతమైన రోజని అన్నారు. తాను ఈ విషయాన్ని సీఎం పినరయి విజయన్ దృష్టికి తీసుకెళ్లగానే వ్యాపారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు.

ఇష్టం లేని పెళ్లి... విందు భోజనంలో విషం...

ముంబై: వివాహ రిసెప్షన్‌లో ఓ వ్యక్తి దుశ్చర్యకు పాల్పడ్డాడు. అతిథుల కోసం ఏర్పాటు చేసిన విందు భోజనంలో విషం కలిపాడు. తన మేనకోడలు తనకు ఇష్టం లేని పెళ్లి చేసుకోవడమే అందుకు కారణం. ఈ ఘటన మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లాలో చోటు చేసుకుంది. జిల్లాలోని ఉట్రే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. తన ఇంట్లోనే పెరిగిన మేనకోడలు మరో వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకుంది. తనకు ఇష్టం లేని పెళ్లి చేసుకోవడంతో ఆమెపై కోపం పెంచుకున్నాడు. ఇటీవల మేనకోడలి పెళ్లి రిసెప్షన్‌కి వెళ్లిన అతడు ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడు. అతిథుల కోసం ఏర్పాటు చేసిన వంటకాల్లో విషం కలిపాడు. ఇది గమనించిన కొందరు అతడిని అడ్డుకున్నారు. సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కానీ, అప్పటికే నిందితుడు పారిపోయాడు. ఆ ఆహార పదార్థాలను ఎవరూ తినకపోవడంతో ఘోర ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు... పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఆహార పదార్థాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు.

ఢిల్లీలో శీష్ మహల్ రాజకీయం

పీఎం ఇంటి వద్ద ఆప్... సీఎం నివాసం వద్ద బీజేపీ

న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న వేళ ఢిల్లీ రాజకీయాలు మరింత వేడెక్కాయి. కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్‌ను ఎలాగైనా గద్దె దించాలని ప్రతిపక్ష బీజేపీ నానా తంటాలు పడుతోంది. కేజ్రీవాల్ అవినీతి, శీశ్ మహల్ రాజకీయం మొదలు పెట్టింది. ఆప్ సైతం బీజేపీ ఆరోపణలను తిప్పికొడుతూ అభివృద్ధి మంత్రం జపిస్తోంది. వేదిక ఏదైనా ఆప్, బీజేపీ విమర్శలకు దిగుతున్నాయి. తాజాగా 'సీఎం బంగ్లా' వివాదం రాజకీయ దుమారం రేపుతోంది. ఈ బంగ్లాను 'శీష్ మహల్ (అద్దాల మేడ) అంటూ బీజేపీ పదేపదే చేస్తోన్న విమర్శలను ఆప్ తిప్పికొడుతోంది. 'నిజాన్ని చూపిస్తాం' అంటూ ఆప్ నేత సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ మీడియాను వెంటపెట్టుకొని ఆ అధికారిక నివాసం వద్దకు వెళ్లారు. అయితే వారి ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. మంత్రి, ఎంపీ అధికారాలను పోలీసులు అడ్డుకుంటున్నారని ఆప్ నేతలు మండిపడ్డారు. దాంతో సీఎం నివాసం ముందు గందరగోళ వాతావరణం నెలకొంది. సీఎం అధికారిక నివాసంలోకి వెళ్లేందుకు ఆప్ నేతలకు అనుమతి లేదని పోలీసులు చెప్పుకొచ్చారు. దానిలోభాగంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. భారీగా పోలీసులను మోహరించారు. 'ఎవరినీ లోపలికి అనుమతించొద్దంటూ పైనుంచి ఆదేశాలు వచ్చాయని పోలీసులు చెప్పారు. ఈ పోలీసు చర్య బీజేపీకి సంతోషం కలిగిస్తుంది' అని సౌరభ్ విమర్శించారు. తర్వాత సంజయ్‌సింగ్‌తో పాటు కొద్దిసేపు ధర్నాకు కూర్చొని... ప్రధాని అధికారిక నివాసం ఉన్న లోక్‌కల్యాణ్ మార్గ్ వైపు వెళ్లారు. పీఎం నివాసం సమీపంలోనే పోలీసులు వారిని అడ్డుకున్నారు. మరోవైపు ఆప్‌నకు కౌంటర్‌గా బీజేపీ ఢిల్లీ సీఎం అధికారిక నివాసం వద్దకు వెళ్లింది. అక్కడ కూడా బీజేపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ఢిల్లీలోని 6 ఫ్లాగ్ స్టాఫ్ రోడ్‌లో ఉన్న ప్రభుత్వ బంగ్లాను అరవింద్ కేజ్రీవాల్ సీఎంగా ఉన్న సమయంలో అధికారిక నివాసంగా వినియోగించారు. ఈ బంగ్లాను 'శీష్ మహల్ (అద్దాల మేడ)'గా బీజేపీ అభివర్ణిస్తోంది. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి ఆయన 7-స్టార్ రిసార్ట్‌గా మార్చుకున్నారని విమర్శించింది. దీనికి కౌంటర్‌గా పీఎం నివాసాన్ని 'రాజ్ మహల్' అంటూ ఆప్ విమర్శలు చేస్తోంది.

నెల రోజులుగా చీకట్లోనే గ్రామం!

యూపీలో యోగి పాలనకు నిదర్శనం

బుదౌన్: ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ పాలనలో ప్రజలు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ సౌకర్యం నిలిచిపోయి ఒక గ్రామం 25 రోజులుగా చీకట్లో మగ్గుతున్న దుస్థితి నెలకొంది. 250 కేవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైన కారణంగా బుదౌన్ జిల్లా ఉఘైతి ప్రాంతం సౌరాహా గ్రామంలోని 5 వేల మంది నివాసితులు తీవ్రమైన చలికాలంలో దాదాపు నెల రోజులుగా విద్యుత్ సౌకర్యం లేక అంధకారంలో జీవిస్తున్నారు. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... ట్రాన్స్‌ఫార్మర్ కూల్చి వేసిన దొంగలు... అందులోని ఆయిల్, ఇతర విలువైన భాగాలను అపహరించారు. దీనిపై విద్యుత్ శాఖ విచారణ చేపట్టి 25 రోజులు గడుస్తున్నా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. దొంగల జాడను పోలీసులు గుర్తించలేకపోయారు. సాయంత్రం కాగానే 5 వేల జనాభా ఉన్న గ్రామం అంధకారంలోకి వెళ్లిపోతోంది. దీనివల్ల ఫిబ్రవరిలో ప్రారంభం కానున్న ఉత్తర ప్రదేశ్ బోర్డు పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఎక్కువగా ప్రభావితమయ్యారు. గ్రామ పెద్ద సత్పాల్ సింగ్ మాట్లాడుతూ 'విద్యుత్ కోతతో పిల్లల చదువులు, నివాసితుల రోజువారీ జీవితాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇన్వర్టర్లు, మొబైల్ ఛార్జింగ్ వంటి ప్రాథమిక సౌకర్యాలు కూడా అందుబాటులో లేవు. గ్రామస్తులు మరింత ఆందోళన చెందుతున్నారు' అని తెలిపారు. అయితే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ రాబోతోందని ఉఘైటీ విద్యుత్ సబ్‌స్టేషన్ జూనియర్ ఇంజనీర్ అశోక్ కుమార్ హామీ ఇచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి సంబంధించి కేసు నమోదు చేశామని, మరమ్మతుల ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపామని, ఒకటి రెండు రోజుల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

నోటిదూల తెచ్చిన తంటా

రమేశ్ బిధూరిపై బీజేపీ చర్యలు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, ఎంపీ ప్రియాంక గాంధీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేత రమేశ్ బిధూరిపై ఆ పార్టీ అధిష్ఠానం ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎట్టకేలకు ఆయనపై చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం. ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీపైనే కాకుండా... ప్రియాంక గాంధీపైనా ఆయన చేసిన వ్యాఖ్యలు ఇటీవల తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై పార్టీ అధినేత జేపీ నడ్డా ఆయనను మందలించినట్లు తెలుస్తోంది. ఆయనపై చర్యలకు రంగం సిద్ధమైనట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ అంశంపై పార్టీలో రెండుసార్లు చర్చలు జరిగాయని, రమేశ్ బిధూరి పోటీ చేస్తున్న స్థానం నుంచి ఆయనను తప్పించడం లేదా మరో చోటుకి మార్చడంపై పార్టీ దృష్టిపెట్టినట్లు సమాచారం. ఇటీవల ప్రకటించిన బీజేపీ జాబితాలో కల్కాజీ నియోజకవర్గం నుంచి బిధూరి పోటీ చేస్తున్నట్లు పార్టీ ప్రకటించింది. ఇదే స్థానం నుంచి ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ పోటీపడుతున్నారు. అయితే... ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ఆ స్థానంలో బిధూరిని తప్పించి ఓ మహిళా నేతను బరిలోకి దింపే యోచనలో పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై చర్చలు ప్రాథమిక దశలో ఉన్నాయని, ఆయన స్థానంలో పోటీకి బలమైన మహిళా నేత కోసం ప్రయత్నాలు జరుగుతున్నట్లు పార్టీ నేతలు వెల్లడించారు. ఢిల్లీ సీఎం ఆతిశీ లక్ష్యంగా రమేశ్ బిధూరి ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. 'సీఎం ఆతిశీ ఆమె తండ్రినే మార్చేశారు. గతంలో ఆమెకు ఒక ఇంటి పేరు ఉండగా... ప్రస్తుతం మరో పేరు వినియోగిస్తున్నారు. అంతేకాకుండా, ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడిన అఫ్జల్ గురుకు క్షమాభిక్ష ప్రసాదించాలంటూ ఆమె తల్లిదండ్రులు పిటిషన్ దాఖలు చేశారు' అని రమేశ్ బిధూరి ఆరోపించారు. ప్రియాంకగాంధీపైనా ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత తన నియోజకవర్గంలోని అన్ని రోడ్లను ప్రియాంక గాంధీ బుగ్గల్లా తీర్చిదిద్దుతాం' అని ఆయన పేర్కొన్నారు. దీంతో కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. బీజేపీకి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేపట్టారు.

ఏఎఫ్ఐ చైర్‌పర్సన్‌గా అంజుబాబి జార్జ్

చండీగఢ్: అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ) చైర్‌పర్సన్‌గా అంజు బాబీ జార్జ్ నియమితులయ్యారు. గతేడాది అక్టోబర్‌లో ఎన్నికలు జరగగా బుధవారం కమిషన్ నియామకం జరిగింది. ఈ కమిషన్‌లో ఆరుగురు మహిళలు, ముగ్గురు పురుషులతో తొమ్మిది మంది సభ్యులు ఉన్నారు. అంజుబాబితో పాటు రన్నర్లు జ్యోతిర్మయి సిక్దర్, సునీతా రాణి, డిస్కస్ త్రోయర్ కృష్ణ పూనియా, హర్డిల్ ఎండీ వల్సమ్మ, స్టీపుల్‌ఛేజర్ సుధాసింగ్ మహిళా సభ్యులుగా ఉన్నారు. 2003 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యపతక విజేత అయిన అంజుబాబి ఏఎఫ్ఐలో సీనియర్ ఉపాధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహించారు. రెండుసార్లు ఒలింపిక్ పతకం గెలుచుకున్న నీరజ్ చోప్రాతో పాటు 3000 మీటర్ల స్టీపుల్ ఛేజర్ అవినాశ్ సాబ్లే, 2002 ఆసియా క్రీడల్లో షాట్‌పుట్ బంగారు పతక విజేత బహదూర్ సింగ్ సాగు పురుష సభ్యులుగా నియమితులయ్యారు. ఏఎఫ్ఐ గత కమిషన్‌కు సాహూ చైర్మన్‌గా పనిచేశారు. సరైన ప్రక్రియ తర్వాత ఎన్నికలు నిర్వహించామని ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పనిచేసి పదవీ విరమణ చేసిన ఏఎఫ్ఐ కోశాధికారి మధుకాంత్ తెలిపారు. నియమనిబంధనలను అనుసరించి ఐదుగురు సభ్యులు ఎన్నికయ్యారని అన్నారు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌తో సంప్రదింపుల అనంతరం నీరజ్, సాబ్లే సహా నలుగురిని అథ్లెట్స్ కమిషన్ సభ్యులుగా చేర్చినట్లు తెలిపారు. నీరజ్, సాబ్లే ఇద్దరూ అథ్లెట్లుగా కొనసాగుతుండటంతో అధిక సమయం కేటాయించలేమని అన్నారని, తర్వాత సభ్యులుగా కొనసాగేందుకు అంగీకరించారని అన్నారు.

రాష్ట్రాల హక్కులపై 'ప్రత్యక్ష దాడి'

వీసీల నియామక నిబంధనలపై సీపీఎం

న్యూఢిల్లీ : యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ముసాయిదా నిబంధనలు 2025లో ప్రభుత్వ ఆధీనంలోని విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సలర్లు (వీసీలు) ను ఎంపిక చేసే విషయమై రాష్ట్ర హక్కులపై 'నేరుగా దాడి చేసే' ఒక నిబంధన ఉందని, వెంటనే దానిని ఉపసంహరించుకోవాలని సీపీఎం బుధవారం కోరింది. కొత్త మార్గదర్శకాలు రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఛాన్సలర్‌గా ఉన్న గవర్నర్‌కు... వైస్ ఛాన్సలర్లను ఎంపిక చేయడానికి కమిటీని నియమించే అధికారం ఇస్తున్నాయి. 'యూజీసీ నిబంధనలు 2025 ముసాయిదాలో ప్రభుత్వ యాజమాన్యంలోని విశ్వవిద్యాలయాలలో వైస్-ఛాన్సలర్‌లను ఎన్నుకునే ప్రశ్నపై రాష్ట్రాల హక్కులపై ప్రత్యక్ష దాడి చేసే నిబంధన ఉంది. ఈ మార్గదర్శకాలు గవర్నర్ కమ్ ఛాన్సలర్‌కు ముగ్గురు సభ్యుల ఎంపిక కమిటీని నియమించే అధికారాన్ని ఇస్తాయి. ఇందులో ఛాన్సలర్ నామినీ కూడా చైర్‌పర్సన్‌గా ఉంటారు. కొన్ని ప్రతిపక్షాలు పాలిత రాష్ట్రాల్లో వైస్ ఛాన్సలర్ల నియామకంలో గవర్నర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఇది జరుగుతోంది' అని సీపీఎం ఒక ప్రకటనలో పేర్కొంది. ఎంపిక కమిటీలో ఎవరిని నియమించాలనే దానిపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి సమాధానం ఉండదని తెలిపింది.

ఒక్కసారిగా ఈ మార్గదర్శకాల ద్వారా కేంద్రం గవర్నర్ కమ్ ఛాన్సలర్ల ద్వారా అన్ని రాష్ట్రాల్లో విశ్వవిద్యాలయాలకు తనకు నచ్చిన వైస్ ఛాన్సలర్లను నియమించవచ్చు. ముసాయిదా నిబంధనలు రాజ్యాంగ స్థితిని ఉల్లంఘిస్తున్నాయని, ఇందులో విద్య ఏకకాలిక అంశం అని పేర్కొంది. 'ఈ ప్రమాదకరమైన నిబంధనను బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలతో సహా అన్ని ప్రజాస్వామిక వర్గాలు ఐక్యంగా వ్యతిరేకించాలి. కేంద్రం దానిని ఉపసంహరించాలి' అని తెలిపింది.

దేశ ఆర్థిక వ్యవస్థ పతనం

కాంగ్రెస్ నేత జైరాం రమేశ్

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీడీపీ వృద్ధి అంచనాలను దిగువకు సవరించడం వల్ల దేశంలో వృద్ధి, పెట్టుబడుల మందగమనం ముప్పును తొలగించడానికి సమూల చర్యలు అవసరమని కాంగ్రెస్ బుధవారం తెలిపింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జ్ జైరాం రమేశ్ మాట్లాడుతూ ఇది కేంద్ర బడ్జెట్‌కు పేలవమైన నేపథ్యాన్ని కూడా ఇది రుజువు చేసిందన్నారు. దేశంలోని పేదలకు ఆదాయ మద్దతు, అధిక గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనాలు, కనీస మద్దతు ధరలు (ఎంఎస్‌పీ) పెంచడం ఈ సమయంలో అవసరమని ఆయన అన్నారు. సంక్లిష్టమైన జీఎస్‌టీ విధానాన్ని, మధ్యతరగతి కోసం ఆదాయపు పన్ను ఉపశమనాన్ని తీవ్రంగా సరళీకృతం చేయాలని కూడా సూచించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ముందస్తు అంచనాలు కేవలం 6.4 శాతం వృద్ధిని అంచనా వేసినట్లు జైరాం రమేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో నమోదయిన 8.2 శాతం వృద్ధితో పోల్చితే ఇది నాలుగేళ్ల కనిష్ఠ స్థాయి. ఇది 6.6 శాతం వృద్ధిని ఇటీవల ఆర్‌బీఐ అంచనా వేసిన దానికంటే కూడా తక్కువ. అంతకుముందు 7.2 శాతంగా ఉన్న కొద్ది వారాలలో అన్ని ముఖ్యమైన తయారీ రంగం పతనమవడంతో అవసరమైన విధంగా విస్తరించడానికి నిరాకరణకు గురైంది' అని అన్నారు. భారతదేశ వృద్ధి మందగమనం, దాని వివిధ కోణాల వాస్తవికతను ప్రభుత్వం ఇకపై కాదనలేని విషయమని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. గత 10 సంవత్సరాలలో భారతదేశ వినియోగ కథనం వెనక్కు మళ్లడం ఆర్థిక వ్యవస్థకు అతి పెద్ద దెబ్బ అని అన్నారు. స్థూల స్థిర మూలధనం (పబ్లిక్, ప్రైవేట్) వృద్ధికి సంబంధించి ప్రభుత్వ అంచనా ప్రకారం గత ఏడాది 9 శాతంగా ఉన్న ఈ ఏడాది అది 6.4 శాతానికి తగ్గుతుందని, ప్రైవేటు పెట్టుబడుల మందగమనాన్ని ఎత్తి చూపారు. కాగా, 'ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు లక్ష్యాన్ని చేరుకోవడంలో ప్రభుత్వం విఫలమవుతుందని చాలా అంచనాలు సూచిస్తున్నాయి. ప్రభుత్వం తన నిధులను ఖర్చు చేయడంలో అసమర్థత కారణంగా విస్తృత ఆర్థిక మాంద్యం ఏర్పడింది' అని ఆయన పేర్కొన్నారు. 'కుంచించుకుపోతున్న గృహాల పొదుపు' ను ఎత్తి చూపుతూ, 2020-2021-2022-2023 మధ్య కుటుంబాల నికర ఆర్థిక పొదుపులు రూ.9 లక్షల కోట్ల మేర తగ్గాయని కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన గణాంకాలు పేర్కొన్నాయని జైరాం రమేశ్ వివరించారు.

వర్సిటీ పేరుకు కళంకం తేవడం ఇష్టం లేదు: స్టాలిన్

చెన్నై: అన్నా వర్సిటీలో విద్యార్థిని (19)పై జరిగిన లైంగిక దాడిపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అసెంబ్లీ వేదికగా స్పందించారు. ఈ ఘటనను అడ్డంపెట్టుకుని కొందరు సభ్యులు పలుమార్లు అన్నా యూనివర్సిటీ పేరు ప్రస్తావించడాన్ని ఆయన తప్పుపట్టారు. విద్యార్థినిపై లైంగిక దాడి ఎవరికీ ఆమోదయోగ్యం కాదని, అది దారుణమని వ్యాఖ్యానించారు. 'సభలో చాలామంది సభ్యులు ఒక యూనివర్సిటీ పేరును ప్రస్తావిస్తూ మాట్లాడుతున్నారు. కానీ నేను దాని పేరును ప్రస్తావించదల్చుకోలేదు. ఆ పేరుకు కళంకం తేవాలనుకోవడం లేదు. భావోద్వేగంతో నేను ఆ పేరును పక్కన పెడుతున్నా. చెన్నైలో విద్యార్థినిపై జరిగిన ఘటనను ఎవరూ ఆమోదించరు అని స్టాలిన్ వ్యాఖ్యానించారు. 'మా ప్రభుత్వం బాధితురాలికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటుంది. నేరం జరిగిన తర్వాత నిందితుడిని అరెస్ట్ చేయకపోయినా, అతడిని కాపాడే ప్రయత్నాలు జరిగినా ప్రభుత్వాన్ని నిందించవచ్చు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసినా, వేగంగా విచారణ చేయిస్తున్నా ప్రభుత్వాన్ని నిందించడమనేది రాజకీయ ప్రయోజనాల కోసమే' అని ఆరోపించారు. అన్నా వర్సిటీలో ఇటీవల విద్యార్థినిపై గణశేఖరన్ అనే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు క్యాంపస్ భవనం వెనుకాల తన స్నేహితుడితో మాట్లాడుతుండగా నిందితుడు చూశాడు. ఆమె స్నేహితుడిని బెదిరించి వెళ్లగొట్టి ఆమెపై లైంగిక దాడి చేశాడు. ఘటనపై విద్యార్థిని తన స్నేహితునితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటికి వచ్చింది. ఈ ఘటన తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది.

ఆర్‌ఎస్‌ఎస్‌కు మద్దతు వల్లే ప్రణబ్‌కు గిఫ్ట్

కేంద్రంపై కాంగ్రెస్ మండిపాటు

న్యూఢిల్లీ: మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి రాష్ట్రపతి స్మృతి ఏరియా కాంప్లెక్స్ వద్ద స్మారకం ఏర్పాటుకు కేంద్రం తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ నేత డేనిష్ అలీ మండిపడ్డారు. మరణాలను కూడా నీచ రాజకీయాలకు బీజేపీ వాడుకుంటోందని విమర్శించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు రాజ్‌ఘాట్ మెమోరియల్ వద్ద స్థలం కేటాయించాలని యావద్దేశం డిమాండ్ చేస్తే... దానిని తోసిపుచ్చిన మోదీ ప్రభుత్వం అదే స్థలంలో ముఖర్జీ స్మారకానికి నిర్ణయించిందని అన్నారు. ఇది దేశంలో ఆర్థిక విప్లవం తీసుకుచ్చిన ప్రధానమంత్రిని (మన్మోహన్) దారుణంగా అవమానించడమేనని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో డేనిష్ అలీ విమర్శించారు. నాగపూర్‌లో 2018లో జరిగిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) కార్యక్రమంలో ప్రణబ్ ముఖర్జీ పాల్గొన్న విషయాన్ని డేనిష్ అలీ గుర్తు చేశారు. 'సంఘ్‌పై ప్రణబ్ చూపించిన ప్రేమకు ప్రతిగానే ఆయనకు కేంద్రం కానుక అందించింది. నాగపూర్ ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యాలయం ముందు ప్రణబ్ తలవంచి, సంఘ్ వ్యవస్థాపకుడు హెడ్గేవార్ పేరిట ఏర్పాటు చేసిన ధర్మపుత్ర టైటిల్‌ను అందుకున్నారు. పార్లమెంటు హౌస్‌లో సావర్కర్ చిత్తరువు ఏర్పాటులోనూ ప్రణబ్ కీలక పాత్ర పోషించారు' అని డేనిష్ అలీ తెలిపారు. కాగా, దీనికి ముందు ప్రణబ్ ముఖర్జీ స్మారక స్థూపాన్ని ఢిల్లీలో ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాజ్‌ఘాట్ కాంప్లెక్స్ పరిధిలోని రాష్ట్రీయ స్మృతి స్థల్‌లో దీన్ని నెలకొల్పనుంది. ఈ సమాచారాన్ని తెలియజేస్తూ కేంద్ర గృహనిర్మాణ-పట్టణాభివృద్ధి శాఖ అధికారులు తనకు లేఖ పంపారని ప్రణబ్ కుమార్తె శర్మిష్ఠ తెలిపారు. ప్రధాని మోదీకి కృతజ్ఞతలు చెప్పారు. ప్రణబ్ చనిపోయినప్పుడు సంతాపం తెలిపేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేకంగా భేటీ కాలేదని ఇటీవల శర్మిష్ఠ విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రముఖ నేత అయిన ప్రణబ్ ముఖర్జీ గతంలో ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, పీవీ నరసింహారావు, డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో కీలక మంత్రి పదవులు నిర్వహించారు. 2012 నుంచి 2017 వరకూ రాష్ట్రపతిగా సేవలందించారు. 2020 ఆగస్టు 31న ప్రణబ్ కన్నుమూశారు.

భారత్ భూభాగం ఆక్రమణపై కట్టుకథలు

బీఎస్ఎఫ్

న్యూఢిల్లీ: భారత్‌లో ఐదు కిలోమీటర్ల మేరకు భూభాగాన్ని బంగ్లాదేశ్ సైన్యం ఆక్రమించుకొందన్న మీడియా కథనాలను సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) తిరస్కరించింది. అవి పూర్తిగా బాధ్యతారాహిత్యమైన, ఆధార రహిత కథనాలని పేర్కొంది. 'ఉత్తర 24 పరగణాల జిల్లా రాంఘాట్ గ్రామంలోని బగ్దా బ్లాక్‌లోని భూభాగంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ అంతర్జాతీయ సరిహద్దు కొడల్యా నదీ తీరం నుంచి వెళుతుంది. రెండువైపులా కచ్చితమైన హద్దులు గుర్తించి స్తంభాలు పాతి వేసిన కంచె ఉంది. ఈ సరిహద్దు వెంట బీఎస్ఎఫ్ గస్తీలో ఎటువంటి మార్పు జరగలేదు. ఒక్క అంగుళం భారత భూభాగాన్ని తీసుకోలేదు... తీసుకోలేరు. 1975 భారత్, బంగ్లా సరిహద్దు మార్గదర్శకాల ఆధారంగా బీఎస్ఎఫ్, బీజీబీ వాటి విధులను ప్రశాంతంగా నిర్వహిస్తున్నాయి' అని బీఎస్ఎఫ్ దక్షిణ బెంగాల్ ఫ్రాంటియర్ పేర్కొంది. అంతేకాకుండా కంచె లేని చోట్ల కూడా బంగ్లాదేశీయుల చొరబాట్లు, స్మగ్లింగ్ వంటివి జరగకుండా కఠినచర్యలు తీసుకొన్నట్లు బీఎస్ఎఫ్ వివరించింది. బంగ్లాదేశ్‌కు చెందిన మీడియాలోని కొన్ని వర్గాలు నిరాధారంగా వీటిని ప్రచారం చేస్తున్నాయని బీఎస్ఎఫ్ అభిప్రాయపడింది. బోర్డర్ గార్డ్సు బంగ్లాదేశ్ (బీజీబీ) మోటార్ బోట్లు, ఏటీవీలతో డిసెంబర్ 19 నుంచి గస్తీ మొదలుపెట్టిందన్న ప్రచారాన్ని కొట్టిపారేసింది. కాగా, మాల్దా జిల్లాలో సుక్‌దేబ్‌పూర్‌లో సరిహద్దుల వెంట బీఎస్ఎఫ్, బీజీబీ గార్డులకు మధ్య కంచె విషయంలో గొడవ జరిగింది. భారత్ వైపు కంచె నిర్మాణానికి బంగ్లాదేశ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ తర్వాత కొద్దిసేపటికే అక్కడ గ్రామాల్లో ప్రజలు చేరుకొని వందేమాతరం, భారత్ మాతాకీ జై వంటి నినాదాలు చేశారు. ఆ తర్వాత బీఎస్ఎఫ్ దళాలు స్పందిస్తూ ముందస్తుగా రెండుదేశాలు చేసుకొన్న ఒప్పందం ప్రకారం దానిని నిర్మిస్తున్నట్లు బీజీబీకి నచ్చజెప్పారు. ఆ తర్వాత తిరిగి కంచె పనులు మొదలుపెట్టారు.

ఆర్మీ కెప్టెన్‌గా అవతారమెత్తి...

లక్నో: ఒడిశా రాష్ట్రం బాలాసోర్ జిల్లాకు చెందిన హైదర్ అలీ (40)... తాను ఆర్మీ కెప్టెన్ అని నమ్మిస్తూ మహిళలను మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. తన పేరు హర్తిక్ బిగ్లో అని, ఆర్మీ మెడికల్ కార్ప్స్ అధికారిని అంటూ మహిళలతో పరిచయం పెంచుకునేవాడు. ఆ తర్వాత వాళ్ల నుంచి లక్షల్లో డబ్బులు వసూలు చేసేవాడు. పోలీసుల వివరాల ప్రకారం. అలీ... ఆడవాళ్లతో పరిచయం పెంచుకున్నాక, నమ్మించే కారణాలు చెబుతూ వారి నుంచి డబ్బులు తీసుకునేవాడు. నగదు అందిన తర్వాత అతడు తన సమాచారానికి ముగింపు పలికేవాడు. ఆ తర్వాత మరో మరోచోటుకు వెళ్లి కొత్త పరిచయాలకు తెరతీసేవాడు. మహిళలను బెదిరించి వసూలు చేసిన డబ్బుతో విలాసవంతమైన జీవితాన్ని గడిపేవాడు. ఇదిలా ఉండగా... లక్నోలో ఓ మహిళ పరిచయం అయిన తర్వాత అతడి తలరాత మారింది. అతడిపై పోలీసు ఫిర్యాదు చేయడంతో అలీ నాటకాలు బయటపడ్డాయి.

విశాలాంధ్ర హైదరాబాద్

సింగరేణికి స్పెషల్ క్యాంపెన్ 4.0 పురస్కారం

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా స్వీకరించిన సీఎండీ ఎన్.బలరామ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ ఎక్కువ సంఖ్యలో ప్రదేశాలను పరిశుభ్రం చేసినందుకు సింగరేణి కాలరీస్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్పెషల్ క్యాంపెన్ 4.0లో ఎక్కువ ప్రాంతాలను పరిశుభ్ర పరిచిన (మ్యాగ్జిమమ్ నెంబర్ ఆఫ్ సైట్స్ క్లీన్డ్) విభాగంలో అవార్డు వరించింది. ఢిల్లీలో బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చింతన్ శివిర్‌లో భాగంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి చేతుల మీదుగా సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ఈ అవార్డును స్వీకరించారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని కోలిండియా, అనుబంధ సంస్థలు, నైవేలీ లిగ్నైట్ సంస్థల్లో గత ఏడాది అక్టోబరు 2వ తేదీ నుంచి అక్టోబరు 31వ తేదీ వరకు స్పెషల్ క్యాంపెన్ 4.0 పేరిట స్వచ్ఛతా కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఇందులో సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో 157 చోట్ల పరిసరాలను పరిశుభ్రం చేయడాన్ని స్వీయ లక్ష్యంగా నిర్దేశించుకోవడం జరిగింది. అయితే 216 ప్రదేశాల్లో పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టడం విశేషం. ఈ నేపథ్యంలో ఎక్కువ సంఖ్యలో ప్రదేశాలను శుభ్ర పరచిన విభాగంలో ఈ పురస్కారం లభించింది. సింగరేణి చేపట్టిన పరిశుభ్రత కార్యక్రమానికి గుర్తింపు లభించడంపై సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ దేశ ఇంధన అవసరాలకు బొగ్గు ఎంత అవసరమో ఆరోగ్య భారతావనికి పరిశుభ్రత అంతే అవసరమన్నారు. సింగరేణి పరిశుభ్రతకు పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బొగ్గు శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్, బొగ్గు శాఖ అదనపు కార్యదర్శులు రూపేందర్ బ్రార్, విస్మితా తేజ్, సింగరేణి జీఎం బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రలోభాలకు గురికావద్దు: ఉప కమిషనర్

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి సర్కిల్‌లో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను వెరిఫికేషన్ చేస్తున్నారని, ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని చెపితే వారి మాటలు నమ్మి ప్రలోబాలకు కావద్దని సర్కిల్ ఉప కమిషనర్ గోదుమల రాజు తెలిపారు. సర్కిల్‌లో 42వేల 968 దరఖాస్తు చేసుకున్నారని, వీరి దరఖాస్తులు వెరిఫికేషన్ జరుగుతుందని ఆయన తెలిపారు. దరఖాస్తుదారులకు సర్కిల్ సిబ్బంది ఫోన్ చేసి దరఖాస్తుదారుల వద్ద వస్తుంటారని, ఈ సమయంలో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేయడం కానీ, ఇతర అవసరాల కోసం డబ్బులు అడిగినట్లైతే సర్కిల్ కార్యాలయంలో సంబంధిత అధికారులకు తెలియజేసినట్లైతే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉప కమిషనర్ రాజు తెలిపారు.

తెలుగు వర్సిటీకి ఎక్సలెన్స్ అవార్డు

విశాలాంధ్ర - హైదరాబాద్ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయాల కన్న విభిన్నమైనది, తెలుగు భాష, సాహిత్యం, లలిత కళారంగాల విశ్వవిద్యాలయంగా గుర్తింపబడి విద్యారంగంలో ఎక్సలెన్స్ పురస్కారాన్ని పొందింది. నోవాటెల్ హోటల్‌లో హైబిజ్.టివి వారు నిర్వహించిన ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డ 2024 ప్రధానోత్సవ కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసిన శాంత బయోటెక్ అధినేత డా.వరప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు పురస్కారాన్ని అందుకొని ప్రసంగిస్తూ సంప్రదాయ విశ్వవిద్యాలయంగా తెలుగు భాష, సంస్కృతిని విశ్వ వ్యాప్తంగా చేయాలనే కృతనిశ్చయంగా పని చేస్తుందని, రాష్ట్రంలోని విద్యారంగ నిపుణుల సలహాలతో ప్రణాళికలను రూపొందించుకొని మరింత కృషి చేయడానికి ప్రయత్నం చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో వర్సిటి రిజిస్ట్రార్ ఆచార్య హనుమంతరావు, మల్లారెడ్డి, విద్యాపీఠ్ వైస్ ఛైర్‌పర్సన్ డా.సి.హెచ్.ప్రీతిరెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యులు డా.బూర నర్సయ్య గౌడ్‌తో పాటు నగరంలోని ప్రముఖ విద్యారంగ నిపుణులు పాల్గొన్నారు.

కార్మికుల పక్షాన నిలిచే పత్రిక విశాలాంధ్ర

క్యాలెండర్‌ను ఆవిష్కరణలో జగదీశ్వర్‌గౌడ్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : పేదలు, కార్మికుల పక్షాన నిలిచే పత్రిక విశాలాంధ్ర అని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే వి.జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. మంగళవారం విశాలాంధ్ర తెలుగు దినపత్రిక ఆధ్వర్యంలో ముద్రించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధి పత్రికలని, ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరవేయడంలో వాటి పాత్ర కీలకమని అన్నారు. నేటి సమాజంలో పత్రికల పాత్ర కీలకమైందని, వీటికి స్వేచ్ఛ ముఖ్యమన్నారు. విశాలాంధ్ర క్యాలెండర్ చాలా బాగుందని, అన్ని హంగులతో రూపొందించారన్నారు. విశాలాంధ్ర దినపత్రిక తెలుగువారి పత్రిక అని, పేదల, కార్మికుల పక్షాన నిలబడుతుందని తెలిపారు. సమస్యలపై ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలిచిన విశాలాంధ్ర భవిష్యత్తులో దినదినాభివృద్ధి చెందాలని జగదీశ్వర్‌గౌడ్ ఆకాంక్షించారు. విశాలాంధ్ర శేరిలింగంపల్లి ఇన్‌ఛార్జీ అంతారం రాజేష్‌గౌడ్, ప్రజాపక్షం రిపోర్టర్ హేమంత్‌రెడ్డి, ప్రజాజ్యోతి రిపోర్టర్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమం

కోట్లాది మంది జీవితాలతో ముడిపడిన శాఖలు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు రాష్ట్రంలో కోట్లాదిమంది జీవితాలతో ముడిపడి ఉన్నాయి. ఈ శాఖల ద్వారా మెరుగైన సేవలు రాష్ట్ర ప్రజలకు అందాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రి సీతక్క అన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన ప్రీ బడ్జెట్ సమావేశంలో ఈ శాఖలకు సంబంధించి వారు పలు అంశాలను చర్చించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నతనంలోనే మంచి పోషక ఆహారాన్ని అందించడం ద్వారా వారికి ఉజ్వలమైన భవిష్యత్తును ప్రసాదించే అవకాశం ఉంటుందని డిప్యూటీ సీఎం తెలిపారు. వారిపై పెట్టే పెట్టుబడి రాష్ట్ర భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని అన్నారు. జువైనల్ హోమ్స్‌లోని పిల్లల మానసిక పరిపక్వతకు క్రీడలు దోహదం చేస్తాయి. ఇందుకు గాను రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ నుంచి స్పోర్ట్స్ కిడ్స్ అందిస్తామని డిప్యూటీ సీఎం సంబంధిత అధికారులకు తెలిపారు. స్పోర్ట్స్ కిట్స్ అందజేయాల్సిందిగా క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డికి సమావేశం నుంచి సూచించారు. శిశు విహార్‌లో ప్రస్తుతం ఉన్న శిశువుల సంఖ్య వారికి అందుతున్న సౌకర్యాలు, వైద్య సహాయం తదితర అంశాలపై మంత్రులు సమ్మె అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఉన్న మహిళా ప్రాంగణాల పరిస్థితిపై డిప్యూటీ సీఎం, మంత్రి సీతక్క ఆరా తీశారు. ప్రస్తుతం అవి నిరుపయోగంగా ఉన్నట్టు అధికారులు తెలియజేయడంతో వాటిని పూర్తిగా సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఈ కేంద్రాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులకు పెద్ద వ్యాపారాలకు పనికొచ్చే విధంగా శిక్షణ ఇవ్వాలని సూచించారు. దివ్యాంగులకు స్వల్పకాలిక శిక్షణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ట్రాన్స్ జెండర్ల సేవలను ప్రస్తుతం హైదరాబాద్ ట్రాఫిక్ కూడళ్లలో వినియోగిస్తున్నారు. ఈ ప్రయోగం విజయవంతం అయితే మండల కేంద్రాల్లోనూ ట్రాన్స్ జెండర్ల సేవలు వినియోగిస్తామని మంత్రి సీతక్క అభిప్రాయపడ్డారు. దీంతోపాటు ట్రాన్స్ జెండర్ల క్లినిక్ సెంటర్లు దేశంలో కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే అందుబాటులో ఉన్నాయని మంత్రులు వివరించారు. కేంద్ర సౌజన్యంతో కొనసాగుతున్న పథకాలు, నిధుల విడుదల, భవిష్యత్తులో ఈ పథకాలకు సంబంధించిన ప్రణాళికలపై చర్చించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేష్ కుమార్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనితా రామచంద్రన్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

జిల్లాను అభివృద్ధి దిశగా నడిపించాలి: ఈటెల

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అమలు పరుస్తూ బలహీనవర్గాల ప్రజలకు చేయూతనందించడంతో పాటు, జిల్లాను అభివృద్ధి దిశగా నడిపించడమే కాకుండా సమస్యలను చర్చించడానికి కాకుండా పరిష్కరించడానికి సమావేశమవ్వాలని మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు, జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ దిశ కమిటీ ఛైర్మన్ ఈటెల రాజేందర్ తెలిపారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ దిశ సమావేశానికి మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు, జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ దిశ కమిటీ ఛైర్మన్ ఈటెల రాజేందర్ హాజరై అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి కమిటీ సభ్యులు మేడ్చల్ ఎంఎల్ఏ మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎంఎల్ఏ మర్రిరాజశేఖర్ రెడ్డి, ఉప్పల్ ఎంఎల్ఏ బండారి లక్ష్మారెడ్డి, కుత్బుల్లాపూర్ ఎంఎల్ఏ వివేకానంద, శేరిలింగంపల్లి ఎంఎల్ఏ అరికెపూడి గాంధి, మెంబరు సెక్రటరీ జిల్లా కలెక్టరు గౌతం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ ఛైర్మన్ ఈటెల రాజేందర్ జిల్లాలోని అన్ని శాఖల ద్వారా కేంద్ర, రాష్ట్ర పథకాల అమలును, పురోగతిని సమీక్షించారు. జిల్లాలో సంక్షేమ శాఖల వారీగా నిర్వహిస్తున్న పథకాల ద్వారా ఎంత మందికి లబ్ధిచేకూరుతుందో, అవసరమైన సలహాలను, సూచనలకు అధికారులకు తెలపారు. అధికారులు చేసే పనుల ద్వారా వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించాలన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పథకం ద్వారా జిల్లాలో గ్రామణ పేదలకు 18014 జాబ్ కార్డులు అందించి 19378 మందికి రూ.144.62 లక్షల వేతనలు అందించామని డిఆర్డిఎ పిడి సాంబశివరావు వివరించారు. దీన్ దయాల్ అంత్యోదయ యోజన జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ కింద జిల్లాలో 50 మందికి ఎస్‌హెచ్‌జి గ్రూపుల వారికి బ్యాంకు రుణాల ద్వారా రెడి టూఈట్ భాగంలో పచ్చళ్లు, స్నాక్స్ ప్రాసెస్ మిషినరీ యూనిట్లను 3.69 కోట్ల రూపాయలతో అందజేసామన్నారు. జాతీయ సామాజక సహాయ పథకం కింద వృద్ధాప్య, వితంతు, వికలాంగుల వంట 11 కేటగిరిలకు గాను కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రతినెల 14.630 మందికి రూ.40,35,550 ఫింఛన్లు అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో దుండిగల్, కండ్లకోయ, రాయల పూర్, తుర్కపల్లిలో సంసద్ ఆదర్శ్ గ్రామ్ యోజన కింద అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ పథకం క్రింద 61 గ్రామాలలో మరుగుదొడ్ల వినియోగంపై ప్రజల్లో అవగాహన, సెప్టిక్ ట్యాంక్‌ల నిర్వహణ, ప్లాస్టిక్ బహిష్కరణ వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది. జాతీయ పట్టణ జీవనోపాధ మిషన్ కింద మెప్మా ద్వారా పట్టణ పేదల పేదరికం తగ్గించేందుకు వీధి వ్యాపారాల పథకంలో 3305 మందికి ఉపాధికల్పించడం జంగిందన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ పథకం కింద జల్లాలో 505 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలలో 85,998 మంది విద్యార్థులు చదువుతున్నారని వీరికి మధ్యాహ్న భోజనుం, యూనిఫాం అందంచడం జరుగుతుందన జిల్లా విద్యాశాఖ అధాకారి తెలిపారు.

ఎలక్షన్ వాచ్ కమిటీ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ 2025 సంవత్సరంల క్యాలెండర్‌ను రాష్ట్ర రహదారులు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆవిష్కరించారు. బుధవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో క్యాలెండర్ ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాలకు సముచిత ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి చేస్తున్నదని చెప్పారు. సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేస్తున్న సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మెన్ డా. బొమ్మర బోయిన కేశవులు ముదిరజ్‌ను అభినందించారు. డా.బొమ్మర బోయిన కేశవులు ముదిరాజ్ మాట్లాడుతూ 2009లో ప్రారంభమైన సమాచార హక్కు పరిరక్షణ సమితి సమాచార హక్కు చట్టంపై, సామాజిక అంశాలపై కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్నదని చెప్పారు. సమాచార హక్కు పరిరక్షణ సమితితో పాటు ఎలక్షన్ వాచ్ కమిటీ ఆధ్వర్యంలో ఓటర్ చైతన్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా సదస్సులు, ర్యాలీలు, సభలు, సమావేశాలు, చర్చలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమాచార హక్కు చట్టంపై, ఎన్నికలపై, సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్న తాము ఈ యేడాది కూడా విరివిగా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ కార్యకర్తలకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు పరిరక్షణ సమితి సెక్రటరీ జనరల్, విశ్రాంత ఐఏఎస్ అధికారి డా.పి.ధర్మరాజు, హైకోర్టు న్యాయవాది లుక్మాన్ అలి, మెట్టు మధు, కలవాల హరికృష్ణ, గండెల నాగార్జున, సురేష్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత : మేయర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని వాటికి తక్షణ పరిష్కారాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. క్షేత్ర పరిధి సందర్శనలో భాగంగా బుధవారం జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కూకట్‌పల్లి జోన్‌లోని బాలానగర్, అల్లాపూర్ వార్డులలో పలు ప్రాంతాలను సందర్శించి, ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను పరిశీలించి, సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరించేందుకు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటూ, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టామని, నగర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మేయర్ తెలిపారు. బాలానగర్ డివిజన్‌లోని వినాయక నగర్, రాజీవ్ గాంధీ నగర్‌లలో పర్యటించి నాలాలు, జిహెచ్ఎంసి పార్కును సందర్శించారు. వినాయక నగర్ నాలాలో డి-సిల్టింగ్ క్రమం తప్పకుండా చేయాలని సూచించారు. ప్రమాదాలను నివారించేందుకు భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. లోతట్టు ప్రాంత ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పార్కులు, చెరువులు తదితర ప్రాంతాల్లో ఫాగింగ్ చేయాలని, పారిశుధ్య నిర్వహణ సజావుగా జరగాలని, ఇంటింటికి వెళ్లి యాంటీ లార్వా ఆపరేషన్లు చేయాలని ఎంటమాలజీ అధికారులకు ఆదేశించారు. రాజీవ్ గాంధీనగర్‌లో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని, పాత బ్రిడ్జిని వైయిండనింగ్ చేయాలని, కొన్ని చోట్ల వీధి లైట్లు వెలగడం లేదని కొత్తవి ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు మేయర్ దృష్టికి తిసుకురాగా, వైయిండనింగ్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సప్దార్ నగర్ ఇ-బ్లాక్ సీవరేజ్ లైన్, రోడ్డు పనులు, రాజీవ్ గాంధీ నగర్ సి-బ్లాక్‌లో సీవరేజ్ పనులు, రోడ్డు మరమ్మత్తులు, ప్రహరీ గోడ, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. కూబా మజీద్ వద్ద స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ నిర్మించాలని కార్పొరేటర్ సబియా బేగం మేయర్‌ను కోరగా, స్ట్రామ్ వాటర్ కాలువ నిర్మాణ పనులకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్, బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, అల్లాపూర్ కార్పొరేటర్ సబియా బేగం, అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, రఘు ప్రసాద్, ఎస్.ఇ కోటేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్లు, ఏ.ఎం.హెచ్.ఓలు, విద్యుత్, తదితర అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో బుధవారం శానిటేషన్ నిర్వహణపై ఏ.ఎం.హెచ్.ఓలు, ఎస్.డబ్ల్యూ.ఎం డిప్యూటీ ఇంజనీర్లు, రాంకీ ఏజెన్సీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని సర్కిళ్లలో శానిటేషన్ పనులు, చెత్త సేకరణ, పారిశుధ్య పనుల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా నగరాన్ని స్వచ్ఛమైన, ఆకర్షణీయమైన పరిశుభ్ర నగరంగా రూపొందించే లక్ష్యంతో పని చేయాలన్నారు. ప్రజలను శుభ్రత పట్ల చైతన్య పరచాలన్నారు. నగరంలోని అన్ని కాలనీలు, బస్తీలు ప్రధాన రహదారుల శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వ్యాపార సముదాయల వద్ద చెత్త పడేయకుండా ప్రతి షాప్ ముందు తప్పనిసరిగా డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేసుకునేలా దుకాణదారులను ప్రోత్సహించాలన్నారు. అట్టి చెత్త సేకరణకు స్వచ్ఛ ఆటోలను అనుసంధానం చేయాలని సూచించారు. అదే విధంగా కమర్షియల్ షాప్స్ ఉన్న ఏరియాలో క్రమం తప్పకుండా ఉదయం వేళలో తనిఖీలు చేయాలని ఏ.ఎం.హెచ్.ఓలకు సూచించారు. డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేసుకోకుండా చెత్తను పడేస్తున్న వ్యాపారులను గుర్తించి జరిమానాలను విధించాలని సూచించారు. ప్రతి రోజు జనరేట్ అవుతున్న చెత్తను సమర్థవంతంగా సేకరించేలా చర్యలు చేపట్టాలన్నారు. నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతాలను సందర్శించి భవననిర్మాణ వ్యర్థాల డంపింగ్‌పై అవగాహన కల్పించి, వ్యర్థాలను రీసైక్లింగ్ ప్లాంట్‌కు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సి అండ్ డి వేస్ట్ రీసైక్లింగ్ ప్లాంట్‌లను సందర్శించాలని తెలిపారు. నగర శుభ్రత కోసం అధికారులతో పాటు ప్రజలు భాగస్వాములయ్యేలా చైతన్య పరచాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్ రెడ్డి, సి.ఎం.హెచ్.ఓ డా.పద్మజ, ఏ.ఎం.హెచ్.ఓలు, ఎస్.డబ్ల్యూ.ఎం అధికారులు, రాంకీ ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాల కోసం విద్యార్థినీ విద్యార్థులు ఆన్లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు. 2025-26 విద్యా సంవత్సరంలో వివిధ గురుకులాల్లో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాల కోసం ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి 23న కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించనుందని తెలిపారు. గురుకులాల్లో విద్యను అభ్యసించదల్చిన బాలబాలికలు https://tgcet.cgg.gov.in ద్వారా ఆన్లైన్‌లో ఫిబ్రవరి 01వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు కుల ధ్రువీకరణపత్రం నెంబరు, ఆదాయ ధ్రువీకరణ పత్రం నెంబరు, ఆధార్ కార్డు నెంబరు, బర్త్ సర్టిఫికెట్, ఫోటో అవసరమని తెలిపారు. పై ధ్రువీకరణ పత్రాల సత్వర జారీ కోసం కలెక్టరేట్లో సహాయ కేంద్రం ఏర్పాటు చేశామని, ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ కేంద్రం తెరిచి ఉంటుందని అన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ గురుకులాల్లో ప్రవేశాల కోసం ఆసక్తి గల విద్యార్థులు ఆన్లైన్ ద్వారా గడువు లోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థిని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ప్రయాణీకుల సృజనాత్మకతను ప్రదర్శించుకునేందుకు వేదికగా 'మెట్రో'

మెట్రో ఎండీ ఎన్.వి.ఎస్. రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : నిత్యం లక్షలాదిగా ప్రయాణించే మెట్రో రైల్ ఇప్పుడు ప్రయాణికులకు కొత్త అనుభూతిని అందించబోతోంది. ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారంగా మెట్రోను ఆశ్రయిస్తూ ప్రయాణిస్తున్న అనేక మందిలో వివిధ కళా, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో ఉన్న అభిరుచిని ప్రదర్శించుకునే గొప్ప అవకాశాన్ని మెట్రో ఇవ్వనున్నది. ఇందుకు ఎంజీబీఎస్ వంటి కొన్ని విశాలమైన స్టేషన్లలో తమ నైపుణ్యాలను ప్రదర్శించుకునేందుకు తగిన స్థలం కేటాయించనున్నట్టు హెచ్ఎంఆర్ఎల్, హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి వెల్లడించారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఎల్ అండ్ టీ మెట్రో, హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థలు మి టైం ఆన్ మెట్రో పేరుతో మూడు రోజుల వినూత్న ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించాయి. ఈ మెట్రో పండుగను జేబీఎస్ మెట్రో స్టేషన్‌లో హెచ్ఎంఆర్ ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి, ఎల్ అండ్ టీ మెట్రో రైల్ హైదరాబాద్ ఎండీ, సీఈఓ కేవీబీ రెడ్డి బుధవారం ప్రారంభించారు. మెట్రో అంటే కేవలం కాంక్రీట్, గోడల నిర్మాణాలతో కూడిన ఒక రవాణా వ్యవస్థ మాత్రమే కాదని, ఇది హైదరాబాద్ జన జీవితాలతో ముడిపడి ఉన్న ఆత్మ వంటిదని ఎన్.వి.ఎస్. రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌ని ఒక అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి సూచనలను దృష్టిలో పెట్టుకొని మెట్రో ద్వారా మరింత అభివృద్ధి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఎన్.వి.ఎస్.రెడ్డి చెప్పారు. కొన్ని ముఖ్యమైన స్టేషన్ల జంక్షన్లను విశాలమైన స్థలాలను ప్రత్యేక హబ్‌లుగా, అంతర్జాతీయ కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని అయన వెల్లడించారు.

కొత్త కారిడార్లకు మెగా జంక్షన్...

ఫేజ్-2 పార్ట్-బిలోని ప్రతిపాదిత జేబీఎస్-శామీర్ పేట్ (22 కి.మీ), ప్యారడైజ్-మేడ్చల్ (23 కి.మీ) మార్గాలకు ఉమ్మడిగా ఒక మెగా జంక్షన్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచనల మేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఎన్.వి.ఎస్.రెడ్డి తెలిపారు. రెండవ దశ పార్ట్ 'ఏ' అయిదు కారిడార్లకు సంబంధించి ఇప్పటికే కేంద్రానికి పంపిన డీపీఆర్‌లను త్వరలో ఆమోదింప జేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆ అనుమతులు రాగానే ఆ పనులు త్వరితగతిన ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు. ఈ లోగా పాతనగరంలో భూసేకరణ చేస్తూనే, రోడ్డు విస్తరణకు, మెట్రో నిర్మాణానికి కూల్చివేతల పనులు త్వరలోనే చేపట్టనున్నట్టు ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఎల్ అండ్ టీ మెట్రో రైల్ ఎండీ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ మెట్రో రైళ్లలో పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా అదనపు రైళ్లను కొనుగోలు చేయడానికి తగు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

ఆర్డర్ ఇచ్చిన 18 నెలల్లో కొత్త రైళ్లు వస్తాయని ఆయన అన్నారు. అయితే ప్రయాణీకులు ఇంకా క్రమశిక్షణను అలవర్చుకుంటే రద్దీ సమస్య చాలా వరకు తగ్గుతుందని చెప్పారు. 'మి టైం ఆన్ మెట్రో' ప్రచారంలో భాగంగా లఘు చిత్రాలను, నృత్యాలను ఈ సందర్భంగా ప్రదర్శించారు. అలాగే సంక్రాంతి సంబురాలు, ఈ ప్రచార కార్యక్రమం ప్రతిబింబించేలా రూపొందించిన మెట్రో రైలుని ఎన్.వి.ఎస్.రెడ్డి, కేవీబీ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.

ప్రభుత్వాసుపత్రులపై విశ్వాసం కలిగించాలి

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : 50 పడకల ఆసుపత్రిగా ఉన్న అమీర్‌పేట్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో వంద పడకల ఆస్పత్రిగా ఏర్పాటు చేయుటకు ప్రతిపాదనలు సమర్పించాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ అమీర్‌ట్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను మంత్రి సందర్శించి ఆస్పత్రిలో సర్జరీ వార్డ్, గర్భిణీల వార్డ్, ఫార్మసి, చిన్నపిల్లలకు మందులు ఇచ్చే గది, రిజిస్టర్‌లను పరిశీలించారు. హాస్పిటల్‌లో ఉన్న డాక్టర్లు, రోగులు, రోగుల బంధువులతో వారి సమస్యలు అడిగి తెలుసుకున్నరు. హాస్పిటల్‌కి ప్రతిరోజూ వస్తున్న ఓపీలు ఎన్ని, ల్యాబ్, ఎమర్జెన్సీ కేసులు ఎన్ని, ప్రతి నెలలో జరుగుతున్న గర్భిణీ ప్రసూతులు ఎన్ని తదితర వాటిపై హాస్పిటల్ సుపరిండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ హాస్పిటల్‌కి వచ్చే రోగులకు విశ్వాసం కల్పించేలా పని చేయాలని వైద్యులకు సూచించారు. ఏమైనా మందుల కొరత ఉందా అని అడిగి తెలుసుకున్నారు. ఏఏ మందులు ఎక్కువగా వెళుతుంటాయి. అడగగా బీపీ, షుగర్, ఫీవర్, జలుబు ఎక్కువగా ప్రతి నెల వినియోగంలో ఉంటాయన్నారు. బయో మెడికల్ వెస్టేజ్ ప్రాంతాన్ని పరిశీలించారు. హాస్పిటల్‌లో పని చేసే శానిటేషన్ సిబ్బందికి కొన్ని నెలలుగా జీతాలు రావడం లేదని మంత్రి దృష్టికి తీసుకురాగా వెంటనే వైద్య శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం చేశారు. స్థానికులు ఆస్పత్రికి ఎక్కువ మంది రోగులు అధికంగా వస్తున్నారని స్థానికులు మంత్రికి విజ్ఞప్తి చేయగా మంత్రి ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టియన్‌ను అదనంగా 50 పడకలు పెంచాలని విజ్ఞప్తి చేసి, జిల్లా కలెక్టర్‌కు అదనంగా పడకలు పెంచేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ప్రభుత్వం వైద్యంలో అనేక సంస్కరణలు చేపట్టిందని, మా ప్రభుత్వం డాక్టర్లు, నర్సులో, ల్యాబ్ అసిస్టెంట్, ఫార్మసిస్ట్‌ల నియామకాలు చేపట్టిందన్నారు. 108 అంబులెన్స్ హాస్పిటల్‌కి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని, 10 డయాలిసిస్ బెడ్స్ ఏర్పాటు చేయాలని వైద్య శాఖ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురశెట్టి, హాస్పిటల్ సూపరిండెంట్ మహమ్మద్ రావుఫ్, ఆడియో సాయిరాం, వైద్యులు, తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి :మంత్రి

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వే కేటాయింపు నిష్పక్షపాతంగా పారదర్శకంగా జరగాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం షేక్ పెట్ తహసిల్దార్ కార్యాలయాన్ని మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలో సిబ్బంది హాజరు, ఇన్ వార్డ్, అవుట్ వార్డ్, కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ దరఖాస్తులు, ఆన్లైన్లో దాష్ బోర్డు, రిజిస్టర్లను పరిశీలించారు. ప్రజా పాలన ప్రభుత్వం ఇళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తుందని సర్వే, కేటాయింపు పారదర్శకంగా జరగాలని ఆదేశించారు. ఇన్ వార్డు, ఔట్ వార్డు రిజిస్టర్ సరిగా నిర్వహించడం లేదని లేదని మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న రికార్డులు క్లియర్ చేయాలని సూచించారు. తహసిల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ఖాళీగా ఉన్న భవనాన్ని అంగన్‌వాడి లేదంటే ఇతర అవసరాల కోసం ఉపయోగించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురశెట్టి, సికింద్రాబాద్ ఆర్‌డీఓ సాయిరాం, తహసిల్దార్ అనితా రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా

ఎమ్మెల్సీ కోదండరామ్

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులు, డిఎల సవరణ వంటి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (టిజిపిఎ)-2025 క్యాలెండర్‌ను అధ్యక్షులు కనకం కోమురెల్లి, ప్రధాన కార్యదర్శి తూము అశోక్ రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి సూర్యకళ, అసోసియేట్ ప్రెసిడెంట్ టి.ఎ.ఎస్.ఆర్.గుప్త కోశాధికారి జయంతి ప్రకాశ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యోగులు ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా తమ విధులు నిర్వరిస్తున్నారని, గతంలో ఇలా ఉండేది కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 7 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నదని, ఆదాయంతో పాటు అప్పులు కూడా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. 75 ఏండ్ల స్వాతంత్ర్య దేశంలో రాజ్యాంగ సవరణకు పాలకులు ఆకర్షితులవుతున్నా ప్రజలు దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, రాజ్యాంగాన్ని కాపాడుకొంటున్నారని తెలిపారు. ఏదేమైనా పేదల అవసరాలు తీర్చడమే ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎస్.వేణుగోపాల స్వామి స్వర్ణకుమారి, జాయింట్ ఇటకం జానకిబాయి కార్యవర్గ సభ్యులు కె.లక్ష్మణరావు, పి.కమలాకరరావు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశిన అఖండ విష్ణు సహస్రనామ పారాయణం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఈ ఏడాది జనవరి 10న సుమారు 3000 మందితో 12 పర్యాయాలు విష్ణు సహస్రనామ పారాయణం ఆనంద్ బాగ్ బృందావన్ గార్డెన్‌లో జరుగుతుంది. అదే రోజు శ్రీ వెంకటేశ్వర స్వామికి ఉదయాస్తమ సేవలు తిరుపతిలో జరిగిన విధంగా నిర్వహిస్తాం. విష్ణు సహస్రనామ పారాయణం మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు జరుగుతుంది. ఇది ఒక అద్భుతమైనటువంటి కార్యక్రమం గత ఏడాది కంచి కామకోటి పీఠాధిపతి కార్యక్రమానికి హాజరయ్యారు. రెండు రాష్ట్రాల్లో ఇప్పటివరకు ఒకే వేదికపై ఇలాంటి కార్యక్రమం జరగలేదు. గత రెండు పర్యాయాలు బృందావన్ గార్డెన్‌లో విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కుటుంబ సమేతంగా హాజరయై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

సంక్రాంతి సందర్భంగా బిగ్ 'సి' ఆకర్షణీయమైన ఆఫర్లు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోనే నెంబర్ వన్ మొబైల్ రిటైల్ విక్రయ సంస్థ బిగ్ 'సి'. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆకర్షణీయమైన ఆఫర్లను ప్రకటించింది. సంస్థ ఫౌండర్ మరియు సి.యం.డి. యం. బాలు చౌదరి ఈ ఆఫర్ల వివరాలను వెల్లడించారు. బిగ్ సిలో ఈ సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి మొబైల్ కొనుగోలుపై రూ.10,000 వరకు విలువగల మొబైల్ ప్రొటెక్షన్‌తో పాటు, రూ.5,999 విలువగల స్మార్ట్ వాచ్ లేదా రూ.1,799 విలువగల ఎయిర్ బడ్స్ ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఆవిష్కరించబడిన ఒప్పో రెనో 13 మొబైల్స్ తమ అన్ని బిగ్ షోరూమ్స్‌లలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ మొబైల్స్ కొనుగోలుపై రూ.7990 విలువగల స్విస్ మిలిటరీ స్పీకర్‌తో పాటు వన్ ఇయర్ మొబైల్ ప్రొటెక్షన్ మరియు రూ.5000 వరకు ఇన్స్టెంట్ కాష్ బ్యాక్ అందిస్తున్నామని తెలిపారు. ఈ ఆఫర్లతోపాటు మొబైల్స్ కొనుగోలుపై రూ.15,000 వేల వరకు తక్షణ క్యాష్ బ్యాక్, ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండానే మొబైల్ కొనుగోలు చేసే ఆకర్షణీయమైన సదుపాయాన్ని కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. ఐఫోన్ మొబైల్ కొనుగోలుపై రూ.5,000 వరకు ఇన్స్టాంట్ డిస్కౌంట్లు ఏ.టి.యం కార్డుపై ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండానే మొబైల్, స్మార్ట్ టీవీ, ల్యాప్టాప్, ఎయిర్ కండీషనర్‌లు కొనుగోలు చేసే ఆకర్షణీయమైన సదుపాయాన్ని కూడా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి పండుగను, ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ఆఫర్లు ప్రకటించడం బిగ్' అనావాయితీ అని, అలాగే ఈ సంక్రాంతి సందర్భంగా కూడా ఆకర్షణీయమైన ఆఫర్లను అందిస్తోందని ఆయన తెలిపారు. ప్రజానీకమంతా ఈ ఆఫర్లను వినియోగించుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు పాటుపడదాం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-బషీర్ బాగ్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్లా ఐలయ్య పేర్కొన్నారు. ముంబై పర్యటనలో భాగంగా రెండవ రోజు ముంబాయి దాదర్‌లో గల డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సమాధి చైత్య భూమిని నల్గొండ జిల్లా గొర్రె కాపరుల సహకార సంఘం మాజీ ఉపాధ్యక్షులు మల్లాపురం గ్రామ మాజీ సర్పంచ్ మంగ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్రె జహంగీర్, కురుమ సంఘం ముంబై ప్రతినిధులతో కలిసి సందర్శించడం జరిగింది. అంబేద్కర్ సమాధి వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ మార్గదర్శకంలో నడుస్తూ ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. నల్గొండ జిల్లా గొర్రె కాపరుల సహకార సంఘం ఉపాధ్యక్షులు మంగ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్రే జహంగీర్, కురుమ సంఘం ముంబై గౌరవ అధ్యక్షులు పుప్పాల సత్తయ్య, జట్ట కృష్ణ, కుండే చంద్రయ్య, జూకంటి రామ్ చందర్, అధ్యక్షుడు గవ్వల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఐల చంద్రమౌళి, సంయుక్త కార్యదర్శి మోటెసిద్దులు, కోశాధికారి కంచర్ల గణేష్, సలహాదారులు మలగ వెంకటేష్, గాదరి మల్లేష్, పుప్పాల చిన్న సత్తయ్య, నోముల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన రిజర్వాయర్లతో ప్రతి ఇంటికి మంచినీరు

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

విశాలాంధ్ర - పటాన్ చెరువు : ఈనెల 20వ తేదీలోపు బొల్లారం, అమీన్పూర్ మున్సిపల్ పరిధిలో నిర్మించిన నూతన రిజర్వాయర్ల ద్వారా మంచినీటి సరఫరా ప్రారంభించినట్లు పటాన్ చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జలమండలి అధికారులు, మున్సిపల్ చైర్మన్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్ చెరువు నియోజక వర్గంలోని ఓఆర్ఆర్ పరిధిలోగల మున్సిపాలిటీలలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతన రిజర్వాయర్లు నిర్మించడంతోపాటు పైప్ లైన్లు వేయడం జరుగుతుందని తెలిపారు. ప్రధానంగా బొల్లారం మున్సిపల్ పరిధిలో రెండు మిలియన్ లీటర్ల సామర్థం గల రెండు రిజర్వాయర్లు, పంప్ హౌస్ పనులు పూర్తయ్యాయని, త్వరలో మంచినీటి సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని పటేల్ గూడ, లాలాబావి కాలనీ, బంధం కొమ్ములలో మూడు రిజర్వాయర్లు పూర్తయ్యాయని.. 20వ తేదీలోపు మంచినీటి సరఫరా ప్రారంభిస్తామని తెలిపారు. బొల్లారం పారిశ్రామికవాడలో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెట్టడం జరిగిందని తెలిపారు. ఓ ఆర్ఆర్ అవతల బొల్లారం మున్సిపల్ పరిధిలోని నూతన గృహాలకు, అపార్ట్మెంట్లకు సైతం మంచినీరు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అమీన్పూర్, తెల్లాపూర్, బొల్లారం మున్సిపల్ పరిధిలో అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు మున్సిపాలిటీల నుండి ఐదు కోట్ల 40 లక్షల రూపాయలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో కొల్లూరు, ఉస్మాన్ నగర్‌లలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో ఇప్పటికే 15,000 మంది లబ్ధిదారులు నివసిస్తున్నారని, ఇందుకు అనుగుణంగా సమస్యలు లేకుండా మంచినీటిని అందించాలని అధికారులను ఆదేశించారు. నూతన రిజర్వాయర్ల ఏర్పాటుకు స్థలాలను ఎంపిక చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రాబోయే వేసవిలో మంచినీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. జలమండలి డైరెక్టర్ ఆఫ్ ప్రాజెక్ట్స్ శ్రీధర్, అమీన్పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, జలమండలి జనరల్ మేనేజర్ సుబ్బారాయుడు, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, డీజీఎంలు చంద్రశేఖర్, శివ, సోమిరెడ్డి, బాల్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, కౌన్సిలర్లు మహదేవరెడ్డి, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో నీటి సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : జలమండలి పరిధిలోని హిమాయత్ సాగర్ రిజర్వాయర్ ఫోర్ బే, మిరాలం ఫిల్టర్ బెడ్స్ సెట్లింగ్ ట్యాంకులు, ఇన్‌లెట్ ఛానల్లను శుభ్రం చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం కలగనుంది. 11న శనివారం ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు 12న ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఈ క్లీనింగ్ పనులు నిర్వహించనున్నారు. కావున 24 గంటల పాటు కింద పేర్కొన్న పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో పూర్తిగా, మరికొన్ని ప్రాంతాల్లో పాక్షికంగా అంతరాయం ఏర్పడనుంది. హసన్ నగర్, కిషన్ బాగ్, దూద్ బౌలి, మిస్రిగంజ్, పత్తర్ గట్టి, దారుల్ షిఫా, మొఘల్ పురా, జహానుమా, చందూలాల్ బరాదరి, ఫలక్ నుమా, జంగంమెట్ ప్రాంతాలలో సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని జలమండలి అధికారులు కోరారు.

రోడ్డు పనులు పరిశీలించిన మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్‌లో గుట్టపై రోడ్ పనులను మేయర్ అమర్ సింగ్ బుధవారం ఉదయం పరిశీలించారు. ఐదేండ్లుగా ఇక్కడ రోడ్డు సరిగ్గా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, డివిజన్ ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు అందించడానికి ఈ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు మేయర్ అమర్ సింగ్ తెలిపారు. నరసింహారెడ్డి కాలనీలో పర్యటించి, సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు వంగూరి పరమేష్, ఇతర నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఊరెళ్తున్నారా... జరభద్రం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : సంక్రాంతి పండుగ పిల్లలకు సెలవులుండటంతో చాలా మంది ప్రయాణాలు చేస్తారు. ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారు. ఊళ్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సైబరాబాద్ పోలీసులు తెలిపారు. సంక్రాంతి పండుగ దృష్ట్యా చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామని, ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. రాత్రి వేళల్లో వీధుల్లో గస్తీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ విషయంలో సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు పోలీసులు పలు సూచనలు చేశారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబర్‌ను సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు తెలపాలి. దీంతో వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకుని ఊరెళ్లిన వారి ఇళ్లపై నిఘాను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డికి శుభాకాంక్షలు

విశాలాంధ్ర - కుత్బుల్లాపూర్: నియోజకవర్గం పరిధి 130 సుభాష్‌నగర్ డివిజన్ సీఓ బాలరాజు, డివిజన్‌కు చెందిన ఆర్పీలు కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించి, పూల మొక్కలను అందజేసి 2025 నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి మాట్లాడుతూ 2025 ప్రజల ఆనందాల సంవత్సరం కావాలని, ప్రతి ఇంటా నూతన సంవత్సరంలో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని, సంపద, సమృద్ధి కలగాలని ఆయన ఆకాంక్షించారు.

అత్యంత సమగ్రమైన లైఫ్‌స్టైల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ బ్రిగేడ్ గేట్ వే

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : బ్రిగేడ్ రెసిడెన్సెస్ హైదరాబాద్‌లోని అత్యంత ఎత్తైన భవనాలలో ఒకటిగా ఉండబోతుంది, ఇది భారీ స్పందనను పొందుతోంది. వరల్డ్ ట్రేడ్ సెంటర్, ఇంటర్ కాంటినెంటల్ హోటల్, బ్రిగేడ్ ఓరియన్ మాల్ హైదరాబాద్‌లో తమ ఆవిష్కరణను చేస్తున్నాయి. బ్రిగేడ్ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్ హైదరాబాద్‌లోని కోకాపేట్‌లో బ్రిగేడ్ గేట్‌వే, నియోపోలిస్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. 10 ఎకరాల్లో విస్తరించిన ఈ మిక్స్‌డ్-యూస్ డెవలప్‌మెంట్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్, బ్రిగేడ్ రెసిడెన్సెస్, 300 కీస్ ఇంటర్ కాంటినెంటల్ హోటల్, ఒరియన్ లైఫ్‌స్టైల్ మాల్ ఉన్నాయన్నారు. ఇది 58 అంతస్థులతో సుమారు 600 ప్రీమియం రెసిడెన్సులను కలిగి ఉంటుందన్నారు. రూ.3,300 కోట్ల విక్రయ సామర్థ్యం ఉందన్నారు. ఆధునిక సౌకర్యాలు, సౌరశక్తి ఉత్పత్తి, తుఫాను నీటి సంరక్షణ, నీటి పునర్వినియోగానికి ఆన్సైట్ శుద్ధి ప్లాంట్‌తో గ్రీన్ సర్టిఫికేట్ డెవలప్‌మెంట్ ఒరియన్ మాల్ (మొదటి 7 అంతస్తులు), వరల్డ్ ట్రేడ్ సెంటర్ (22 అంతస్తులు), ఇంటర్‌కాంటి నెంటల్ హోటల్ (12 అంతస్తులు) సర్వీస్ రెసిడెన్సుల కోసం 2 అంతస్తులతో ఈ భవనం ఆకర్షణీయంగా ఉంటుందన్నారు.. బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమర్ మైసూర్ మాట్లాడుతూ బ్రిగేడ్ గేట్‌వే ప్రాజెక్ట్‌ను బెంగళూరులో విజయవంతమైన మోడల్ ఆధారంగా రూపకల్పన చేశాము. ఇది మానవ అభివృద్ధి స్థిరత్వానికి మా నిబద్ధతకు నిదర్శనం.ఈ ప్రాజెక్ట్‌లో 10,000 మంది ఉద్యోగులు 3,000 మంది నివాసితుల కదలికతో, బ్రిగేడ్ గేట్‌వే హైదరాబాద్ నగరంలో ఒక చిహ్నంగా నిలుస్తుంది.

పేదలకు తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యనందించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పటాన్ చెరువు : సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పాటి గ్రామ పరిధిలో గల ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాల వరకు పేద, మధ్య తరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యను అందించడంలో ప్రైవేటు పాఠశాలలు కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. భావి భారత పౌరులను తయారు చేయడంలో ప్రతి ఉపాధ్యాయుడి పాత్ర అత్యంత కీలకమైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. మధుసూదన్, ప్రధాన కార్యదర్శి ఎన్. రమేష్ రావు, కోశాధికారి పి.రాఘవేంద్ర రెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐనవోలు బ్రహ్మోత్సవాలకు సీఎంకు మంత్రి కొండా సురేఖ ఆహ్వానం

విశాలాంధ్ర - హైదరాబాద్ : జనవరి 13 నుంచి జరిగే ఐనవోలు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, దేవాదాయశాఖ తరఫున ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో, సిబ్బంది స్వామి వారి తీర్థప్రసాదాలను అందించి, శేష వస్త్రాలతో సత్కరించగా, ఆలయ అర్చకులు సీఎం రేవంత్ రెడ్డికి వేదాశీర్వచనం అందించారు. జానపదుల జాతరగా ఖ్యాతికెక్కిన ఐనవోలు మల్లన్న బ్రహ్మోత్సవాల వైభవాన్ని, దేవాలయ చారిత్రక నేపథ్యాన్ని, ఆలయ ప్రాశస్త్యాన్ని ఆలయ సిబ్బంది, అర్చకులు సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. అంతకుముందు వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు, టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు, ఆలయ ఈవో అద్దంకి నాగేశ్వర్ రావు, అర్చకులు హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్‌లో మంత్రి కొండా సురేఖని వారి నివాసంలో కలిసి మల్లన్న బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. ఆలయ సిబ్బంది మంత్రికి మల్లికార్జున స్వామి వారి తీర్థప్రసాదాలను అందించి, శాలువాతో సత్కరించారు. అర్చకులు వేదాశీర్వచనం అందించారు. అనంతరం జాతర ఏర్పాట్ల పై ఆలయ ఈవో మంత్రి సురేఖకి వివరించారు. జనవరి 13 నుంచి ఉగాది పర్వదినం వరకు వైభవోపేతంగా నిర్వహించే మల్లికార్జున స్వామి వారి బ్రహ్మోత్సవాలకు దేవాదాయ, పోలీస్, విద్యుత్, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, అగ్నిమాపక, ఆర్టీసి తదితర శాఖలు చేపడుతున్న పనుల వివరాలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ అన్ని శాఖలు పరస్పరం సమన్వయంతో పనిచేస్తూ జాతరను విజయవంతం చేయాలని సూచించారు. భక్తులకు సౌకర్యాల కల్పనలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ఈవోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో కిరణ్ కుమార్, ప్రధానార్చకులు రవీందర్ శర్మ, అర్చకులు నరేష్ శర్మ, భాను ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల మల్లేష్ ఆదర్శ్ మహిళా ఛారిటబుల్ ట్రస్ట్ వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: నియోజకవర్గం పరిధిలోని నల్లమల్లేష్ ఆదర్శ్ మహిళా చారిటబుల్ ట్రస్ట్ మహిళాలు బుధవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, నిర్వహించనున్న ట్రస్ట్ 10వ వార్షికోత్సవ కార్యక్రమం పోస్టర్‌ను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఫౌండర్ చైర్ పర్సన్ నల్లమల్లి సామ్రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రానున్న మార్చి 8వ తేదీన ట్రస్ట్ పదవ వార్షికోత్సవం సందర్భంగా మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, వివిధ రంగాలకు చెందిన మహిళలకు ఉత్తమ మహిళా పురస్కారం అందజేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు శ్రీదేవి, పద్మ, మీరాబాయి, శశికళ, సరిత, విజయశ్రీ, అనిత, పుష్పవల్లి, దీప్తి, రాధిక, అనంతలక్ష్మి పాల్గొన్నారు.

మార్కెట్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా : ఏఎంసీ చైర్మన్

విశాలాంధ్ర - ఆమనగల్లు : ఆమనగల్లు మార్కెట్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి పరిచి ఆదర్శంగా నిలుపుతామని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్మన్ గీతా నర్సింహ్మా అన్నారు. మార్కెట్ ఆదాయాన్ని పెంచి రైతుల శ్రేయస్సుకు పాటుపడేలా మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడుచుకోవాలని ఆమె కోరారు. ఆమనగల్లు మార్కెట్ కార్యాలయంలో బుధవారం మార్కెట్ చైర్‌పర్సన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గీత నర్సింహ్మాకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. గీతను పూలమాలలు, శాలువాలతో అసోసియేషన్ నాయకులు సత్కరించి అభినందించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. సంక్రాంతి పండుగ అనంతరం ప్రభుత్వం ప్రకటించిన విధంగా అర్హులైన రైతులందరికీ రైతు భరోసా పథకం కింద రూ.12 వేలు పెట్టుబడి సాయం అందిస్తుందని చెప్పారు. మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. ఈ ఏడాది ధాన్యం దిగుబడి బాగా వచ్చినందున మార్కెట్ ఆదాయం పెరిగేలా చూడాలన్నారు. మార్కెట్ అభివృద్ధికి ట్రేడర్లు, మిల్లర్లు సహకరించాలని కోరారు. మార్కెట్ లో రైతులకు మెరుగైన వసతులు కల్పించి ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు. రైతులు పంట ఉత్పత్తులు మార్కెట్ యార్డులో విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని కోరారు. రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మిట్టపల్లి అంజయ్య, నాయకులు కండే పాండురంగయ్య, దోనోదుల సత్యం, అనిల్ రామకృష్ణ, కండే సుమన్, కృష్ణయ్య, కరుణాకర్, రాము, విష్ణువర్ధన్, శ్రీనివాస్, భాస్కర్, సత్యం, యాదయ్య, వెంకటయ్య, ప్రకాష్, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సదాశివ పాఠశాల ప్రిన్సిపాల్‌ను అరెస్ట్ చేయాలి

విశాలాంధ్ర - కాప్రా : కాప్రా మండలంలోని ఈసీఐఎల్, ఏఎస్ రావు నగర్‌లోని సదాశివ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థినుల పట్ల సదరు పాఠశాల ప్రిన్సిపాల్ బొర్రా నాగేంద్రరావు అసభ్యకరంగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ విద్యార్థి, యువజన, మహిళా సంఘాల ఆధ్వర్యంలో పాఠశాల ముందు ధర్నా నిర్వహించి, చట్ట ప్రకారం నాగేంద్ర ను సత్వరమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివానంద్, బీజే వై ఎం జిల్లా కార్యదర్శి అరుణ్ కుమార్,యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి లింగం, ఎన్ ఎస్ యూఐ ఉప్పల్ అసెంబ్లీ అధ్యక్షుడు కిషోర్‌లి లు మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు ఆ గురుతర బాధ్యతను మర్చి నీచంగా సభ్య సమాజం తలదించుకునేలా ప్రవర్తించడం సిగ్గు చేటు అన్నారు. దేశంలో ఇన్ని చట్టాలు రోజురోజుకూ కఠిన తరం అవుతున్నా ఇలాంటి ఘటనలు పునరావృతం అవ్వడం బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు, పోలీసు యంత్రాంగం దృష్టి సారించి ఈ కేసును నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి ఆరోపణలు ఎదుర్కొంటున్న నాగేంద్రపై పూర్తి స్థాయి సాక్ష్యాలు సేకరించి న్యాయస్థానంలో బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నేతలు స్వప్న, బిందు, తరుణ్, రవి, కిరణ్లతో పాటు తదితరులు పాల్గొన్నారు. సదాశివ పాఠశాల అంశంపై కాప్రా మండల విద్యాశాఖ అధికారి బాపు రెడ్డి కి నేతల బృందం వినతిపత్రం అందజేశారు. సదరు పాఠశాలపై పూర్తి స్థాయి విచారణ జరపాలని, కాప్రా మండల వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో స్పెషల్ క్లాసుల పేరిట 10వ విద్యార్థుల పట్ల కనబరుస్తున్న వైఖరిపై ఆయా పాఠశాలల యాజమాన్యం కు ఆదేశాలు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. ఎక్కువ గంటల చదువు ఒత్తిడి తేవద్దని వారు కోరారు.

ప్రతిఫలం ఆశించని పాత్రికేయ దిగ్గజం 'మానికొండ'

పుస్తకావిష్కరణలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర–విజయవాడ రూరల్: ప్రతిఫలాన్ని ఆశించని పాత్రికేయ దిగ్గజం మానికొండ చలపతిరావు అని, రాజధాని అమరావతిలో ఆయన స్మృతి చిహ్నాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 35వ పుస్తక మహోత్సవం ఏడవ రోజు బుధవారం రామోజీరావు సాహిత్య వేదికపై ఆకుల అమరయ్య రచించిన "భారతీయ జర్నలిజం ధ్రువతార మానికొండ చలపతిరావు" పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. రామకృష్ణ మాట్లాడుతూ నేటి తరానికి మానికొండ వంటి శిఖరాయమాన పాత్రికేయుడిని పరిచయం చేయడానికి ఈ రచన ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన శరత్ చంద్ర జ్యోతిశ్రీ మాట్లాడుతూ నేటియుగంలో జర్నలిజం విలువలు దిగజారుతున్నాయనీ, అదే సమయంలో విలువలు కలిగిన జర్నలిస్టులపై దాడులు పెరిగాయన్నారు. ఈ పుస్తకం ద్వారా పాలకవర్గాలపై కాకుండా, సమాజంపై అమిత ప్రేమ ఉన్న జర్నలిస్టును నేటి తరానికి పరిచయం చేయడం ముదావహమన్నారు. అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, విశాలాంధ్ర డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు, ప్రజాశక్తి మాజీ ఎడిటర్ ఎస్.వెంకట్రావు, రచయిత అమరయ్య, పాత్రికేయులు సీహెచ్ సతీష్ రావు, ఆనందం, సాగర్ కుమార్, రాఘవ పసంగించారు.

వ్యవసాయంపై రాజకీయ ప్రభావం: బీవీ రాఘవులు

నేడు వ్యవసాయంపై రాజకీయ ప్రభావం చూపుతుందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. సాహిత్యవేదికపై వి. రాంభూపాల్ రచించచగా ప్రజాశక్తి బుక్ హౌస్ ప్రచురించిన 'రైతును ముంచుతున్న పాలకుల విధానాలు', 'అసమానతలు – ఆర్థిక విధానాలు', 'విద్వేష రాజకీయాలు' పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం రాఘవులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వెనుక కూడా వర్గపోరాట ధోరణిని ప్రతిబింబిస్తున్నారన్నారు. దేశంలో ఐక్యతనూ, సమానత్వాన్నీ విద్వేషాలు చెడగొడతాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రజాశక్తి బుక్‌హౌస్ సంపాదకులు ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ నాగరికత పేరుతో సమాజంలో ప్రకృతి సహజమైన మౌలిక విలువలకు దూరం కావడం దురదృష్టకరమన్నారు. రచయిత వి. రాంభూపాల్ మాట్లాడుతూ వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు పెరగడం, వ్యవసాయ రుణాలు అందకపోవడం, గిట్టుబాటు ధరలు లేకపోవడం వల్ల రైతులకు సాగు భారమైపోతుందన్నారు. ప్రజాశక్తి బుక్ హౌస్ మేనేజర్ లక్ష్మయ్య మాట్లాడుతూ సామాజిక ఆర్థిక సమస్యలపై నిరంతరం కొత్త కొత్త రచనలను పాఠకులకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ప్రజల్లో జీవించి, ప్రజల కష్టాలు ప్రతిఫలించేలా ప్రజల కోసం రచనలు చేసిన గొప్ప రచయిత నటరాజన్ అని అరసం అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. 'శారద' కలంపేరుతో గుర్తింపు పొందిన కథారచయిత 'సుబ్రహ్మణ్యన్ నటరాజన్' శతజయంతి సభను నిర్వహించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తనదైన శైలి, వ్యక్తీకరణతో సామాజిక స్పృహను కనబరుస్తూ పాఠకుల హృదయాల్లో నిలిచిపోయిన రచయిత నటరాజన్ అని చెప్పారు. ప్రముఖ రచయితగా గుర్తింపు పొందినప్పటికీ దుర్భర దారిద్ర్యాన్ని గడపవలసి వచ్చిందన్నారు. తమిళుడయినా, తెలుగు ప్రాంతంలో హోటల్ సర్వర్‌గా జీవితాన్ని ప్రారంభించి, తనకున్న పఠనాసక్తితో అనతికాలంలో గుర్తింపు పొందిన రచయితగా మారాడన్నారు. శరత్‌చంద్ర జ్యోతిశ్రీ సభకు అధ్యక్షత వహించారు. బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి మనోహర్ నాయుడు, గోళ్ల నారాయణరావు ప్రసంగించారు.

'మానికొండ' పేరిట అవార్డు ఇవ్వాలి

సీఎం చంద్రబాబుకు సీపీఐ నేత రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ప్రముఖ జర్నలిస్టు, రచయిత అమరజీవి మానికొండ చలపతిరావు స్మారకార్థం అవార్డు లేదా అమరావతి రాజధాని ప్రాంతంలో స్మృతివనం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు బుధవారం ఆయన లేఖ రాశారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో 'భారతీయ జర్నలిజం ధ్రువతార మానికొండ చలపతిరావు' పుస్తకావిష్కరణ చేపట్టారని తెలిపారు. ఈ సందర్భంగా మానికొండ చలపతిరావు స్మారకార్థం ఆయన పేరున అవార్డు లేదా స్మారక నిర్మాణం ఏర్పాటుచేస్తే గౌరవంగా ఉంటుందని రామకృష్ణ అభిప్రాయపడ్డారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన మానికొండ చలపతిరావు జర్నలిస్టుగా, రచయితగా భారత ప్రధానులుగా జవహర్‌లాల్ నెహ్రూ, లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ ఉన్న కాలంలో పనిచేశారని గుర్తుచేశారు. తొలినాళ్లలో హిందుస్థాన్ టైమ్స్‌కు అసిస్టెంట్ ఎడిటర్‌గా పనిచేసిన చలపతిరావు, 1938లో లక్నోలో జవహర్‌లాల్ నెహ్రూ ఏర్పాటుచేసిన ఆంగ్ల దినపత్రిక నేషనల్ హెరాల్డ్‌కు 1946 నుంచి 1978 వరకు మూడు దశాబ్దాలపాటు సంపాదకునిగా సేవలందించారని, నిష్పాక్షికంగా వ్యవహరించి పాత్రికేయ విలువలకు పట్టం కట్టారని వివరించారు. భారతీయ జర్నలిజం, రాజకీయాలు, వ్యక్తిత్వాలపై అనేక పుస్తకాలను రచించారన్నారు. 1968లో భారతదేశపు అత్యున్నత పౌర పురస్కారం అయిన పద్మ భూషణ్ ఆయనకు లభించిందని, ఆయన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) ఏర్పాటులో కీలక పాత్ర పోషించడమేగాక, మొదటి అధ్యక్షుడిగా పనిచేశారని వివరించారు. 1950లో ఇంటర్నేషనల్ ప్రెస్ ఇన్స్టిట్యూట్ యొక్క ఇనిషియేటింగ్ కమిటీ సభ్యునిగా, 1952లో చైనాకు భారత ప్రభుత్వం చేసిన సద్భావన మిషన్‌లో సభ్యునిగా, 1955లో యుఎస్ఎస్ఆర్, పోలాండ్, యుగోస్లేవియాలలో నెహ్రూ పర్యటనలో భారత పాత్రికేయ ప్రతినిధి బృందానికి నాయకునిగా, ప్రెస్ ఎక్స్‌పర్ట్స్ కమిషన్‌లో సభ్యుడిగా పనిచేశారని తెలిపారు. పాత్రికేయరంగానికి ఆయన సేవలు ఎనలేనివి అని, స్వాతంత్ర్య పోరాట కాలం నుంచి సుదీర్ఘకాలం పత్రికారంగంలో పనిచేసిన మానికొండ చలపతిరావు మన తెలుగువారవ్వడం గర్వకారణం అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రముఖ జర్నలిస్టు, రచయిత మానికొండ చలపతిరావు స్మారకార్థం పాత్రికేయులకు అవార్డుగానీ, నూతన రాజధాని అమరావతి ప్రాంతంలో మానికొండ చలపతిరావు పేరుతో స్మృతివనం వంటి స్మారక నిర్మాణంగానీ ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో రామకృష్ణ కోరారు.

తెలుగు భాష వికాసం

ఉద్యమంలా సాగాలి

- వక్తల ఉద్ఘాటన
- జీజీయూలో ఘనంగా ప్రపంచ తెలుగు మహాసభలు

విశాలాంధ్ర–రాజానగరం: తెలుగురాని వాడు తెలుగువాడే కాదనీ మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం లోని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ) ప్రాంగణంలో రెండు రోజులు పాటు జరగనున్న 2వ ప్రపంచ తెలుగు మహాసభలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. చైతన్య విద్యా సంస్థల అధినేత, జీజీయూ ఛాన్సలర్ కలిదిండి వి.వి.సత్యనారాయణ రాజు(చైతన్య రాజు)అధ్యక్షత వహించిన తెలుగు మహా సభ వేడుకలకు ముఖ్య అతిధిగా హాజరైన వెంకయ్య నాయుడు... విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సభలను ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ... తెలుగువారంతా ఆంగ్ల భాష వ్యామోహం తగ్గించుకుని అమ్మ భాషను కాపాడుకోవాలన్నారు. అమ్మ భాష పోతే శ్వాస ఆగినట్లేనని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో తెలుగు మాట్లాడే వారికే ఓటు వేయాలని, తెలుగులోనే ఉత్తర్వులు ఉండాలని, తెలుగులోనే పాలనా వ్యవహారాలుండాలన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో చైతన్య రాజు సారధ్యంలో ప్రపంచ తెలుగుమహాసభలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. తెలుగు భాష వికాసం ఉద్యమంలా సాగాలని పిలుపునిచ్చారు. విశిష్ట అతిధిగా హాజరైన డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ... నన్నయ మహాభారతాన్ని ఆంధ్రీకరించడంతో ఈ ప్రాంతంలో తెలుగులో సాహిత్య విప్లవం మొదలైం దన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తన పదవీ కాలంలో 25శాతం యువత, విద్యార్థుల మమేకంతోనే గడిపారని, ఎక్కడికెళ్లినా తెలుగు భాష కోసం తపిస్తున్నారని గుర్తుచేశారు. కాగా హిందీ అష్టావధానం చేసిన ఈ నగరానికి చెందిన చేబోలు శేషగిరిరావు కాంస్య విగ్రహాన్ని గతంలో తయారుచేయించానని, దాన్ని ప్రతిష్ఠింపజేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన చైతన్యరాజుకు విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు, యువత మధ్య తెలుగు మహాసభలు జరపడం అభినందనీయమన్నారు. మరో అతిథిగా హాజరైన మహా సహస్రావధాని పద్మశ్రీ డాక్టర్ గరికిపాటి నరసింహారావు మాట్లాడుతూ తెలుగు భాష కోసం ఉద్యమించాలని చెప్పారు. ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు విధిగా తెలుగు మాధ్యమమే ఉండాలని, అలాగే డిగ్రీ వరకు తెలుగు పాఠ్యాంశం ఉండాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఫోన్ చేసి, రాష్ట్ర అధికార భాషా సంఘ అధ్యక్షా బాధ్యతలు స్వీకరించాలని కోరినపుడు ఇదే విషయం చెప్పానన్నారు. ఈ రెండు పనులు జరగనప్పుడు భాషా సంఘం ఉన్నా ప్రయోజనం లేదని, అలాగే ఈ రెండు అమలయితే భాషా సంఘంతో పనిలేదని ఆయన శైలిలో చెప్పారు. సినీ హాస్య నటులు భద్రం మాట్లాడుతూ తెలుగు ఐసియులో ఉన్నదని, దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తెలుగు భాష మాట్లాడేవాడే వేదపండితుడనీ ప్రముఖ కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు అన్నారు. నిత్యం ఎక్కడో అక్కడ ఇలాంటి సభలు జరగాలన్నారు. భాష కోసం ఉద్యమించే పరిస్థితి రాకుండా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పాఠ్యాంశాల్లో దోషాలు సరిచేయాలని ఎన్నోసార్లు చెప్పానని, తెలుగు భాష సంస్కృతి వికాసం కోసం ఎన్నో శతకాలు రాశానని ఆయన గుర్తుచేశారు. తొలుత అతిధులను జీజీయూ ఛాన్సలర్ కలిదిండి వి.వి.సత్యనారాయణ రాజు, ప్రో ఛాన్సలర్ కె.శశి కిరణ్ వర్మ, కిమ్స్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కె.రవి కిరణ్ వర్మను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జీజీయూ ఉపకులపతి ఉదయగిరి చంద్రశేఖర్, ఆధ్యాత్మికవేత్త శ్రీ భారతీ తీర్థ పురస్కార గ్రహీత వి బంగారయ్య శర్మ, ప్రొఫెసర్ చామర్తి, కె టి రామరాజు, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా సోలొమన్ డార్విన్, మాజీ ఎమ్మెల్సీ గోనె ప్రకాశరావు, శతావధాని కడిమెళ్ళ వరప్రసాద్, ధూళిపాళ మహాదేవ మణి, కవులు, సాహితీవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టు వ్యతిరేక విధానాలపై పోరు

ఐజేయూ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి పిలుపు

విశాలాంధ్ర–విజయవాడ (గాంధీనగర్): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న జర్నలిస్టు వ్యతిరేక విధానాలపై పోరాడాలని ఐజేయూ అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి పిలుపు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అధ్యక్షుడిగా ఐవీ సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లోని అంబటి ఆంజనేయులు వేదికపై బుధవారం జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టు చట్టాన్ని రద్దు చేయడంతో జర్నలిస్టులకున్న కొద్దిపాటి వేతన భద్రత కూడా లేకుండా పోయిందని, పదిహేనేళ్లుగా కొత్త వేతన బోర్డు నియమించకపోవడంతో పాత వేతనాలే అమల్లో ఉన్నాయని ఆయన అన్నారు. సెంట్రల్ ప్రెస్ అక్రెడిటేషన్ కమిటీని రద్దు చేశారని, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్వయం ప్రతిపత్తిని నీరుకార్చారని శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లో జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి ప్రభుత్వం కేటాయించిన భూమి విషయంలో సుప్రీంకోర్టు వ్యతిరేక తీర్పు చెప్పడం విచారకరమని, న్యాయవ్యవస్థలోనూ జర్నలిస్టులపై ప్రతికూల భావనలు వ్యక్తంకావడం బాధాకరమన్నారు. జర్నలిస్టుల భద్రతకు ప్రజలు రక్షణ కల్పించాలి తప్ప... ప్రభుత్వాల నుండి ఆశించవద్దని శ్రీనివాస్‌రెడ్డి హితవు చెప్పారు. వర్కింగ్ జర్నలిస్టుల హక్కులు కాపాడుకోవడానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పదివేలమంది సభ్యులున్న ఏపీయూడబ్ల్యూజే ఎన్నికలు ప్రజాస్వామ్య స్ఫూర్తితో జరగడం హర్షణీయమన్నారు. ఐవీ సుబ్బారావును రెండోసారి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై శుభాభినందనలు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలలో రెండు ప్రెస్ అకాడమీలు ఏర్పడటానికి గతంలో యూనియన్ చేసిన కృషే కారణమన్నారు. యాజమాన్యాల ధోరణుల వల్ల మీడియా విశ్వసనీయత దెబ్బ తిన్నదని చెప్పారు. సోషల్ మీడియా లేకపోతే ప్రజలకు అర్ధ సత్యాలు, అవాస్తవాలు మాత్రమే చేరి ఉండేవన్నారు. రానున్న రోజుల్లో సోషల్ మీడియా మరింత బలోపేతమవుతుందని, అయితే అందులో తప్పు చేసేవారి పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం విషయంలో కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం మాదిరిగా వ్యవహరించదని భావిస్తున్నామన్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ తాను రెండోసారి ఎన్నికయ్యేందుకు మద్దతు తెలిపిన జర్నలిస్టులకు, ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. యూనియన్ కృషితో జర్నలిస్టులకు హెల్త్ కార్డులు సాధించుకున్నామన్నారు. జర్నలిస్టుల సమస్యలపై యూనియన్ పోరాటం కొనసాగుతుందన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధానకార్యదర్శి చందు జనార్ధన్ మాట్లాడుతూ యూనియన్ సాధించిన విజయాలను వివరించారు. ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ మాట్లాడుతూ సమష్టి కృషి వల్లే 67 ఏళ్లుగా యూనియన్ కొనసాగుతోందన్నారు. ఐజేయూ కార్యవర్గ సభ్యులు ఆలపాటి సురేశ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన ఐవీ సుబ్బారావు అలంకారప్రాయంగా పనిచేసే వ్యక్తి కాదని చెప్పారు. యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చావా రవి మాట్లాడుతూ 2019 వరకు జర్నలిస్టులకు అనేక సంక్షేమ పథకాలు అందాయని, వైసీపీ హయాంలో అన్నీ నిలుపుదల చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐజేయూ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు, జాతీయ కౌన్సిల్ సభ్యులు కూన అజయ్ బాబు, కౌన్సిల్ సభ్యులు షేక్ బాబు, దారం వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.జయరాజు, రాష్ట్ర నాయకులు ఎ.జయప్రకాష్, కె.మాణిక్యరావు, రామసుబ్బారెడ్డి, సామ్నా ప్రధానకార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి డి.నాగరాజు, ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయభాస్కర్, పాల్గొన్నారు. 26 జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు, జిల్లా శాఖల నాయకులు తరలివచ్చారు.

హామీల అమలులో కూటమి సర్కార్ విఫలం

10న రాష్ట్రవ్యాప్త ఆందోళనలు: ఈశ్వరయ్య

విశాలాంధ్ర–విజయనగరం: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. విజయనగరంలోని డీఎస్ఆర్ అమర్ భవన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి మేనిఫెస్టో ప్రకారం పేదలకు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. కూటమి సర్కారు అధికారం చేపట్టి ఏడు మాసాలవతున్నా ఈ హామీ అమలు చేయలేదని విమర్శించారు. అందుకే ఈనెల 10న సీపీఐ అధ్వర్యంలో మండల, జిల్లా స్థాయిలలో ఆందోళనా కార్యక్రమాలు చేపడుతున్నామని, ఈ కార్యక్రమాన్ని అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేలు ఇస్తామన్న హామీని అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 107 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, దీనికి ప్రభుత్వం ఏమి సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. మరణించిన రైతు కుటుంబాలకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదానీకి నాడు జగన్, నేడు చంద్రబాబు ప్రభుత్వాలు తొత్తులుగా మారాయని ఆరోపించారు. ఏడు నెలల కాలంలో చంద్రబాబు ప్రభుత్వం ప్రజలపై వేలకోట్ల విద్యుత్ భారం మోపిందన్నారు. రూ.2 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన కోసం విశాఖ వచ్చిన ప్రధాని మోదీకి స్టీల్ ప్లాంటును కాపాడాలనే ఆలోచన ఎందుకు రాలేదని నిలదీశారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తుందో చెప్పాలన్నారు. ఎన్నికలకు ముందు వలంటీర్లను కొనసాగిస్తామని, రూ.10 వేలకు వేతనం పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చారని, ఆ హామీని తుంగలో తొక్కారని ఈశ్వరయ్య మండిపడ్డారు. సీపీఐ విజయనగరం జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సహాయ కార్యదర్శులు బుగత అశోక్, అలమండ ఆనందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, రమణమ్మ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

రూ.2,629 కోట్లతో హంద్రీనీవా పనులు పునఃప్రారంభం: నిమ్మల

విశాలాంధ్ర బ్యూరో – అమరావతి: హంద్రీనీవా ప్రాజెక్టు పనులను గాలికొదిలేసి రాయలసీమ రైతాంగానికి జగన్ తీవ్ర అన్యాయం చేశారని మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. విజయవాడ నీటి పారుదల శాఖ క్యాంపు కార్యాలయంలో బుధవారం హంద్రీనీవా, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా కలిపే లింక్ ఛానెల్ పనులపై ఇరిగేషన్ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిమ్మల మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.2,629 కోట్లతో రాయలసీమ వరప్రధాయని హంద్రీనీవా పనులు పునఃప్రారంభించారని తెలిపారు. వచ్చే సీజన్ నాటికి పనులుపూర్తి చేసి రాయలసీమ ప్రాంతంలోని చివరి ఎకరం వరకు సాగు నీరందించేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. పనుల ప్రగతిపై సమగ్ర నివేదిక తయారు చేసి త్వరలోనే చంద్రబాబుకు నివేదిక అందజేస్తామని అన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం: జగన్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: పార్టీ జెండా మోసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, కార్యకర్తలకు అన్యాయంగా ఇబ్బందులకు గురిచేసిన వారిని ఉపేక్షించబోమని.. వారిని చట్టం ముందు నిలబెడతామని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో జగన్ సమావేశమయ్యారు. రాజకీయాల్లో వ్యక్తిత్వం, విలువలు ముఖ్యమని... అందుకే ఎన్నికల్లో వైసీపీ అబద్ధపు హామీలు ఇవ్వలేదన్నారు. అరు నెలలకే కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను, మేనిఫెస్టోలో హామీలను పూర్తిగా గాలికొదిలేశారని, గతంలో మనం ఇచ్చిన పథకాలను రద్దు చేశారని చెప్పారు. చంద్రబాబు హామీలను అమలు చేయాలంటే రూ.1.72 లక్షల కోట్లు ఇవ్వాలని, ఆయన చెప్పినవన్నీ మోసాలు, అబద్ధాలు అని ముందే చెప్పామని జగన్ అన్నారు. 8 నెలల కూటమి పాలనలో రూ.15వేల కోట్ల కరెంటు చార్జీలు పెంచారని, గ్రామీణ రోడ్లలోనూ టోల్ బాదుడుకు శ్రీకారం చుట్టారని చెప్పారు. పార్టీని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే ప్రతి గ్రామంలోనూ పార్టీ నిర్మాణం ఉందని, దీన్ని వ్యవస్థీకృతంగా తీర్చిదిద్దాలని చెప్పారు.

కేఆర్‌బీఎం విజయవాడలో ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్‌బీఎం) ప్రధాన కార్యాలయాన్ని విజయవాడలో ఏర్పాటు చేయాలని సాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లా నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ సర్వసభ్య సమావేశం విజయవాడ జలవనరుల శాఖ ఆవరణలోని రైతు శిక్షణా కేంద్రంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు అధ్యక్షతన బుధవారం జరిగింది. ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ నాగార్జునసాగర్ ఎడమ కాలువ మూడవ జోన్‌కు కృష్ణానదీ యాజమాన్య బోర్డు డిసెంబరు, జనవరి మాసాలకు 12 టీఎంసీల నీటి విడుదల ఉత్తర్వులు ఇస్తే, తెలంగాణ ప్రభుత్వం నెల రోజులుగా తాత్సారం చేసి మంగళవారం అరకొరగా 600 క్యూసెక్కుల విడుదల చేసిందని తెలిపారు. దీనిని 1,700 క్యూసెక్కులకు పెంచి, ఆంధ్రా సరిహద్దుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆంధ్ర ప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం గత రాష్ట్ర ప్రభుత్వం 2014–2019 కేంద్ర జలశక్తి శాఖ గత నిర్ణయం మేరకు కృష్ణానదీ యాజమాన్య బోర్డు ప్రధాన కార్యాలయాన్ని విజయవాడలో ఏర్పాటు చేయాలని, నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలో అన్ని కాలువలకు సమగ్ర పర్యవేక్షణ కోసం అవుట్ సోర్సింగ్ విధానంలో లస్కర్‌లను నియమించాలని, ప్రాజెక్టు కమిటీ పరిధిలోని అన్ని డివిజన్, సబ్ డివిజన్ క్రింద ఉన్న ఎన్ఎస్‌పీ ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రాజెక్టు కమిటీ కాంపెటెంట్ అథారిటీ, విస్సన్నపేట పులిచింతల సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీరు ఎస్.శ్రీరామకృష్ణ మాట్లాడుతూ జలవనరుల శాఖ అధికారులు, నీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌లు సమన్వయంతో పని చేసి తెలంగాణా నుంచి వచ్చే సాగర్ నీటిని వృధా కాకుండా ఆయకట్టు చివరి ప్రాంతానికి తీసుకువెళ్లాలని సూచించారు. కోట వీరబాబు మాట్లాడుతూ నీటి సంఘాల ప్రతినిధులు రైతుల సౌకర్యార్థం నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ కార్యాలయాన్ని విజయ వాడలో ఏర్పాటు చేయటానికి జలవనరుల శాఖ ఆవరణలో భవనం కేటాయించాలని, ప్రాజెక్టు కమిటీ పరిధిలో డివిజన్, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఖాళీగా వున్న స్థలాల్లో రైతు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకోవాలని, ప్రాజెక్టు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, జిల్లాపరిషత్ సమావేశంలో, డీఆర్‌సీ సమావేశంలో ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొనటానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో ఎన్ఎస్‌పీ నూజివీడు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కె.గోపినాథ్, జగ్గయ్యపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.సంతోష్, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల నుంచి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌లు, డీఇఇ, ఏఇఇలు పాల్గొన్నారు.

జాతీయ వాలీబాల్ టోర్నీలో కేరళ చేతిలో ఏపీ ఓటమి

సెమీ ఫైనల్స్‌కు కేరళ, తమిళనాడు, హర్యానా

విశాలాంధ్ర–విజయవాడ స్పోర్ట్స్: విజయవాడలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కళాశాలలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్–19 బాలికల జాతీయ వాలీబాల్ టోర్నీ క్వార్టర్ ఫైనల్స్‌లో ఆంధ్ర ప్రదేశ్‌కు కేరళ జట్టు షాకిచ్చింది. కేరళపై ఏపీ జట్టు వరుస సెట్ల తేడాతో ఓటమిని చవిచూసి సెమీఫైనల్స్ ఆశలను అడియాసలు చేసుకుంది. కేరళ, ఆంధ్ర ప్రదేశ్ మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో కేరళ 3-0 (25-23, 25-20, 26-16) తో విజయం సాధించింది. తొలి సెట్‌లో ఏపీ జట్టు గట్టి పోటీ ఇచ్చినప్పటికీ, తర్వాత అదే జోరును కొనసాగించలేకపోయింది. తరువాతి సెట్‌లలో కేరళ ఆధిపత్యాన్ని కొనసాగించి సెమీస్‌లో చోటు దక్కించుకుంది. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో తమిళనాడు 3-1 (25-23, 25-15, 16-25, 25-14) తో విజయం సాధించింది. మూడో సెట్‌ను కోల్పోయిన తమిళనాడు పుంజుకుని విజయాన్ని అందుకోవడం ద్వారా సెమీస్‌కు చేరుకుంది. కాగా, హర్యానా–ఉత్తర ప్రదేశ్ మధ్య జరిగిన మూడో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో హర్యానా 3-0 (25-12, 25-23, 25-14) విజయంతో సెమీ ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. అంతకుముందు, ప్రీ-క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో ఆంధ్ర ప్రదేశ్, ఢిల్లీ, తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, హర్యానా, ఉత్తర ప్రదేశ్, పంజాబ్, కర్నాటక జట్లు తమ ప్రత్యర్థులను ఓడించి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాయి. కాగా ఈ పోటీలలో భాగంగా గురువారం సెమీ ఫైనల్స్, శుక్రవారం ఫైనల్స్ జరుగుతాయి.

11న వడ్డె ఓబన్న జయంతి వేడుకలు

రాష్ట్ర వేడుకగా నిర్వహించాలని ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

విశాలాంధ్ర బ్యూరో – అమరావతి: తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని ప్రతి ఏటా జనవరి 11న రాష్ట్ర వేడుకగా నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర సచివాలయంలోని అని విభాగాల్లో, జిల్లా కలెక్టరేట్ తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో జనవరి 11న వడ్డె ఓబన్న జయంతి వేడుకలను నిర్వహించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ (పొలిటికల్) ఎస్ సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.